

పేదలకు కడుపు నిండే కబురు! అన్నార్తుల ఆకలి బాధ తీర్చేందుకు అన్న క్యాంటీన్‌లను పునఃప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేసింది. చకచకా ఏర్పాట్లు చేస్తోంది. అల్పాహారం, భోజనం రూ.5 చొప్పున అందించనుంది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న అనంతరం చంద్రబాబు నాలుగో సంతకం దీనిపైనే చేశారు. అందుకనుగుణంగా ఒంగోలు నగర పాలక సంస్థతోపాటు, జిల్లాలోని ఇతర మునిసిపాలిటీల అధికారులు కదిలారు. వైసీపీ పాలనలో వివిధ కార్యాలయాలకు కేటాయించిన అన్న క్యాంటీన్‌ల భవనాలను ఖాళీ చేయించి సిద్ధం చేశారు. మరోవైపు ఇప్పటికే టీడీపీ నాయకులు, కార్యకర్తలు పలుచోట్ల మధ్యాహ్నం ఉచితంగా భోజనం అందిస్తున్నారు. కనిగిరిలో ఏడాదిన్నర నుంచి ఎమ్మెల్యే ఉగ్ర ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్ నడుస్తుండగా, ఎన్నికల తర్వాత నుంచి ఒంగోలులోని నాలుగు ప్రాంతాల్లో టీడీపీ నాయకులు స్వచ్ఛందంగా భోజనం పెడుతున్నారు. ప్రభుత్వం అన్న క్యాంటీన్‌లను పునః ప్రారంభించే వరకూ ఈ కార్యక్రమాన్ని కొనసాగించనున్నారు.



ఒంగోలులోని కలెక్టరేట్ వద్ద క్యాంటీన్‌లో ప్రజల బారులు

అన్నార్తులకు కడుపునిండా..!

క్యాంటీన్‌లు మళ్లీ తెరుచుకుంటున్నాయ్!

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 7 : పేదవాడి ఆకలి తీర్చే అన్న క్యాంటీన్‌లు సిద్ధమవుతున్నాయి. గత ఐదేళ్ల జగన్ పాలనలో మూతబడిన ఇవి ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పునఃప్రారంభమవుతున్నాయి. గతంలో రూ.5కే కడుపు నిండా భోజనం చేసిన వారికి తిరిగి అవే రోజులు రాబోతున్నాయి. పేదలకు పట్టెడన్నం పెట్టిన అన్న క్యాంటీన్‌లు మళ్లీ కళకళలాడనున్నాయి. టీడీపీ అధినేత చంద్రబాబు 2014 ఎన్నికలకు ముందు పేదల అకలి కష్టాలను దగ్గరగా గమనించారు. ఆసమయంలో అధికారంలోకి రాగానే అతి తక్కువ ధరకే ఆకలి తీరుస్తామని హామీ ఇచ్చారు. అందులో భాగంగానే 2014 సెప్టెంబరులో అన్న క్యాంటీన్‌లకు శ్రీకారం పలికారు. రాష్ట్రంలో 200 క్యాంటీన్‌లు ఏర్పాటు చేయగా అందులో ఒంగోలులో నాలుగు ఉన్నాయి. కనిగిరి, మర్కాపురం, చీరాల, అద్దంకి, గిద్దలూరుల్లోనూ గత టీడీపీ పాలనలో అన్న క్యాంటీన్‌లు నడిచాయి.

- చర్యలు వేగవంతం చేసిన ప్రభుత్వం
- తీరనున్న పేదల ఆకలి బాధ.. రూ.5కే భోజనం
- ఐదేళ్లుగా మూసివేసి కడుపుకొట్టిన వైసీపీ పాలకులు
- పునఃప్రారంభించాలని కూటమి సర్కారు నిర్ణయం
- ఇప్పటికే పలుచోట్ల స్వచ్ఛందంగా భోజనాలు పెడుతున్న టీడీపీ నాయకులు

తక్కువ ధరకే అల్పాహారం, భోజనం

అన్న క్యాంటీన్‌లలో అల్పాహారం కింద, ఇడ్లీ, ఉప్మా, పొంగల్ వీటిలో ఏదైనా ఒకటి రూ.5కే అందించారు. మధ్యాహ్న భోజనం కింద రూ.5కే 450 గ్రాముల అన్నం, పప్పు, కూర, అవసరాన్ని బట్టి గ్లాసు మజ్జిగ కూడా ఇచ్చారు. అందుకోసం ఒక్కో వ్యక్తికి రూ.63.23 ఖర్చవుతుండగా అందులో రోజుకు వారి వద్ద నుంచి వచ్చే రూ.15పోను మిగిలినది అప్పటి టీడీపీ ప్రభుత్వం భరించింది. అదేవిధంగా అప్పట్లో నిర్వహణ బాధ్యతను అక్షయ పాత్ర సంస్థకు అప్పగించగా, ఆతర్వాత జగన్ రెడ్డి అన్న క్యాంటీన్‌లను మూసివేయడంతో ఆ బాధ్యత నుంచి అక్షయ పాత్ర తప్పుకుంది.

పునఃప్రారంభంపై బాబు సంతకం

ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు తీసుకున్న వెంటనే అన్న క్యాంటీన్‌ల పునఃప్రారంభం ఫైల్‌పై సంతకం చేశారు. దీంతో పేదల ఆకలి కష్టాలు తీరనున్నాయి. కార్పొరేషన్, మునిసిపాలిటీల్లోని అన్న క్యాంటీన్ తలుపులు తెరుచుకునేందుకు సిద్ధమయ్యాయి. ఐదేళ్లుగా మూతబడిన వాటిని పునఃప్రారంభానికి టీడీపీ కూటమి ప్రభుత్వం తొలిరోజే నిర్ణయం తీసుకోవడంతో అందుకు అనుగుణంగా ఇప్పటికే వివిధ కార్యాలయాలకు కేటాయించిన అన్న క్యాంటీన్‌లను అధికారులు ఖాళీ చేయించారు.

ఆకలి తీర్చడమే లక్ష్యం

గ్రామీణ ప్రాంతాల నుంచి వివిధ పనుల నిమిత్తం, ఆసుపత్రుల్లో రోగుల కోసం వచ్చేవారు, వారి పర్యవేక్షణ కోసం ఇక్కడే ఉండే వారు, చాలీచాలని కూలితో రోజంతా పనిచేసే కార్మికులు, ఆటోడ్రైవర్లకు అన్న క్యాంటీన్‌లు వరంగా భావిస్తున్నారు. నగరంలోని పలు హోటళ్లలో రెండు ఇడ్లీల రేటు రూ.10 నుంచి 20 వరకూ ఉంది. దోశ రూ.10 నుంచి 25 వరకూ.. పూరీ, పొంగల్ ఇలా ఏది తినాలన్నా రూ.25కు తక్కువకు లభించే పరిస్థితి లేదు. మధ్యాహ్నం భోజనం చేయాలంటే కనీసం రూ.65 నుంచి రూ.90 వరకూ చెల్లించాల్సి వస్తోంది. మినీ మీల్స్‌తో సరిపెట్టుకుందామనుకునే వారు కూడా కనీసం రూ.40 చెల్లించనిదే కడుపు నిండే పరిస్థితి లేదు. రోజువారీ కూలీ రూ.300 వస్తున్న కార్మికుడు టీ, టిఫిన్, భోజనంతో సాయంత్రమయ్యే సరికి దాదాపు రూ.150 వరకూ ఖర్చుచేయాల్సి వస్తోంది. ఈనేపథ్యంలో ఏరోజుకారోజు కూలీనాలీ చేసుకునే వారికి అన్న క్యాంటీన్‌లు వరం కానున్నాయి. వీటి నిర్వహణ బాధ్యతలను తొలుత మెప్మాకు అప్పగించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

కనిగిరి, ఒంగోలులో ఇప్పటికే ఉచితంగా భోజనాలు

ప్రభుత్వం అన్న క్యాంటీన్‌లను పునఃప్రారంభిస్తున్న నేపథ్యంలో ముందస్తుగానే టీడీపీ నాయకులు స్వచ్ఛందంగా పేదలకు భోజనాలు పెడుతున్నారు. కనిగిరిలో ఏడాదిన్నర నుంచి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తన సొంత నిధులతో అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. అక్కడ రోజుకు సుమారు 300 నుంచి 400 మంది వరకూ పేదలు ఆకలి తీర్చుకుంటున్నారు. అలాగే ఒంగోలులో గతంలో నాలుగు అన్న క్యాంటీన్‌లు ఉండగా వైసీపీ అధికారంలోకి వచ్చాక వాటిని తొలగించింది. అయితే తాజాగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అభిమానులు స్వచ్ఛందంగా తిరిగి నాలుగు క్యాంటీన్‌ల వద్ద ఉచితంగా పేదలకు అన్నం పెడుతున్నారు. గత నెల 27న దామచర్ల వాటిని ప్రారంభించారు. కలెక్టరేట్ ఎదురు ఉన్న పాత రిమ్స్, కొత్తపట్నం బస్టాండ్ రైతుబజారు, కర్నూలు రోడ్ పవర్ ఆఫీసు వద్ద, కొత్తకూరగాయల మార్కెట్‌లో ఉన్న క్యాంటీన్‌లలో ప్రతి రోజూ ఒక్కోచోట 300 చొప్పున 1,200 మంది ఆకలి తీరుస్తున్నారు. ప్రభుత్వం అధికారికంగా అన్నక్యాంటీన్‌లు ప్రారంభించేవరకు టీడీపీ శ్రేణులు ఈ కార్యక్రమాన్ని కొనసాగించనున్నాయి.

పేదల కడుపు మాడ్చిన జగన్

పేదల ఆకలి తీర్చేందుకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లు నడిచిన అన్న క్యాంటీన్‌లను అధికారంలోకి రాగానే జగన్ ప్రభుత్వం తొలగించింది. పేరు మార్చి మళ్లీ తెరుస్తామని చెప్పి మోసం చేసింది. ఐదేళ్లపాటు పేదల కడుపు మాడ్చింది. అన్న క్యాంటీన్ భవనాలను సచివాలయాలు, పలుప్రైవేటు కార్యాలయాలకు కట్టబెట్టింది. దీంతో పేదలు అనేక అవస్థలు పడ్డారు. జగన్‌పై రగిలిపోయారు. అందుకు ప్రతిగా ఇటీవలి ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ఘోర పరాజయాన్ని బహుమతిగా ఇచ్చి గుణపాఠం చెప్పారు. తమ ఆకలి తీరాలంటే చంద్రబాబు మళ్లీ రావాలని ఆయనకు పట్టం కట్టారు.



కనిగిరి అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న వృద్ధులు, యువకులు

ఇసుక.. చౌక

- నేటి నుంచి మూడు నిల్వ కేంద్రాల వద్ద విక్రయాలు
- టన్ను ధర రూ.247
- సీనరేజీ వసూలు చేయకూడదని ప్రభుత్వ నిర్ణయం
- చతుకుపాడులో ప్రారంభించనున్న మంత్రి స్వామి
- రోజుకు ఒకరికి 20 టన్నుల పరిమితి

ఒంగోలు (క్రైం), జూలై 7 : ప్రజలకు ఇసుక కష్టాలు తీరనున్నాయి. నిర్మాణ రంగానికి మళ్లీ మంచిరోజులు రాబోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం నుంచి జిల్లాలోని నిల్వ కేంద్రాల్లో ఇసుక విక్రయాలు ప్రారంభవుతున్నాయి. అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను యంత్రాంగం పూర్తి చేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక ధరలు కొండెక్కాయి. దీంతో నిర్మాణ రంగం కుదేలైంది. వేలాది మంది భవన కార్మికులకు ఉపాధి కూడా దొరకని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం నూతన ఇసుక విధానంపై దృష్టి సారించింది. ఈ లోపు నిర్మాణదారులకు ఇబ్బందులు లేకుండా ఇసుకను చౌకగా ఇచ్చేందుకు సిద్ధమైంది. రవాణా చార్జీలు మాత్రమే వసూలు చేయాలని నిర్ణయించింది.

నేటి నుంచి విక్రయాలు ప్రారంభం

ఇసుక విక్రయాలకు సోమవారం నుంచి శ్రీకారం చుట్టనున్నారు. జరుగుమల్లి మండలం చతుకుపాడులో ఉన్న రెండు నిల్వ కేంద్రాల వద్ద రాష్ట్ర మంత్రి డాక్టర్ స్వామి ప్రారంభించనున్నారు. ఒంగోలులోని మార్కెట్ యార్డులో ఉన్న ఇసుక నిల్వకేంద్రం వద్ద ఎమ్మెల్యే జనార్దన్ ప్రారంభిస్తారు. అందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లాస్థాయి కమిటీలో నిర్ణయం తీసుకున్నారు. అక్రమంగా తరలిస్తూ పట్టుబడితే ట్రాక్టర్‌కు రూ.10 వేలు, లారీకి రూ.25వేలు జరిమానా విధించనున్నారు. అందుకోసం ప్రత్యేక నిఘా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు.

మూడుచోట్ల ఇసుక నిల్వలు

జిల్లాలో మొత్తం ఏడు ఇసుక నిల్వ కేంద్రాలు ఉండగా ప్రస్తుతం ఒంగోలు మార్కెట్‌యార్డ్, చతుకుపాడు-1,2లలో మాత్రమే ఇసుక నిల్వ ఉంది. అవసరమైన వారు వీటి వద్ద డిజిటల్ పేమెంట్ ద్వారా టన్నుకు రూ.247 చెల్లించి తీసుకెళ్లేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. అక్కడి నుంచి రవాణా ఖర్చులు కొనుగోలుదారులే భరించాలి. ఒక్కొక్కరు రోజుకు 20 టన్నులు మాత్రమే తరలించుకునే అవకాశం ఉంది.

రవాణా చార్జీలు మాత్రమే వసూలు

ఒంగోలు మార్కెట్ యార్డులో ఉన్న ఇసుకను నెల్లూరు నుంచి తెచ్చి నిల్వ చేశారు. దీంతో అక్కడ లోడింగ్, ఒంగోలుకు తరలించేందుకు రవాణా చార్జీలను కలిపి టన్ను ధర రూ.247గా నిర్ణయించారు. చతుకుపాడు వద్ద కూడా ఇదే ధర చెల్లించాల్సి ఉంటుంది. ఎలాంటి సీనరేజీ వసూలు చేయకుండా ఉచితంగా సరఫరా చేయనున్నారు. ట్రాక్టర్ ట్రక్కులో 5 టన్నులు తరలించవచ్చు. ఆ ప్రకారం రూ.1,225కే ట్రక్కు ఇసుక అందుబాటులోకి రానుంది. గత ప్రభుత్వ హయాంలో వసూలు చేసిన దానికంటే సగం ధరకే లభించనుంది.



ఒంగోలులోని ఇసుక నిల్వ డంప్

ప్రజలకు చేరువగా.. సమస్యలపై చురుకుగా..

- కొత్త కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పీడు
- పదిరోజుల్లో పలు అంశాలపై దృష్టి
- క్షేత్రస్థాయిలో పరిశీలనలకు ప్రాధాన్యం
- కీలక అంశాలపై లోతైన సమీక్ష
- అధికారులు, సిబ్బందిలో జవాబుదారీతనం పెంపునకు ప్రయత్నం
- ప్రభుత్వ కార్యక్రమాల విజయవంతానికి చర్యలు
- నేడు మార్కాపురంలో 'మీ కోసం' అర్జీల స్వీకరణ

ఒంగోలు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఎక్కువ సమయం గడుపుతూ క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లకుండా పాలన సాగించే పరిస్థితికి భిన్నంగా ప్రస్తుత కలెక్టర్ తమీమ్ అన్సారియా ముందుకు సాగుతున్నారు. ప్రజలకు చేరువగా, వారి సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పది రోజుల్లోనే పలు కీలక అంశాలపై దృష్టి సారించారు. క్షేత్రస్థాయిలో సమస్యల పరిశీలనతోపాటు ప్రధానాంశాల్లో లోటుపాట్లు సరిచేసేలా లోతైన సమీక్షలు చేస్తున్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాల విజయవంతానికి చర్యలు చేపడుతున్నారు. జిల్లాకు 38వ కలెక్టర్‌గా తమీమ్ అన్సారియా గత నెల 27న బాధ్యతలు స్వీకరించారు. ఈ పదిరోజుల్లో పనితీరులో దూకుడుగానే ఆమె సాగుతున్నారు. నూతనంగా ఏర్పడిన టీడీపీ కూటమి ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు, కీలక ప్రజాప్రతినిధులతో సమన్వయానికి ప్రాధాన్యం ఇస్తున్నారు.

వెలిగొండపై దృష్టి

జిల్లాకు సంబంధించి కీలకమైన వెలిగొండ ప్రాజెక్టు వ్యవహారంపై తొలుత కలెక్టర్ దృష్టి సారించారు. ఇంజనీరింగ్, రెవెన్యూ, ఇతర అధికారులతో తాను బాధ్యతలు స్వీకరించిన మూడునాలుగు రోజుల్లోనే లోతైన సమీక్ష నిర్వహించిన అన్సారియా ఆ మరుసటి రోజే ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతాన్ని, నిర్వాసిత గ్రామాలు, పునరావాస కాలనీలను సందర్శించారు. అధికారులతో మాట్లాడి సమస్యలను అవగాహన చేసుకున్న ఆమె వాటి పరిష్కారం, ప్రాజెక్టుకు ఉన్న ఆటంకాలు, తొలగింపు లక్ష్యంగా చర్యలు ప్రారంభించారు.

ఉచిత ఇసుకపై సత్వర స్పందన

రాష్ట్ర ప్రభుత్వం తొలిహామీ అమలుగా చేపట్టిన పెంచిన పింఛన్ల పంపిణీ ప్రక్రియ ఎలాంటి అవరోధాలు లేకుండా పూర్తి చేయించారు. ఉచిత ఇసుక విధానం సత్వర అమలుపై వేగంగా స్పందించి చర్యలు తీసుకున్నారు. అలాగే జిల్లాలో కీలకంగా ఉండే ఉపాధి పథకం అమలులో లోటుపాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆశాఖకు సంబంధించిన మండల స్థాయి అధికారులు, సిబ్బందితో డ్వామా కార్యాలయానికి వెళ్లి మరీ సమీక్ష నిర్వహించారు. లోపాలు సరిదిద్దుకొని పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేలా దిశానిర్దేశం చేశారు. కొణిజేడు ప్రాంతంలో వాటర్‌షెడ్ పనులను స్వయంగా పరిశీలించి ఆయా అంశాలపై ప్రత్యేక దృష్టి ఉంటుందన్న సంకేతాలు ఇచ్చారు. తాగునీటి సరఫరా, వైద్య ఆరోగ్య ఇతర కీలక శాఖలపైనా అలాంటి సమీక్షలే నిర్వహించి నిర్దిష్ట సూచనలు చేశారు.

ప్రజాప్రతినిధులతో సమన్వయం...

పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి డాక్టర్ స్వామితో కలిసి రాజంపల్లిలో పాల్గొన్న కలెక్టర్ తర్వాత కూడా తన పర్యటనల సమయంలో స్థానిక కీలక ప్రజాప్రతినిధులతో సమన్వయానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. పశ్చిమ ప్రాంతంలో నీటి సమస్య విషయంలో ప్రజాప్రతినిధులు తన దృష్టికి తెచ్చిన అంశాలపై అధికారులను అప్రమత్తం చేశారు.

వినతుల పరిష్కారానికి చర్యలు

కలెక్టర్ అన్సారియా అధికారులతో నిర్వహించిన తొలి సమావేశంలోనే ప్రజల వినతులు సత్వర పరిష్కారం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వినతుల స్వీకరణలోనూ ప్రజలకు అందుబాటులోకి వెళ్లాలన్న ఆలోచన చేశారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించాక తొలి సోమవారం జిల్లా కేంద్రంలో మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న ఆమె రెండో సోమవారమైన ఈనెల 8 మార్కాపురంలో జరిగే కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఆప్రాంత ప్రజలు జిల్లా కేంద్రానికి రావడానికి వ్యయప్రయాసాలు పడాల్సి వస్తున్న నేపథ్యంలో ఆప్రాంతానికే యంత్రాంగంతో తరలివెళ్తున్నారు. తమకు మేలు జరిగేలా ఆకాంక్షలకు, కొత్త ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా కలెక్టర్ అన్సారియా ముందుకు సాగాలని జిల్లా ప్రజానీకం కోరుతోంది.



పునరావాస కాలనీలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

విచారణాధికారి చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

- పల్లామల్లి సొసైటీ సీఈవో ఫిర్యాదుపై స్పందించిన అధికారులు
- విచారణ చేపట్టిన డీసీవో
- కలెక్టర్, సహకార శాఖ కమిషనర్‌కు నివేదిక
- సీఎం, ఉన్నతాధికారులకు సొసైటీల ఉద్యోగుల సంఘం ఫిర్యాదు

ఒంగోలు (విద్య), జూలై 7 : చీమకుర్తి మండలం పల్లామల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ)లో జరిగిన అక్రమాలపై విచారణాధికారి అయిన బి.వి.ఎస్.కృష్ణశాస్త్రి చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధమైంది. పల్లామల్లి సొసైటీ సీఈవో బి.వి. రమణయ్య ఫిర్యాదుపై అధికారులు స్పందించారు. విచారణ నిర్వహించి కృష్ణశాస్త్రిపై చర్యలకు ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించారు. తాజాగా ఏపీ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగులు సంఘం కూడా రంగంలోకి వచ్చింది. విచారణాధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

డీసీవో విచారణ

సొసైటీ సీఈవో రమణయ్య ఫిర్యాదు మేరకు డీసీవో శ్రీనివాసరెడ్డి పల్లామల్లి సొసైటీకి వెళ్లి విచారణ నిర్వహించారు. విచారణాధికారి దూషణలను భరించలేకపోతున్నానని, తనను సస్పెండ్ చేయాలని ఈ సందర్భంగా సీఈవో కోరారు. సమగ్ర విచారణ అనంతరం డీసీవో తన నివేదికను కృష్ణశాస్త్రిపై తగు చర్యల నిమిత్తం కలెక్టర్‌కు అందజేశారు. ఈ మొత్తం వ్యవహారంపై మరో సమగ్ర నివేదికను రాష్ట్ర సహకారశాఖ కమిషనర్‌కు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపించినట్లు డీసీవో 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

విచారణాధికారిని మార్చాలి

పల్లామల్లి సొసైటీ సీఈవో రమణయ్యను వేధింపులకు గురిచేస్తూ దుర్భాషలాడుతున్న విచారణాధికారిని వెంటనే మార్చాలని ఏపీ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విచారణాధికారి బెదిరింపులకు దిగడం, జుగుప్సాకరంగా మాట్లాడటం వంటి చర్యలను వారు ఖండించారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈమేరకు వారు సీఎంతోపాటు సహకార శాఖ కమిషనర్, కలెక్టర్, డీసీవో, డీఎల్‌సీవోలకు ఫిర్యాదు చేశారు.



పల్లామల్లి సొసైటీ భవనం

విచారణ విషయంలో నిర్లక్ష్యం.. సీఈవోపై అసభ్యపదజాలం

పల్లామల్లి సొసైటీలో భారీగా ఆర్థిక అక్రమాలు చోటుచేసుకున్నాయి. దీనిపై సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి.వి.ఎస్.కృష్ణశాస్త్రిని విచారణాధికారిగా నియమించారు. అయితే విచారణ విషయంలో ఆయన తీవ్ర అలసత్వం ప్రదర్శించారు. దీంతో డీసీవో శ్రీనివాసులురెడ్డి రెండుసార్లు హెచ్చరికలు జారీ చేశారు. తీరా విచారణకు ఆదేశించిన ఆరునెలల తర్వాత కేవలం 2022-23 సంవత్సరం రికార్డులు మాత్రమే పరిశీలనకు స్వాధీనం చేసుకున్నారు. ఈలోపు అసలు విచారణ జరగకుండా అడ్డుకొనేందుకుకు సొసైటీ సీఈవో ద్వారా విచారణాధికారి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో విచారణ తప్పని సరైంది. ఈ క్రమంలో కృష్ణశాస్త్రి సొసైటీ సీఈవో రమణయ్యను వ్యక్తిత్వహననం చేస్తూ అసభ్యపదజాలంతో అనరానిమాటలు అనడం ప్రారంభించారు. సహకార శాఖ ఉన్నతాధికారులనూ దూషించారు. విచారణ నిలిపివేసేందుకు విచారణాధికారే హైకోర్టు లాయర్‌తో సంభాషించడం, సొసైటీ సీఈవో, ఉన్నతాధికారులను దూషించడం ఇవన్నీ రికార్డు అయి సహకార శాఖలో వైరల్‌గా మారాయి. ఈనేపథ్యంలో సీఈవో రమణయ్య డీసీవోను విచారణాధికారి దూషించిన ఆడియోలతో ఫిర్యాదు చేశారు.

అక్రమాలు బయట పడేనా?

- 2002లో భర్తీ చేసిన పోస్టులపై ఇప్పుడు విచారణ
- వైద్యశాఖలో విచిత్ర పరిస్థితి

ఒంగోలు (కలెక్టరేట్), జూలై 7 : జిల్లా వైద్యారోగ్యశాఖలో విచిత్ర పరిస్థితి నెలకొంది. 22 ఏళ్ల క్రితం భర్తీ చేసిన ఉద్యోగాలపై విచారణకు వైద్యశాఖ ఉన్నతాధికారులు సిద్ధమయ్యారు. 2002లో ప్రకాశం, గుంటూరు, నెల్లూరు ఉమ్మడి జిల్లాల్లో భారీగా మేల్ హెల్త్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేశారు. వాటిల్లో అక్రమాలు జరిగాయని తూర్పుగోదావరికి చెందిన తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు 2018 జూలై 9వతేదీన ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. అనర్హులకు ఉద్యోగాలు కట్టబెట్టారని ఆయన ఆరోపించారు. ఆరేళ్లుగా దీని గురించి అధికారులు పట్టించుకోలేదు. ఇప్పుడు విచారణకు సిద్ధమయ్యారు. ఆయా జిల్లాల్లో అప్పట్లో చేపట్టిన నియామకాలకు సంబంధించిన రికార్డులతో విచారణకు హాజరు కావాలని పది రోజుల క్రితం ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈనెల 3వతేదీన గుంటూరు జిల్లాకు సంబంధించిన పోస్టుల నియామకంపై విచారించారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు సంబంధించి విచారణ జరగాల్సి ఉంది. మన జిల్లాకు సంబంధించిన విచారణ ఈనెల 5న చేపట్టాల్సి ఉండగా వాయిదా పడింది. వైద్యశాఖలో పోస్టుల భర్తీపై అనేక ఆరోపణలు వస్తున్నా సంబంధిత శాఖల అధికారులు సకాలంలో పట్టించుకోకపోవడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడిందన్న విమర్శలు వస్తున్నాయి. 22 ఏళ్ల తర్వాత చేస్తున్న విచారణలో అసలు అక్రమాలు బయటపడతాయా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



డీఎంహెచ్‌వో కార్యాలయం

ప్రజారోగ్యంతో చెలగాటం..!

నివాసాల మధ్య కళేబరాల కంపు ● చనిపోయిన జంతువుల వ్యర్థాలతో వ్యాపారం ● కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవాలని స్థానికుల వినతి

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 7 : ఒంగోలు నగరంలో కొందరు వైసీపీ నాయకులు ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. జంతు కళేబరాల వ్యర్థాలతో వ్యాపారం చేస్తూ ప్రశ్నించిన వారిపై దౌర్జన్యానికి దిగుతున్నారు. కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే.. నగరంలోని విజయనగర్‌కాలనీలో కొండను ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో వైసీపీకి చెందిన కొందరు పాగా వేశారు. అక్కడికి చనిపోయిన జీవాల కళేబరాలను తీసుకువచ్చి తమకు ఉపయోగపడే భాగాలను వేరు చేస్తున్నారు. మిగిలిన వ్యర్థాలను అక్కడే వదిలేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతోంది. సమీపాల్లోని నివాసాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. దీనికి తోడు జంతు కళేబరాల వ్యర్థాలను కుక్కలు నివాసాల మధ్యకు తీసుకురావడం మరింత సమస్యగా మారింది.



ప్లాస్టిక్ డబ్బాలో వ్యర్థపదార్థాలు



ఆరుబయట ఉంచిన జంతు కళేబరాల వ్యర్థాలు

ప్రశ్నించిన వారిపై దాడి..

విజయనగర్‌కాలనీలోని కొండ సమీపంలో జరుగుతున్న జంతు కళేబరాల వ్యాపారంతో అనారోగ్య సమస్యలు వస్తున్నాయని, కంపుతో ఇళ్లలో కూడా ఉండలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. నిర్వాహకులను ప్రశ్నిస్తే తమపై దాడి చేస్తున్నారని మహిళలు కొందరు ఒంగోలు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్పొరేషన్ అధికారులు, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దృష్టికి కూడా తీసుకెళ్లారు. దీంతో వైసీపీకి చెందిన తమ్మిశెట్టి బసవయ్య, ఆయన కుమారులు శ్రీను, శివకృష్ణ, కమల, లలిత, మరికొంతమంది తమపై దౌర్జన్యాలు, దాడులకు దిగుతున్నారని బాధితులు వాపోయారు.

పట్టించుకోని అధికారులు

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన కార్పొరేషన్ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. నివాసాల మధ్య జంతు కళేబరాల వ్యాపారం జరుగుతుంటే కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీకి చెందిన వారు అయినందున వారిపై చర్యలు తీసుకునేందుకు వెనకడుగు వేస్తున్నారన్నారు. వెంటనే స్పందించకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదుచేయడంతోపాటు, కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగుతామని వారు హెచ్చరిస్తున్నారు. పోలీసులు తమకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.



ఆక్రమిత స్థలంలో కళేబరాలను కోస్తున్న నిర్వాహకులు

వైభవంగా పోలేరమ్మకు పొంగళ్లు

● హాజరైన మంత్రి స్వామి, ఎమ్మెల్యే దామచర్ల



పోలేరమ్మ ఆలయ ప్రాంగణంలో మంత్రి స్వామి, ఎమ్మెల్యే జనార్దన్

టంగుటూరు, జూలై 7 : టంగుటూరు మండలంలోని తూర్పునాయుడుపాలెంలో ఆదివారం పోలేరమ్మ పొంగళ్లు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పోలేరమ్మ, బంగారమ్మ గుళ్లలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ స్వగ్రామంలో జరుగుతున్న పొంగళ్ల కార్యక్రమంలో పాల్గొన్నారు. పొంగళ్ల నిర్వాహకులు వీరిని ఘనంగా ఆహ్వానించారు.

వేధింపులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 7 : తన ప్రాథమిక హక్కులను భంగం కలిగిస్తూ అనేక విధాలుగా వేధింపులకు గురిచేస్తున్న వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని విశ్వశాంతి యానిమల్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షురాలు కేవీ.శాంతలక్ష్మి డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ ఎదుట ఆదివారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగర పాలక సంస్థ పరిధిలోని పేర్నమిట్ట వద్ద తాను నివాసం ఉంటున్నానని తెలిపారు తమ ఇంటి వద్ద ఉన్న కొంతమంది పోలీసులతో కలిసి వ్యభిచారాన్ని నిర్వహిస్తూ తన మీద, జంతవుల మీద, జంతు వాహనాలపై నిత్యం దాడులు చేస్తున్నారని ఆరోపించారు ఈ విషయాన్ని అనేకసార్లు తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. తాను అనేక సంవత్సరాలుగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నానని తెలిపారు. ఇటీవల తమ సంస్థకు చెందిన కారును పార్కింగ్ చేయగా ఆ కారుపై దాడి చేసి పగుల కొట్టారని ఆరోపించారు. తన కారును బాగు చేయించడంతో పాటు తనపై దాడి చేసిన వారిని అరెస్టు చేసి శిక్షించాలని కోరారు. అనేకసార్లు స్పందనలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనతో పాటు జంతువులను రక్షించాలని ఆమె కోరారు.

మాదిగ జాతి హక్కుల సాధనే లక్ష్యం



జనజాతర సభలో మాట్లాడుతున్న బ్రహ్మయ్యమాదిగ

నాగులుప్పలపాడు, జూలై 7 : మాదిగ జాతి హక్కుల సాధనే ఎంఆర్‌పీఎస్ లక్ష్యమని ఆ సంస్థ అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్యమాదిగ పేర్కొన్నారు. ఈదుమూడిలో ఆదివారం నిర్వహించిన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 30వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన మాదిగ జన జాతర సభలో ఆయన మాట్లాడారు. వేల శతాబ్దాల మాదిగ జాతి చరిత్రలో ఎంఆర్‌పీఎస్ ఉద్యమం ఒక సువర్ణ అధ్యాయాన్ని లిఖించిందన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తితో మాదిగ జాతి హక్కుల సాధన కోసం ఈదుమూడిలో 18 మందితో ఏర్పడిన ఎంఆర్‌పీఎస్ ఉద్యమం జాతీయస్థాయిలో మారు మోగిందని చెప్పారు. మాదిగలను స్వతంత్ర శక్తులుగా ఎదగనీయకుండా, రాజ్యాధికారం కనుచూపు మేరలో కనిపించకుండా చేసే కుట్ర జరుగుతుందని, దానిని తిప్పి కొట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. ఒక నూతన ప్రజాస్వామిక మాదిగ ఉద్యమాన్ని నిర్మించుకొందామని పిలుపు నిచ్చారు. తొలుత గ్రామంలో డప్పు కళాకారులు నృత్యాలతో ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్, జగజ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రావినూతల కోటి, కోమ్మూరి గరటయ్య, ఓయులా కాలేజీ ప్రిన్సిపాల్ గాలి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

చీమకుర్తి, జూలై7 : నియోజకవర్గ పరిధిలోని రామతీర్థం, గుండ్లకమ్మ రిజర్వాయర్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలని టీడీపీ నాయకుడు అవిశనేని వెంగన్న ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్టులపై అవలంబించిన వైఖరి వలన కల్గిన రైతులు ఇబ్బందిపడ్డారన్నారు. అందువల్ల ప్రాజెక్టులను అభివృద్ధి చేసిన తాగు, సాగు నీటికి ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు.

విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలి : బీటీఏ



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 7: విద్యారంగ సమస్యలపై నూతన ప్రభుత్వం దృష్టి సారించాలని బీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టే రమేష్ కోరారు. ఒంగోలులోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబరు 117 ద్వారా ప్రాథమిక విద్య అస్తవ్యస్తమైందని, అందువల్ల దానిని రద్దు చేయాలని కోరారు. ఈ విద్యా సంవత్సరంలో హైస్కూలు ప్లస్‌గా కొన్ని పాఠశాలలను ఉన్నతీకరించారని, సిబ్బందిని కేటాయించాలని చెప్పారు. అనంతరం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పర్రె వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల మాధ్యమాన్ని బలోపేతం చేయాలని కోరారు. అందుకోసం ఉపాధ్యాయులకు కమ్యూనికేటివ్ ఇంగ్లీషుపై ఆఫ్‌లైన్‌లో శిక్షణ ఇవ్వాలని ఆయన కోరారు. అలాగే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి ఏల్చూరి మాధవరావు, డి.మాల్యాద్రి, పారామత్తిన జాలరామయ్య, పల్లం వేణుగోపాల్, దాసరి ప్రసాద్, కర్ర దేవసహాయం, ఎద్దు రమేష్, మిరియాల వెలుగొండయ్య, జేఎస్ఎన్.మూర్తి, ఆర్.మనోహర్, చెక్క కోటేశ్వరరావు, కొండమూరి కొండలరాయుడు, పల్లె తిరుపతిస్వామి, కొప్పుల కిషోర్, నన్నేసాని భాస్కర్, అల్లరి విజకుమార్, పికా బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



ఒంగోలులో కేక్ కట్ చేసి పంచుతున్న ప్రభుదాస్



చీమకుర్తిలో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 7: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవం, ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ జన్మదిన వేడుకలు ఆదివారం ఒంగోలులో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సమితి నగర అధ్యక్షుడు గుంటూరి ప్రభుదాస్ ఆధ్వర్యంలో నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించడంతోపాటు, స్థానిక హెచ్‌సీఎం సెంటర్, కలెక్టరేట్ వద్ద, నెల్లూరు బస్టాండ్ వద్ద డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి సంతోషాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుదాస్ మాట్లాడుతూ మాదిగ జాతి కోసం మంద కృష్ణ మాదిగ పోరాట ఉద్యమం మొదలై 30 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం కృష్ణమాదిగ అలుపెరగని పోరాటం చేశారని, ఆయన బాటలో తాము ముందుకు సాగుతాయని తెలిపారు. బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి గెలుపు కోసం మంద కృష్ణమాదిగ నేతృత్వంలో తామంతా కష్టపడి పని చేసినట్లు చెప్పారు. ఎస్సీ వర్గీకరణ చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇవ్వడం మరింత ఆనందంగా ఉందన్నారు. మాదిగ జాతి పోరాటానికి ప్రతిఫలం వర్గీకరణ ఫలాలు అతి త్వరలోనే రాబోతున్నాయని ప్రభుదాస్ పేర్కొన్నారు. తనను నగర అధ్యక్షుడిగా నియమించినందుకు కృష్ణమాదిగకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహాజనసోషలిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకులు పాలడుగు రమేష్, ఆదిమూలపు సందీప్, పసుమర్తి మనోరంజన్, నాయకులు పాల్గొన్నారు. అలాగే ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి తొరటి ఆనంద్‌మాదిగ ఆధ్వర్యంలో నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించి కేక్ కటింగ్ చేశారు.

చీమకుర్తిలో..

చీమకుర్తి : మాదిగరిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకదినోత్సవం, వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకలను చీమకుర్తి పట్టణంతోపాటు పలు గ్రామాల్లో ఆదివారం ఘనంగా జరిపారు. జెండాలను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బొంతా దాస్, జిల్లా నాయకులు పాలెపోగు బాబురావు, నియోజకవర్గ ఇన్‌చార్జి పాటిబండ్ల జక్రయ్య, వెంకటేశ్వర్లు, వంశీ, జడ విజయ్ పాల్గొన్నారు.

కూటమి శ్రేణులకు అండగా నిలుస్తా

● ఎమ్మెల్యే బీఎన్

చీమకుర్తి, జూలై7 : టీడీపీ కూటమి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసిన ప్రతిఒక్కరికీ అండగా నిలుస్తానని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని బూసరపల్లి గ్రామంలో ఎన్ఆర్ఐ తక్కెళ్లపాటి రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన అభినందనసభకు విజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా వచ్చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, అభిమానులు ఎమ్మెల్యే బీఎన్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు గొట్టిపాటి రాఘవరావు, రాజా, కడియాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బీఎన్‌ను సత్కరిస్తున్న ఎన్ఆర్ఐ తక్కెళ్లపాటి రమేష్

కంభంలో గంజాయి, మత్తుపదార్థాల కలకలం

ఐదుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

150 గ్రాముల గంజాయి ప్యాకెట్లు స్వాధీనం

కంభం, జూలై 7: కంభం పట్టణంలో గంజాయి, ఇతర మత్తుపదార్థాల కలకలం రేపింది. గంజాయి సేవించి అనుమానాస్పదంగా తిరుగుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్న ఎస్సై పులిరాజేష్ వారి దుస్తులు వెతికారు. వారి వద్ద సుమారు 150 గ్రాములు ఉన్న 4 గంజాయి పొట్లాలు లభ్యమయ్యాయి. ఈ ఐదుగురిలో ఇద్దరు మార్కాపురం వాసులు కాగా ముగ్గురు కంభానికి చెందిన వారు ఉన్నారు. ఈ గంజాయి ఎవరు సరఫరా చేస్తున్నారని పోలీసులు తమదైన శైలిలో ప్రశ్నించగా యర్రగొండ పాలెం నుంచి ప్రతిరోజు ఒక వ్యక్తి తమకు అందజేస్తాడని చెప్పినట్లు సమాచారం. వీరు ఇచ్చిన సమాచారం మేరకు ఎర్రగొండపాలెం గంజాయి సరఫరా చేసే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.



స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు



మెడికల్ షాపును తనిఖీ చేస్తున్న అధికారులు

పలు మెడికల్ దుకాణాల్లో తనిఖీ

కాగా కంభం పట్టణంలో పలువురు యువకులు మత్తుపదార్థాలు సేవిస్తున్నారనే సమాచారంతో జిల్లాలోని డ్రగ్స్ అధికారులు కంభం పోలీసులు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న మెడికల్ దుకాణాల్లో తనిఖీ చేశారు. మత్తును కలిగించే పలు మాత్రలను స్వాధీనం చేసుకున్నారు. ఏదిఏమైనా యువత గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటు పడటం పట్టణంలో కలకలం రేపింది.

జగనన్న కాలనీలో తేలని ఇంటి పట్టాల లెక్క

ఒకేప్లాటుకు ఇరువురికి పట్టాలు

36 నెలలుగా పూర్తికాని విచారణ

పట్టాలు మార్చిన ఉద్యోగులపై చర్యలు శూన్యం



మిల్లంపల్లి టోల్‌ప్లాజా వద్ద జగనన్నకాలనీ

ఎర్రగొండపాలెం, జూలై 7 : పేదలకోసం ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో లెక్కకు మించి పట్టాలు మంజూరు చేశారు. దీంతో ఒకే పట్టా నంబరు ఇద్దరికి మంజూరు కావడంతో జగనన్న కాలనీలో పట్టాల సమస్య పరిష్కరించాలని కాళ్లు అరిగేలా తహసీల్దారు కార్యాలయం చుట్టూ లబ్ధిదారులు తిరుగుతున్నారు. దీనిపై విచారిస్తామన్న అధికారులు మూడేళ్లగా నానుస్తున్నారు. తహసీల్దారు కార్యాలయంలో పనిచేసే వీఆర్వోలు ఒకే పట్టాను ఇద్దరికి ఇచ్చి వివాదాలు సృష్టించారు. నేటికి ఆ వీఆర్వోలపై ఎలాంటి చర్యలు లేవని బహిరంగంగా విమర్శలు వినిపిస్తున్నాయి. 2022 మార్చి నుంచి లబ్ధిదారులు వినతిపత్రాలు ఇస్తున్నా సమస్య మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది. 2022 మార్చినెల నుంచి ఇప్పటి వరకు ముగ్గురు ఇన్‌చార్జ్ తహసీల్దార్లు ఒక రెగ్యులర్ తహసీల్దార్ల పర్యవేక్షణలో అధికారులు విచారించడం మినహా సమస్య పరిష్కారం కావడం లేదని లబ్ధిదారులు తెలియజేస్తున్నారు.

ఎర్రగొండపాలెం సమీపంలోని మిల్లంపల్లి టోల్‌ప్లాజా వద్ద ప్రభుత్వభూమిలో జగనన్న కాలనీలో 2020లో పేదలకోసం 1316 ప్లాట్లుతో ప్లాన్ వేసి జిల్లా కలెక్టర్ నుంచి మంజూరు ఉత్తర్వులు పొందారు. 1316 లే-అవుట్ పట్టాలలో 1057 పట్టాలు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 84 పట్టాలు సామాజిక అవసరాల కోసం అని ఉంచారు. పీఆర్‌కే నంబరు వచ్చి పట్టాలు మంజూరైన మహిళలు పట్టాలు చేతికి అందలేదని 36 నెలలుగా తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఇప్పటికీ 209 మందికి పట్టాలు చేతికి అందక వచ్చిన అధికారికల్లా అర్జీలు ఇస్తూనే ఉన్నారు.

ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న ఓ మహిళకు పీఆర్‌కే నంబరు 00048852 నెంబరు ఉన్నప్పటికీ, ఇప్పటికి పట్టా మంజూరు చేయకుండా తిప్పుతున్నారు. అంబేడ్కర్ నగర్ చెందిన భారతమ్మ, ఎర్రగొండపాలెం పట్టణానికి చెందిన మస్తాన్‌బీలకు పట్టా మంజూరు కాలేదు. 01455780 పీఆర్‌కే నెంబరు ఉన్న నార్నపాటి వెంకటమ్మ, పీఆర్‌కే నంబరు 01424506 నార్నపాటి ప్రియాంకలకు పట్టాలు పంపిణీ చేయలేదు. మహిళలు పలుదఫాలు తహసీల్దారు ఆఫీసులో వినతులు సమర్పించారు. 209 మంది లబ్ధిదారులకు చెందిన పట్టాలు ఎవరు గల్లంతు చేశారనే మిస్టరి వీడలేదు. పంపిణీ జరిగిన 1057 పట్టాలలో 60మందికి ఒకే ప్లాటు నంబరుతో ఇరువురు లబ్ధిదారులకు ఒకే పట్టాను పంపిణీ చేశారు. ఒకే ప్లాటును ఇరువురు లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేయడంతో వారు గొడవ పడుతున్నారు. నటుకుల సునీత అనే మహిళకు పట్టా నెంబరు లేకుండా తహసీల్దారు సంతకంలో ఖాళీ పట్టాపంపిణీ చేశారు. దాదాపు 8 మందికి పట్టా నెంబరు లేకుండా పట్టాలు పంపిణీ చేశారు. పట్టాలు పంపిణీలో కొందరు బినామీ పట్టాలు పొంది వాటిని అప్పుడే విక్రయిస్తున్నారు. పట్టాల పంపిణీ సమయంలో ఒక్కొక్క పట్టాకు రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు లబ్ధిదారుల నుంచి అప్పటిలోనే వసూళ్ల చేసినట్లు సమాచారం. పట్టాలు పంపిణీలో జరిగిన అవకతవకల పై తహసీల్దార్లు కార్యాలయం నుంచి 2022నుంచి డిప్యూటీ తహసీల్దారు, ఆర్.ఐల పర్యవేక్షణలో విచారించినా, పట్టాలు లెక్కతేలలేదు. పట్టాలు ఇచ్చి స్థలాలు స్వాధీనం చేయలేదని లబ్ధిదారులు గతంలో 'గడప, గడపకు ప్రభుత్వ కార్యక్రమం'లో చెప్పడంతో అప్పటి రాష్ట్రపురపాలక, పట్టణాభివృద్ధి శాఖమంత్రి ఆదిమూలపు సురేష్ 2022 సెప్టెంబరు 6వ తేదీ ఆయనే స్వయంగా రెవెన్యూ అధికారులతో కలిసి జగనన్న లే-ఔట్ కాలనీలో పర్యటించి మ్యాపులను తనిఖీ చేశారు. అప్పటి ఈ నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి సురేష్ తహసీల్దార్‌ను సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది అనంతరం సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమి చెంది రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడింది. ప్రస్తుతం కొత్త ప్రభుత్వంపై లబ్ధిదారులు ఆశలు పెట్టుకున్నారు. జగనన్న లే-ఔట్‌లో 1316 పట్టాలలో 400 పట్టాలు పొందిన లబ్ధిదారులు అధికారులు విచారణ చేపట్టిన సమయంలో హాజరు కావడం లేదని అందువల్లే విచారణ ముందుకు సాగడం లేదని వెళ్లిన రెవెన్యూ అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల విధులకోసం వచ్చిన తహసీల్దారు పట్టాలు విచారించి తమకు తెలియదని తెలిపారు. కొత్త ప్రభ

అవీ..ఇవీ..

నేడు మార్కాపురంలో 'మీ కోసం'

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 7 : జిల్లా స్థాయిలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) సోమవారం నియోజకవర కేంద్రమైన మార్కాపురంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా ఏర్పాటు చేశారు. మార్కాపురంలోని శ్రీనివాస కళ్యాణ మండపంలో ఉదయం పది గంటలకు ప్రారంభం కానుంది. జిల్లా స్థాయి అధికారులందరూ ఇందులో పాల్గొంటారు. మార్కాపురంలో జరిగే మీ కోసం కార్యక్రమాన్ని ఆ ప్రాంత ప్రజానీకం సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అన్సారియా కోరారు. ఒంగోలులో జరిగే మీకోసం కార్యక్రమం సెకండ్‌లెవల్ అధికారులతో జరుగుతుందని, జిల్లాలోని ప్రజలు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జరుగుమల్లి(కొండపి), జూలై 7 : మండలంలోని వావిలేటిపాడు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను డ్రైవర్ ఆదిపోగు కిషోర్‌బాబును శనివారం రాత్రి అదుపులోకి తీసుకున్నామని సెబ్ సింగరాయకొండ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. నిందితుడికి తొలితప్పుగా భావించి పది వేల రూపాయల జరిమానా విధించామని అధికారులు వివరించారు.

'పెరిదేపిని ఆదర్శంగా నిలుపుదాం'

కొండపి, జూలై 7 : పెరిదేపి గ్రామాన్ని ఆదర్శంగా నిలిపేందుకు గ్రామంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు చెప్పారు. పెరిదేపి గ్రామానికి చెందిన భగత్‌సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయానికి ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జీవీ రత్నాకర్, కృపాకర్ మాదిగ, సీఐటీయూ నాయకుడు ఎస్‌డీ హనీఫ్, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి, కంకణాల ఆంజనేయులు, మల్లెల రమేష్, అంగలకుర్తి లక్ష్మయ్య, గంటినపల్లి వెంకటేశ్వర్లు, రాయపాటి వెంకటరావు, చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు, కేజీ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

10న జరిగే ధర్నాలను విజయవంతం చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 7: కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మికవ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 10వతేదీన దేశవ్యాప్త డిమాండ్స్‌లో భాగంగా జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో జరిగే ధర్నాలు, నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాలం సుబ్బారావు, ఎం.రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఎన్‌డీఏ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు, అమలుకు చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ నేపథ్యంలో ఆయా సమస్యలపై 10న జరిగే నిరసన కార్యక్రమాల్లో కార్మికులు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

టీడీపీ కూటమి నాయకుల స్వచ్ఛభారత్



చెరువులోని వ్యర్థాలను తొలగిస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు, జూలై 7: ఉప్పుగుండూరు ఊర చెరువు పరిశుభ్రత కోసం టీడీపీ కూటమి నాయకులు ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని ప్రధాన తాగునీటి వనరు ఊరచెరువు వ్యర్థాలతో నిండిపోయింది. దీంతో కూటమి నాయకులు చెరువులోని ప్లాస్టిక్ వ్యర్థాలు, సీసాలు, చెత్తను తొలగించారు. కార్యక్రమంలో నాయకులు కనగాల శ్రీనివాసరావు, బి.సెల్వం, తెలగతోటి జాన్సన్, పిన్నక శ్రీకాంత్, కొంజేటి రామకృష్ణ, పొట్లూరి నాగమల్లేశ్వరావు, జనసేన నాయకులు పెంట్యాల కోటి, పెంట్యాల శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు ఆత్మకూరి వాసు తదితరులు పాల్గొన్నారు.

మాజీమంత్రి పెద్దిరెడ్డి అక్రమాలపై విచారణ చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 7: మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అవినీతి, అక్రమాలపై సీబీఐ విచారణ చేసి వెంటనే అరెస్టు చేయాలని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని రూ.వేల కోట్లు అక్రమంగా సంపాదించిన పెద్దిరెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఒక పక్క ఎర్రచందనం, మరో పక్క చిత్తూరు జిల్లాలో పాల రైతులను నట్టేటముంచి రూ.వేల కోట్లు సంపాదించిన వ్యవహారంపై సీబీఐ, ఈడీ ఈడి చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో రామచంద్రారెడ్డి ప్రోత్సాహంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వివిధ రంగాల ప్రజలపై పెట్టిన అక్రమ కేసులపై టీడీపీ కూటమి ప్రభుత్వం విచారణ చేసి ఆ కేసుల నుంచి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు, సిబ్బంది

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 7: దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జీబీఆర్ ఫౌండేషన్ సహకారంతో ఆదివారం ఒంగోలులోని డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలులో ఆవరణలో నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంపునకు విశేష స్పందన లభించింది. ప్రతి రెండు నెలలకు ఒకసారి నిర్వహించే ఉచిత మెడికల్ క్యాంపులో వైద్యులు గోపాలం శ్రీమన్నారాయణ, చాపల వంశీకృష్ణ, బి.హరిబాబు, జాన్‌రిచర్డ్స్, జి.చైతన్య, ఎం.శరత్, రవితేజ, ఎస్.ధీరజ్‌బాబు, పొన్నం సత్యనారాయణలు 1505 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. మెడికల్ క్యాంపు నిర్వహణకు డాక్టర్ బి.జవహర్, డాకా సుబ్బారెడ్డి రూ.10వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారని నిర్వహణ కమిటీ ప్రతినిధి మాదాల వెంకట్రావు తెలిపారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక : ఎస్పీ

ఒంగోలు(క్రైం), జూలై 7: ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం జరుగుతుందని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని ప్రజలు వినియోగించుకోవల్సిందిగా ఆయన కోరారు.

గ్రంథాలయంలో చదవడం నాకిష్టం



పుస్తకాలను చదువుతున్న విద్యార్థులు

టంగుటూరు, జూలై 7 : టంగుటూరు ప్రభుత్వ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన చదవడం-నాకిష్టం కార్యక్రమంలో భాగంగా పలువురు విద్యార్థులు పుస్తకాలను పఠనం చేశారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు గుమ్మడి వర్ధనరాజు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను చిన్నతనం నుంచే గ్రంథాలయానికి రావడం అలవాటు చేయాలని సూచించారు.

జయవరం గ్రామ సమస్యలపై మంత్రికి వినతి

తూర్పునాయుడుపాలెం(టంగుటూరు), జూలై 7 : మండలంలోని జయవరం సమస్యల వలయంలో ఉందని, వాటిని పరిష్కరించాలని టీడీపీ నాయకుడు మల్లవరపు క్రిష్టారెడ్డి తూర్పునాయుడుపాలెంలో రాష్ట్ర మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని కలసి విన్నవించారు. ఈ మేరకు క్రిష్టారెడ్డి ఆయనకు వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించి ఇళ్లు లేని పేదలందరికీ ఇళ్లు నిర్మించాలని, జయవరం-కారుమంచి మార్గంలో ముసిలో బ్రిడ్జి నిర్మించాలని, తాగునీటి ఇబ్బందులను తొలగించాలని, మిగిలిఉన్న రోడ్లు నిర్మించాలని, అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలని కోరారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

● గాయపడి చికిత్స పొందుతూ రైతు మృతి

కంభం, జూలై 7 : ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొట్టడంతో రైతు మృతిచెందిన ఘటన మండలంలోని జంగంగుంట్ల గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకొంది. టీడీపీ నాయకులు, రైతు దేశిరెడ్డి సుబ్బారెడ్డి (51) ద్విచక్ర వాహనంపై స్వగ్రామం జంగంగుంట్ల నుంచి కంభం వైపు వెళుతున్నారు. ఈక్రమంలో ఎదురుగా మార్కాపురం వెళుతున్న కారు బలంగా ఆయనను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సుబ్బారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు ఆయనను కంభం వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

నిజాయితీ వర్సెస్ నిందలు..!

» ఐదేళ్లలో పేరుకుపోయిన అవినీతి, అక్రమాలపై ఎమ్మెల్యే కొండయ్య ప్రత్యేక దృష్టి

» అక్రమార్కుల గుండెల్లో గుబులు

» అబద్ధాలను వండివారుస్తున్న వైరిపక్షం

చీరాల, జూలై 7 : చీరాల నియోజకవర్గంలో గత ఐదేళ్ల కాలంలో అవినీతి, అక్రమాలు పేరుకుపోయాయి. వాటిని ప్రక్షాళన చేసేందుకు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య కార్యాచరణ చేపట్టారు. అందులో భాగంగా తీరప్రాంతంలో జరిగిన వరుస మరణాల నేపథ్యంలో రిసార్టుల నిర్వాహకులు తీసుకోవల్సిన జాగ్రత్తలను తప్పకుండా అనుసరించాలని స్పష్టం చేశారు. ఒకటికి రెండు పర్యాయాలు పోలీస్ అధికారులు, రిసార్టుల నిర్వాహకులతో సమీక్ష చేశారు. ఇక రియల్ ఎస్టేట్ వ్యాపారులు చేపడుతున్న అక్రమ లే-అవుట్లతో కొనుగోలుదారులు ఇబ్బంది పడుతున్నారు. ఆ క్రమంలో పక్కా లేఅవుట్‌లతో అడుగులు వేయాలని స్పష్టం చేశారు. నియోజవకర్గంలో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు చెక్ చెప్పేందుకు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా రెండు రోజుల కిందట టీడీపీ శ్రేణులు ఇసుక, రేషన్ బియ్యం అక్రమ దందాలను అరికట్టాలని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. గడియార స్తంభం సెంటర్లో నినాదాలు చేశారు. ఇలా ఒకటొకటిగా అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు, ప్రజా ప్రయోజనాలు కాపాడేందుకు ఎమ్మెల్యే కొండయ్య చేపడుతున్న కార్యక్రమాలతో అక్రమార్కులలో కొందరు పరోక్షంగా ఎదురు దాడికి దిగారు. ఆ క్రమంలో విషం చిమ్ముతూ అసత్యాలను ప్రచారం చేస్తున్నారు. దీనిపై టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. వాస్తవాలను వక్రీకరించి అసత్యాలను ప్రచారం చేయాలని చూస్తే సహించబోమని శ్రేణులు స్పష్టం చేశాయి.

రియల్ ఎస్టేట్ వ్యాపారంకు సంబంధించి సదరు రియల్టర్లు వేసే అడుగులు నిబంధనలు మేరకు సాగుతున్నాయా..? లేదంటే తమ ప్రయోజనాల కోసం కీలక వ్యక్తులపై ఆరోపణలు చేస్తున్నారా అనే అంశంపై జోరుగా చర్చ సాగుతోంది. ఎమ్మెల్యేకు పరోక్షంగా ఓ రియల్టర్ 30 సెంట్ల భూమిని అప్పనంగా కట్టబెట్టారని కొందరు విష ప్రచారం చేస్తున్నారు. ఆయా ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని సదరు రియల్టర్‌లు స్పష్టం చేస్తున్నారు. అందుకు సం బంధించి ఆ రియల్టర్లు రాతపూర్వకంగా వివరణ ఇచ్చారు. అలానే రేషన్ బియ్యానికి సంబంధించి ఎమ్మెల్యేకు పరోక్షంగా ముడుపులు అందాయనే ఆరోపణలను చేసే వ్యక్తులు కొందరు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చారు. తీర ప్రాంతంలో రిసార్టుల నిర్వాహకుల నుంచి డబ్బు కోరారని కొందరు అసత్య ప్రచారాన్ని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తన పరపతిని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తులు, సంస్థలపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు ఎమ్మెల్యే కొండయ్య అడుగులు వేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

లే-అవుట్లు నిబంధనల మేరకు వేయాలి..
కొనుగోలుదారులకు ఇబ్బంది లేకుండా చూడాలి

కొన్ని సంవత్సరాలుగా చీరాల నియోజకవర్గంలో అప్రూవ్డ్ లేఅవుట్లు ఒకటి, రెండుకు మించి లేవు. అనధికారిక లేఅవుట్లు పుట్టగొడుగుల్లా ఉన్నాయి. అందులో ప్లాట్లు కొనుగోలు చేసిన వ్యక్తులు తమ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టేందుకు కనీసం విద్యుత్ లైన్లు కూడా లేక ఇబ్బంది పడుతున్నారు. తాజాగా అధికార పార్టీకి చెందిన కీలకనేత సదరు రియల్టరు నుంచి 30 సెంట్ల భూమి నజరానాగా పొందినట్లు కొందరు విషం చిమ్ముతున్నారు. ఆ విషయం నియోజకవర్గంలో చర్చకు దారితీసింది. ఎమ్మెల్యే ముందస్తుగానే చేసిన ప్రకటనలపై వాస్తవాన్ని వక్రీకరిస్తున్నారని ప్రజలు నమ్ము తున్నారు.

రేషన్ విషయమై పనిగట్టుకొని అసత్యాలు

రేషన్ బియ్యం అర్హులకే చెందాలి. అవి నల్ల బజారుకు తరలకూడదు. నిబంధనలను అతిక్రమిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు. ఈ మాటలు ఎమ్మెల్యే కొండయ్య డీలర్లకు, మిల్లర్లకు స్పష్టం చేశారు. అయితే కొందరు అదే పనిగా పనిగట్టుకుని రేషన్ బియ్యంకు సంబంధించి ఎమ్మెల్యేకు ముడుపులు అందాయనే ప్రచారం చేస్తున్నారు. ఇది సత్యదూరం. అవాస్తవాలను వండివార్చేవారికి రేషన్ డీలర్స్‌పరంగా తామిచ్చే సమాధానం ఇదేనని రేషన్ డీలర్స్ జిల్లా కార్యదర్శి దుడ్డు ప్రభాకరరావు స్పష్టం చేశారు.

- డీ ప్రభాకరరావు, రేషన్ డీలర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రాణహాని జరగకూడదంటే.. పైసలతో ముడిపెడతారా..?

చీరాల నియోజకవర్గంలో తీరప్రాంతంలో ఇటీవల కొన్ని దుర్ఘటనలు జరిగాయి. అందుకు కొందరు ప్రాణాలు మూల్యంగా చెల్లించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే కొండయ్య, రిసార్ట్స్ నిర్వాహకులు, పోలీస్ అధికారులతో ఉమ్మడి సమావేశం నిర్వహించారు. తీరంలో ప్రాణనష్టం ఘటన ఆఖరు కావాలి. భవిష్యత్‌లో అలాంటి ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకుందాం. రిసార్ట్స్ నిర్వాహకులు కార్యాచరణతో పనిచేయాలని ఎమ్మెల్యే చెప్పారు. దీనిపై బీచ్ రిసార్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు అడుగులు వేశారు. గజఈతగాళ్ల నియామకం, సెర్చ్ టవర్స్ ఏర్పాటు, లైఫ్ జాకెట్లు తదిరాలు సమకూర్చేందుకు నిధులు సమకూర్చగా అవి ఎమ్మెల్యే కోసమని కొందరు అసత్యాలను వండివారుస్తున్నారు. దానిని ఖండిస్తూ పర్యాటకులకు మెరుగైన సౌకార్యాలు కల్పిస్తున్నామని రిసార్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు స్పష్టం చేస్తున్నారు. ఈ విషయమై అసత్యాలను ప్రచారం చేసేవారిపై అవసరమైతే తగిన చర్యలు తీసుకునేందుకు అడుగులు వేస్తామని చెప్తున్నారు.

నిందలు వేసిన వారు నిజనిరూపణ చేయాలి

లేదా శిక్షను అనుభవించాలి

రిసార్టుల నిర్వహణ నుంచి, రేషన్ బియ్యం, రియల్‌ఎస్టేట్ వ్యాపారం వరకు నిందలు మోపినవారు నిజనిరూపణ చేయాలి. లేదంటే శిక్ష అనుభవించాలని టీడీపీ శ్రేణులు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నాయి. వాస్తవాలను వక్రీకరించి సదుద్దేశ్యంతో పనిచేసే వారిని నైతికంగా దెబ్బతీసేందుకు, తమ వ్యక్తిగత ప్రయోజనాలను కాపాడుకునేందుకు ప్రయత్నం చేస్తున్న వ్యక్తులు, సంస్థలపై తగిన చర్యలు తీసుకోవాలని టీడీపీ, జనసేన, బీపేపీ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు.

వాస్తవాలను పరిశీలించి చర్యలు చేపడతాం

లేఅవుట్లు నుంచి, సీఆర్‌జెడ్ వరకు నిబంధనలు ఏం ఉన్నాయి. వాటిని పాటించారా. పాటిస్తున్నారా. లేదంటే అతిక్రమణకు ఏం చర్యలు చేపట్టాలనే అంశాలతో ఇతర అంశాలకు సంబంధించి కూడా ఉన్నతాధికారులకు సమగ్ర నివేదికను సమర్పిస్తాం. అనంతరం తదుపరి చర్యలు చేపడతాం.

- సూర్యనారాయణరెడ్డి, ఆర్డీవో, చీరాల


మంత్రి గొట్టిపాటిని కలిసిన 104 వాహనం ఉద్యోగులు

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

మంత్రి గొట్టిపాటికి 104 ఉద్యోగుల వినతి

అద్దంకిటౌన్, జూలై 7 : ఏపీ 104 ఎంఎంయూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను చిలకలూరిపేటలోని తన నివాసంలో ఉమ్మడి ప్రకాశం, బాపట్ల జిల్లా యూనియన్లు కలిసి వినతిపత్రం అందజేశాయి. ముందుగా ఘన విజయం సాధించిన గొట్టిపాటికి అభినందనలు తెలియజేశారు. రాష్ట్రంలో అనేక సంవత్సరాలుగా వైద్య, ఆరోగ్య శాఖలో సేవలందిస్తున్నామని, అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటూ కొవిడ్ సమయంలో విధులు నిర్వర్తించామన్నారు. ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ నియామకాలల్లో మాకు వెయిటేజీని ఇవ్వకుండా గత ప్రభుత్వం వి వక్షత చూపిందన్నారు. నెలనెలా సక్రమంగా జీతాలు చెల్లించడం లేదని, సమస్యలపై వినతులు ఇచ్చినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా పరిష్కారం చూపాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా యూనియన్ అధ్యక్షుడు నరేష్, జనరల్ సెక్రటరీ రవి వర్మ, డివిజన్ ఉద్యోగులు పాల్గొన్నారు.



డాక్టర్ నాగసూరి దంపతులకు పురస్కారాన్ని అందజేస్తున్న సభ్యులు

సాహితీవేత్త నాగసూరికి పురస్కారం

» వెలుగు చూడని గ్రంథాలను నేటి తరానికి అందిస్తున్న రచయిత

» సన్మాన సభలో వక్తలు

అద్దంకిటౌన్, జూలై 7 : వెలుగు చూడని గ్రంథాలను వెలికితీసి అందులో ఆంతర్యాన్ని నేటి తరానికి అందజేస్తున్న సాహితీవేత్త డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ అని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం స్థానిక శ్రీనివాస ఆ ర్యవైశ్య కల్యాణ మండపంలో పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ సాహిత్య పురస్కార సభ పద్యకవి డీవీఎం సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా హాజరైన ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరి శ్రీనివాసులు మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమ నాగసూరి ఉన్నతికి మార్గాలన్నారు. ఎనిమిది పదుల పుస్తకాలకు సంపాదకత్వం వహించారని, మాధ్యమాల విశ్లేషకులని, పాఠ్యాంశాల రచయితని, మూడు వేలకు పైగా సాహిత్య వ్యాసాలు రాసిన సాహితీవేత్త అని వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా రచయిత నాగసూరి వేణుగోపాల్‌కు పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ సాహిత్య పురస్కారం-2024ను పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజ దంపతులకు అందజేయగా, వేణుగోపాల్ దంపతులను ఈ సందర్భంగా సాహితీ మిత్ర మండలి సభ్యులు సత్కరించారు. గాంధీజీ మార్గం నేటికీ అనుసరణీయమని డాక్టర్ నాగసూరి వే ణుగోపాల్ అన్నారు. మిడియా రంగం అతి ధోరణులను వీడి సమాజహిత కార్యక్రమాలు రూపొందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గాడేపల్లి దివాకర్‌దత్తు, డాక్టర్ యు. దేవపాలన, అన్నమనేని వెంకట్రావు, లక్కరాజు శ్రీనివాసరావు, రాముడుశర్మ, మారం కోటేశ్వరరావు, రఫీ, సందరెడ్డి శ్రీనివాసరావు, అంజాద్ బాషా, హనుమంతరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలు నిలిపివేత

చినగంజాం, జూలై 7 : మండలంలోని చినగంజాం సర్వే నెంబర్లు 828, 829లోని భూములలో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలను చినగంజాం ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు ఆదివారం నిలిపివేశారు. శనివారం నుంచి ఆ భూములలో అక్రమంగా ఇసుక తరలిస్తుండడంతో ఆ ప్రాంతానికి ఎస్ఐ వెళ్లి విచారణ చేసి, ఇసుక తరలించేందుకు అనుమతులు లేకపోవడంతో, అక్రమంగా ఇసుక రవణా చేస్తున్నారని నిర్ధారించుకుని ఇసుక తవ్వకాలను అడ్డుకున్నారు. అనుమతులు ఉంటేనే ఇసుక తవ్వకాలు జరపాలని, అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరిపి, రవణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా ఉన్నాతాధికారుల ఆదేశాల మేరకు ఇసుక అక్రమ తవ్వకాలను నిలిపివేసినట్లు ఎస్ఐ తెలిపారు. చినగంజాం గ్రామ సర్వే నెంబర్లు 828, 829లలోని భూములలో జరుగుతున్న ఇసుక తవ్వకాలను వెంటనే నిలిపి వేయాలని కోరుతూ సీపీఎం పార్టీ జిల్లా నాయకులు జి.ప్రతాప్‌కుమార్ శనివారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. వైసీపీ హయాంలో దొంగ ఆన్‌లైన్లు, నకిలీ పట్టాదారు పాసుపుస్తకాలతో ఇసుక దోపిడీ చేశారని ప్రతాప్ కుమార్ తెలిపారు.


కాశిరెడ్డి కాలనీ వద్ద ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలను తొలగిస్తున్న అధికారులు

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు

కనిగిరి, జూలై 7: ప్రభుత్వ స్థలాలు, భూములు ఆక్రమించిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఆర్డీవో జాన్‌ఇర్విన్ హెచ్చరించారు. పట్టణ సమీపంలోని కాశిరెడ్డి కాలనీ వద్ద ప్రధాన హైవే వెంట ఉన్న అక్రమ నిర్మాణాలను ఆదివారం తొలగింపు చర్యలు చేపట్టారు. వైసీపీ కౌన్సిలర్ల చెరలో ప్రభుత్వ స్థ లాలు శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. జిల్లా రెవెన్యూ అధికారుల ఆదేశాల మేరకు ఆర్డీవో, కమిషనర్ టీవీ రంగారావు ఆధ్వర్యంలో కాశిరెడ్డి కాలనీ వద్ద అక్రమ నిర్మాణాలను ఎక్స్‌క వేటర్‌లతో కూల్చివేయించారు. ఈసందర్భంగా ఆర్డీవో జాన్ ఇర్విన్ మా ట్లాడుతూ వాగు, పోరంబోకు, పశువుల బీడు భూములు, స్థలాలు ఆక్రమించ టం చట్టరీత్యా నేరమన్నారు. వీటిని ఆక్రమించిన వారు ఎంతటివారైన శిక్షార్హులని తెలిపారు. చట్టవిరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అన్నపై రోకలి బండతో తమ్ముడి దాడి

● చికిత్స పొందుతూ మృతి

దర్శి, జూలై 7: తల్లిపై గొడవ పడుతున్నాడనే ఉద్దేశంతో క్షణికావేశంతో అన్నపై రోకలి బండతో తమ్ముడు దాడి చేయటంతో తీవ్రగాయాలై మృతి చెందాడు. ఈఘటన శనివారం రాత్రి మండలంలోని రాజంపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని రాజంపల్లికి చెందిన రావులపల్లి ప్రసాద్(37) తల్లితో తరచూ గొడవ పడుతుంటాడు. ఈక్రమంలో శనివారం రాత్రి పది గంటల సమయంలో మద్యం సేవించి తల్లిపై గొడవ పడుతుండగా తమ్ముడు బాలరాజు ఆగ్రహం వ్యక్తం చేశాడు. వారించినప్పటికీ వినకపోవటంతో క్షణికావేశంలో తమ్ముడు బాలరాజు రోకలి బండతో అన్న ప్రసాద్‌ను కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. హుటాహుటిన ఒంగోలు రిమ్స్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు.

సంఘ సేవకుడికి అవార్డు

దర్శి, జూలై 7: దర్శి పట్టణానికి చెందిన సంఘ సేవకుడు తెనాలి రవి ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించి హెచ్ఎస్‌టీ యూనివర్సిటీ టెక్సాస్ (యూఎస్ఏ) డాక్టరేట్ అవార్డును అందజేశారు. హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఈ డాక్టరేట్ పట్టాను యూనివర్సిటీ ప్రతినిధులు అందజేసి సత్కరించారు.

రామాపురం ఎత్తిపోతలపై కదలిక?

» మంజూరైనా టెండర్లు పిలవకుండా గాలికొదిలేసిన వైసీపీ ప్రభుత్వం

» నిర్మాణం జరిగితే 1067 ఎకరాలకు సాగునీరు

» మంత్రి దృష్టికి తీసుకెళ్లిన టీడీపీ నాయకురాలు గొట్టిపాటి లక్ష్మి

సానుకూల స్పందన

దొనకొండ, జూలై 7: దొనకొండ మండలంలోని రామాపురం గ్రామం వద్ద గుండ్లకమ్మ నది పరిధిలోని చెక్‌డ్యామ్ వద్ద రైతుల శ్రేయస్సును గుర్తించి 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎత్తిపోతల పథకాన్ని మం జూరు చేసింది. ఆతర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టక గాలికొదిలేసింది. ఈప్రాంతంలో ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేసి ఊరకుంట, కొండప్పచెరువు, గంగపాలెం చెరువులకు నీటిని రప్పిస్తే దాదాపు 1067 ఎకరాల్లో సిరులు పండి రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. అలాగే, దొనకొండ, త్రిపురాంతకం, పెద్దారవీడు, మార్కాపురం మండలాల్లోని పలు గ్రామాల్లో భూగర్భజలాలు పెంపొందేందుకు ఎంతో దోహదపడుతుంది. ఈవిషయాన్ని అప్పటి రామాపురం సర్పంచ్ కామేపల్లి నారాయణమ్మ, చెంచయ్య రైతుల శ్రేయస్సు, సాగునీటి సమస్య పరిష్కారం నిమిత్తం ఈపథకం ఏర్పాటుపై ఎన్నోసార్లు అప్పటి మంత్రులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రాలు అంద జేశారు.

దీంతో 2018 మే నెలలో విజయవాడ ఈఎన్‌సీ అధికారులు 92 క్యూసెక్కుల నీటిని విడుదలకు అను మతులు మంజూరు చేయటంతో ఐడీసీ అధికారులు సర్వేచేసి ఎత్తిపోతల పథకం ఏర్పాటుకు రూ.13.15 కోట్లకు తయారుచేసిన ప్రతిపాదనలకు ప్రభుత్వం నుంచి అనుమతి లభించింది. ఇక టెండర్లు పిలిచి పనులు ప్రారంభించటమే మిగిలింది. ఇంతలో 2019 ఎన్నికలు రావటం, అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఎత్తిపోతల పథకాన్ని గాలికొదిలేసింది.

ఇటీవల జరిగిన ఎన్నికల్లో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతులు ఎన్నో ఆశలు పెట్టుకు న్నారు. ఈక్రమంలో రామాపురం ప్రాంతంలో ఎత్తిపోతల పథకం గురించి మాజీ సర్పంచ్ కె.నారాయణమ్మ టీడీపీ నియోజకవర్గ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మికి వివరించారు.

దీనిపై స్పందించిన లక్ష్మి ఇటీవల రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కలిశారు. రామాపురం వద్ద ఎత్తిపోతల పథకం నిర్మాణ ప్రాముఖ్యతను వివరించి మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలో మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్టు సమాచారం.


రామాపురం చెక్‌డ్యామ్‌లో చేరిన వర్షపు నీరు(ఫైల్)


ఎత్తిపోతల పథకం ప్రాముఖ్యతను మంత్రి రామానాయుడుకు వివరిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు

వసతి గృహంలో అన్నిసౌకర్యాలు కల్పిస్తాం!

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, జూలై 7: వసతి గృహంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న ఇంటిగ్రేటెడ్ బాలికల హాస్టల్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు అందతున్న వసతుల గురించి ఆరా తీశారు. భోజనం ఎలా ఉంటుందని తెలుసుకు న్నారు. గదులను పరిశీలించారు. ఉక్కపోతగా ఉండగా కిటికీ లు ఎందుకు వేశారని ప్రశ్నించగా, దోమలు వస్తున్నాయని తెలిపారు. కిటికీలకు మెష్‌లు ఏర్పాటుచేసేందుకు ప్రతిపాదనలు త యారుచేయాలని వార్డెన్ జయంతికి సూచించారు. ఖాళీగా ఉన్న వాటర్ డ్రమ్ములను పరిశీలించి, మంచినీరు లేదా అని విద్యార్థినులను అడిగారు. వాటర్ బబుల్‌లను కొనుక్కుంటున్నట్టు వార్డెన్ తెలపటంతో వాడుకనీటి బోరు పనితీరుపై విచారించారు. హాస్టల్‌కు ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. రోజూ టాయిలెట్స్‌లను శుభ్రం చేయించాలని వార్డెన్‌కు సూచించారు. దోమలు ప్రబలకుండా మున్సిపల్ సిబ్బందితో ఫాగిం గ్ చేయిస్తామని తెలిపారు. కొంతమంది విద్యార్థినులు కింద పడుకునేం దుకు ఇబ్బందిగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్ళి బెడ్‌లు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకులు నంబుల వెంకటేశ్వర్లు, సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్‌టీఆర్), తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, గంగవరపు నాగిరెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య కమిషనర్ టీవీ రంగారావు, ఎస్ఐ త్యాగరాజు, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

శ్రీ అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

» ఆలయాభివృద్ధికి రూ.40లక్షల విరాళం

» చెక్‌ను అందజేసిన జనసేన నాయకుడు శ్రీకాంత్

పర్చూరు, జూలై 7: పర్చూరులోని 92 అడుగుల శ్రీ అభయాంజనేయస్వామివారి విగ్రహ ఆలయ ప్రాంగణంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రవాశాంధ్రుడు, జనసేన యువనేత మన్నెం శ్రీకాంత్ పాల్గొన్నారు. అలయ అభివృద్ధికి రూ.40లక్షల విరాళాన్ని ప్రకటించి దానికి సంబంధించిన చెక్‌ను ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు శ్రీకాంత్‌ను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

కార్యక్రమాన్ని ఉద్దేశించి రిటైర్డ్ ప్రిన్సిపాల్ మంగళగిరి కోటేశ్వరరావు మాట్లాడుతూ పర్చూరులో రూ.4కోట్ల వ్యయంతో దాతల సహకారంతో రూపుదిద్దుకున్న ఆలయాన్ని భక్తులకు మెరుగైన వసతులు కప్పించేందుకు దాతలు అందిస్తున్న సాయం హర్షనీయం అని అన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కోటా హరిప్రసాద్, కఠారి సురేంద్రబాబు, రంగిశెట్టి ఆంజనేయులు, తులసి అప్పారావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, కోటా శ్రీనివాసరావు, ఒగ్గిశెట్టి నరసింహం, రంగిశెట్టి రామాంజనేయులు, జనసైనికులు తోట మణి, దీర్ఘాల రమేష్ నాయుడు, మాధవ మాష్టర్, తులసి చంటి, కందా సురేంద్ర, అచ్చికోలు సతీష్, బాలాజీ, సాంబయ్య పాల్గొన్నారు.


ఆలయ అభివృద్ధికి ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న మన్నెం


పూజల్లో పాల్గొన్న అసెంబ్లీ జాయింట్ సెక్రటరీ సుబ్బారెడ్డి దంపతులు

భక్తిశ్రద్ధలతో నారాయణస్వామి పూజలు

సీఎస్‌పురం(పామూరు), జూలై 7: సీఎస్‌పురం మండలం మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం పూజ కార్యక్రమాల్లో భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. రాష్ట్ర అసెంబ్లీ జాయింట్ సెక్రటరీ పాలకొలను సుబ్బారెడ్డి, చంద్రకళ దంపతులు పంచామృత అభిషేకంలో పాల్గొని స్వామి వారిని దర్శించు కొన్నారు. ఈసందర్భంగా ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చినఆదినారాయణ, ఆలయ కార్యనిర్వహణాధికారి గిరిరాజు నరసింహాబాబు స్వామి వారి శేషవస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం గోశాలలోని గోపూజ కార్యక్రమాలో పాల్గొన్నారు.

తేలని ఇంటి పట్టాల లెక్క

- ఒకేప్లాటుకు ఇరువురికి పట్టాలు
- 36 నెలలుగా పూర్తికాని విచారణ
- పట్టాలు మార్చిన ఉద్యోగులపై చర్యలు శూన్యం


జగనన్న కాలనీలో లే అవుట్ స్థలాలు

ఎర్రగొండపాలెం, జూలై 7 : పేదలకోసం ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో లెక్కకు మించి పట్టాలు మంజూరు చేశారు. దీంతో ఒకే పట్టా నంబరు ఇద్దరికి మంజూరు కావడంతో జగనన్న కాలనీలో పట్టాల సమస్య పరిష్కరించాలని కాళ్లు అరిగేలా తహసీల్దారు కార్యాలయం చుట్టూ లబ్ధిదారులు తిరుగుతున్నారు. దీనిపై విచారిస్తామన్న అధికారులు మూడేళ్లగా నానుస్తున్నారు.

తహసీల్దారు కార్యాలయంలో పనిచేసే వీఆర్వోలు ఒకే పట్టాను ఇద్దరికి ఇచ్చి వివాదాలు సృష్టించారు. నేటికి ఆ వీఆర్వోలపై ఎలాంటి చర్యలు లేవని బహిరంగంగా విమర్శలు వినిపిస్తున్నాయి. 2022 మార్చి నుంచి లబ్ధిదారులు వినతిపత్రాలు ఇస్తున్నా సమస్య మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది. 2022 మార్చి నెల నుంచి ఇప్పటి వరకు ముగ్గురు ఇన్‌చార్జ్ తహసీల్దార్లు ఒక రెగ్యులర్ తహసీల్దార్ల పర్యవేక్షణలో అధికారులు విచారించడం మినహా సమస్య పరిష్కారం కావడం లేదని లబ్ధిదారులు తెలియజేస్తున్నారు.

ఎర్రగొండపాలెం సమీపంలోని మిల్లంపల్లి టోల్‌ప్లాజా వద్ద ప్రభుత్వభూమిలో జగనన్న కాలనీలో 2020లో పేదలకోసం 1316 ప్లాట్లతో ప్లాన్ వేసి జిల్లా కలెక్టర్ నుంచి మంజూరు ఉత్తర్వులు పొందారు. 1316 లే-అవుట్ పట్టాలలో 1057 పట్టాలు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 84 పట్టాలు సామాజిక అవసరాల కోసం అని ఉంచారు. పీఆర్‌కే నంబరు వచ్చి పట్టాలు మంజూరైన మహిళలు పట్టాలు చేతికి అందలేదని 36 నెలలుగా తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతునే ఉన్నారు. ఇప్పటికీ 209 మందికి పట్టాలు చేతికి అందక వచ్చిన అధికారికల్లా అర్జీలు ఇస్తూనే ఉన్నారు.

ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న ఓ మహిళకు పీఆర్‌కే నంబరు 00048852 నెంబరు ఉన్నప్పటికీ, ఇప్పటికి పట్టా మంజూరు చేయకుండా తిప్పుతున్నారు. అంబేడ్కర్ నగర్ చెందిన భారతమ్మ, ఎర్రగొండపాలెం పట్టణానికి చెందిన మస్తాన్‌బీలకు పట్టాలు మంజూరు కాలేదు. 01455780 పీఆర్‌కే నెంబరు ఉన్న నార్నపాటి వెంకటమ్మ, పీఆర్‌కే నంబరు 01424506 నార్నపాటి ప్రియాంకలకు పట్టాలు పంపిణీ చేయలేదు. మహిళలు పలుదపాలు తహసీల్దారు ఆఫీసులో వినతులు సమర్పించారు. 209 మంది లబ్ధిదారులకు చెందిన పట్టాలు ఎవరు గల్లంతు చేశారనే మిస్టరీ వీడలేదు. పంపిణీ జరిగిన 1057 పట్టాలలో 60మందికి ఒకే ప్లాటు నంబరుతో ఇరువురు లబ్ధిదారులకు ఒకే పట్టాను పంపిణీ చేశారు. ఒకే ప్లాటును ఇరువురు లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేయడంతో వారు గొడవ పడుతున్నారు. నటుకుల సునీత అనే మహిళకు పట్టా నెంబరు లేకుండా తహసీల్దారు సంతకంలో ఖాళీ పట్టాపంపిణీ చేశారు. దాదాపు 8 మందికి పట్టా నెంబరు లేకుండా పట్టాలు పంపిణీ చేశారు. పట్టాలు పంపిణీలో కొందరు బినామీ పట్టాలు పొంది వాటిని అప్పుడే విక్రయిస్తున్నారు. పట్టాల పంపిణీ సమయంలో ఒక్కొక్క పట్టాకు రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు లబ్ధిదారుల నుంచి అప్పటిలోనే వసూళ్లు చేసినట్లు సమాచారం. పట్టాలు పంపిణీలో జరిగిన అవకతవకల పై తహసీల్దార్లు కార్యాలయం నుంచి 2022 నుంచి డిప్యూటీ తహసీల్దారు, ఆర్.ఐల పర్యవేక్షణలో విచారించి నా, పట్టాలు లెక్కతేల లేదు. పట్టాలు ఇచ్చి స్థలాలు స్వాధీనం చేయలేదని లబ్ధిదారులు గతంలో 'గడప, గడపకు ప్రభుత్వ కార్యక్రమం'లో చెప్పడంతో అప్పటి రాష్ట్రపురపాలక, పట్టణాభివృద్ధి శాఖమంత్రి ఆదిమూలపు సురేష్ 2022 సెప్టెంబరు 6వ తేదీ ఆయనే స్వయంగా రెవెన్యూ అధికారులతో కలసి జగనన్న లే-ఔట్ కాలనీలో పర్యటించి మ్యాప్పలను తనిఖీ చేశారు. అప్పటి ఈ నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి సురేష్ తహసీల్దార్‌ను సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది అనంతరం సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమి చెంది రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడింది. ప్రస్తుతం కొత్త ప్రభుత్వంపై లబ్ధిదారులు ఆశలు పెట్టుకున్నారు. జగనన్న లే-ఔట్‌లో 1316 పట్టాలలో 400 పట్టాలు పొందిన లబ్ధిదారులు అధికారులు విచారణ చేపట్టిన సమయంలో హాజరు కావడం లేదని అందువల్లే విచారణ ముందుకు సాగడం లేదని వెళ్లిన రెవెన్యూ అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల విధులకోసం వచ్చిన తహసీల్దారు పట్టాలు విచారించి తమకు తెలియదని తెలిపారు. కొత్త ప్రభుత్వంలోనైనా నకిలీ పట్టాలపై విచారించి సమస్యను పరిష్కరించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.


పట్టాలకోసం తిరుగుతున్న మహిళలు

అవీ..ఇవీ..

సాయినాథుడు దత్తస్వరూపుడు


సుబ్రహ్మణ్యారెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 7: సాయి బాబా లక్షలాది మంది భక్తులకు అద్భుతమైన అనుభవాలు ఇచ్చారని, అనేక సమస్యలతో ఉన్న భక్తులకు మార్గదర్శిగా ఉండి వారి కోరికలు తీర్చారని ఆర్‌అండ్‌బీ గుంటూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.సుబ్రహ్మణ్యరెడ్డి అన్నారు. గురుపౌర్ణమి వేడుకలు పురస్కరించుకుని నెహ్రూబజార్‌లోని షిరిడీసాయి బాబా మందిరంలో ఆదివారం బాబా సప్తహప్రవచనంలో భాగంగా బాబా సుగుణ, సంపద గురించి ఉపన్యసించారు. సాయినాథుడు సాక్షాత్తు దత్తస్వరూపుడన్నారు. కార్యక్రమంలో మందిర అధ్యక్షులు పేరము సత్యనారాయణ, ఉపాధ్యక్షులు రామడుగు గోపి, కోశాధికారి నాగరాజు, చీతిరాల పవన్, కరీం, కమిటీ సభ్యులు గోపిశెట్టి కొండయ్య, సురే నాగేశ్వరావు, విజయ్, కష్ణమోహన్, వేంకటేశ్వరరెడ్డి, సాయిబాబు, మధు, రమణారెడ్డి, మహిళా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ఉపాధ్యాయుల తోడ్పాటు


ప్రధానోపాధ్యాయుడికి ఉపకరణాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

తర్లుపాడు, జూలై 7: తర్లుపాడులోని ఎస్సీ, బీసీ హాస్టల్స్‌లో చదువుతున్న విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని తర్లుపాడు మండలం ఎస్టీయూ శాఖ ఉపాధ్యాయులు కొశ్శెట్టి జగన్‌బాబు, గోను శ్రీనివాసులు, ఎస్‌కే నజీర్, మురారి అన్నారు. హాస్టల్‌లో విద్యార్థులకు అవసరమైన దోమతెరలను, పలు కాస్మోటిక్ వస్తువులను విద్యార్థులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. వారి విద్యాభివృద్ధికి రూ.5 వేల నగదు అందజేయనున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కాస్మోటిక్ వస్తువులను తర్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్‌బాబుకు అందజేశారు. వీటిని బుధవారం విద్యార్థులకు అందజే యనున్నట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు చేయూత నివ్వటం అభినందనీయం అన్నారు. మరికొంత మంది దాతుల విద్యార్థుల విద్యాభివృద్ధికి చేయూతనివ్వాలని కోరారు.

విలీన జీవోను రద్దు చేయాలి


సభ్యత్వాన్ని అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

గిద్దలూరు, జూలై 7 : పాఠశాలల విలీన జీవో 117ను రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పి.రమణరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5 తరగతులు చదువుతున్న విద్యార్థులను ఉన్నత పాఠశాలల్లో కలుపడం వలన చాలా మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దూరంగా ఉన్న ఉన్నత పాఠశాలలకు వెళ్ళలేక ప్రైవేటు విద్యాసంస్థల బస్సులకు ఆకర్షితులై ప్రైవేటు పాఠశాలల వైపు వెళుతున్నారని, ప్రాథమిక పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని పేర్కొన్నారు. దీనికి సంబంధించిన 117వ జీవోను రద్దు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో రాచర్ల మండల యూటీఎఫ్ అధ్యక్షులు సాయన్న, ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి, యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గిద్దలూరు, జూలై 7 : ఆపోపా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా దారా రాములు, కార్యదర్శిగా కొప్పరపు సుబ్బారావు, కోశాధికారిగా సూరె సుబ్బరామయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా సూరె రామచంద్రరావు, ఎం.అనంతరామయ్య, ముప్పూరి కాశ్వీరరావు, నాదెళ్ల రంగనాయకులు, 11 మంది ఈసీ మెంబర్లతో, 10 మంది అడ్వైజర్లతో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది.

పోలేరమ్మకు ఆదివారం జాతర



మార్కాపురం వన్‌టౌన్, జూలై 7: మార్కాపురం పట్టణ శివారులో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

గురుపూజోత్సవం

గిద్దలూరు, జూలై 7 : ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్థానిక రామక్రిష్ణ మఠం ఆవరణలో గురుపూజోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ నాయకులు రామక్రిష్ణ మాట్లాడుతూ దేశం, ధర్మం పట్ల సమర్పణ భావమే గురుపూజోత్సవ లక్ష్యమని అన్నారు. ఈకార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు బాలక్రిష్ణారెడ్డి, శివమల్లారెడ్డి, రంగనాయకులు, మారుతిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక : ఎస్పీ

ఒంగోలు(క్రైం), జూలై6: ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం జరుగుతుందని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని ప్రజలు వినియోగించుకోవల్సిందిగా ఆయన కోరారు.

పంట కాలువలను బాగుచేస్తాం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కంభం, జూలై 6 : కంభం పట్టణం నుంచి పోయే పలు పంట కాలువలను అభివృద్ధి చేస్తామని ఇరిగేషన్ డీఈ షేక్ జాకీర్‌అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'పంట కాలువల అభివృద్ధి పట్టదా' శీర్షికన గురువారం ప్రచురితమైన వార్తపై ఆయన స్పందించారు. కంభం ప్రధాన కాలువలు, పెద్దకంభం కాలువ, నక్కలగండి కాలువలు కంభం పట్టణం నడిబొడ్డున ప్రవహిస్తున్నందున గృహాల వారు తమ ఇళ్ల నుండి వచ్చిన మురుగునీరు, హోటళ్ల వారు చెత్తాచెదారం కాలువల్లో వేయడంతో వ్యర్థాలతో కాలువలు నిండిపోయాయన్నారు. కంభం, హెచ్ గూడెం, కందులాపురం పంచాయతీల కార్యదర్శులను కాలువల్లోని చెత్తాచెదారాలను తొలగించాల్సిందిగా, చెత్త కాలువల్లో వేయకుండా తీర్మానం చేశామన్నారు. కాలువల మరమ్మతులకు రూ.29.50 లక్షల నిధులకు అంచనాలు పంపించామని, నిధులు మంజూరైన వెంటనే కాలువల మరమ్మతు పనులు చేపడతామన్నారు.

ఉపాధ్యాయుల నియామకానికి కృషి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పెద్దదోర్నాల, జూలై 7: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు జిల్లా విద్యాశాఖ కృషి చేస్తున్నట్లు ఎంఈవో మస్తాన్ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'వేదిస్తున్న ఉపాధ్యాయుల కొరత' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ఆదివారం ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ఈ క్రమంలో మండల విద్యాశాఖాధికారి మస్తాన్‌నాయక్ సమస్యను డీఈవో, డిప్యూటీ డీఈవోల దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన జిల్లా అధికారులు ఈ నెలాఖరుకు మరో పాఠశాలలో అదనంగా ఉన్న ఉపాధ్యాయులను దోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు డిప్యూటేషన్ ద్వారా నియమించనున్నట్లు తెలిపారని ఎంఈవో చెప్పారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

- ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ రైతు మృతి


మృతిచెందిన రైతు సుబ్బారెడ్డి

కంభం, జూలై 7 : ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొట్టడంతో రైతు మృతిచెందిన ఘటన మండలంలోని జంగంగుంట్ల గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకొంది. టీడీపీ నాయకులు, రైతు దేశిరెడ్డి సుబ్బారెడ్డి (51) ద్విచక్ర వాహనంపై స్వగ్రామం జంగంగుంట్ల నుంచి కంభం వైపు వెళుతున్నాడు. ఎదురుగా మార్కాపురం వెళుతున్న కారు బలంగా ఢీ కొట్టింది. దీంతో సుబ్బారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. కంభం వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

బాడీఫ్రీజర్ బాక్స్ ఏర్పాటుకు సహకారం


నగదును అందజేస్తున్న డాక్టర్ రమేష్

బేస్తవారపేట, జూలై 7 : బేస్తవారపేటలో బాడీఫ్రీజర్ బాక్స్ ఏర్పాటుకు తన వంతుగా గలిజేరుగుళ్ల వైద్యాధికారి రమేష్ సహకారం అందించారు. హెల్పింగ్ హార్ట్స్ సంస్థ ప్రతినిధులు మీసేవా రాయుడు ఈ ఫ్రీజర్ కోసం నిధి సమీకరిస్తుండగా తన వంతు సాయం అందించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.., గిద్దలూరు నియోజకవర్గంలో హెల్పింగ్ హార్ట్స్ సంస్థ ఎన్నో సహాయ సహకారాలు అందిం చిందన్నారు. ఎక్కడ అపద ఉంటే అక్కడికి వెళ్లి ఈ సంస్థ ప్రతినిధులు అదుకుంటున్నారని కొనియాడారు. కార్యక్రమంలో మీసేవా రాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి

గిద్దలూరు, జూలై 7 : విద్యాభివృద్ధికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యల్లా శ్రీనివాసులు కృషి చేశారని ఎమ్మెల్యే ముత్తుముల అశోకొరెడ్డి అన్నారు. జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్‌గా పనిచేస్తూ రిటైరైన ఏపీటీఎఫ్ నాయకులు యల్లా శ్రీనివాసులు వీడ్కోలు సభ స్థానిక విఠాసుబ్బరత్నం కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులును ఎమ్మెల్యే అశోకొరెడ్డి, ఏపీటీఎఫ్ నాయకులు ఘనంగా సన్మానించి విద్యారంగానికి చేసిన కృషిని, అలాగే యూనియన్ ద్వారా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.వి.జి.కీర్తి, రాష్ట్ర కౌన్సిలర్ సుబ్బారావు, జిల్లా అధ్యక్షులు వెంకటరావు, ఎంఇఒ వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి సాయం


నగదు అందజేస్తున్న వెంకటేశ్వర్లు

కొమరోలు, జూలై 7 : మండలంలోని తాటిచర్ల గ్రామంలో కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న మేకల నరసింహులుకు రూ.5వేల నగదును అమ్మా ఫౌండేషన్ నిర్వాహకులు, మండల టీడీపీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా బోనేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పేద ప్రజలు ఇబ్బందులను గుర్తించి అమ్మా ఫౌండేషన్ చేయుతనిస్తుందన్నారు. నియోజకవర్గంలోని పలు సేవా కార్యాక్రమాలను చేస్తున్నామన్నారు. ఏవ్వరికి ఏ అవసరమెచ్చినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. మా ఫౌండేషన్ ద్వార సహాయ సహకారాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో మేకల పెద్ద నరసింహులు, మీనిగ బోక్కయ్య, సాంసాని శ్రీనివాసులు, నల్లబోతుల వెంకటస్వామి, బాల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంభంలో గంజాయి, మత్తుపదార్థాల కలకలం

- ఐదుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- 150 గ్రాముల గంజాయి ప్యాకెట్లు స్వాధీనం

కంభం, జూలై 7 : కంభం పట్టణంలో గంజాయి, ఇతర మత్తుపదార్థాల కలకలం రేపింది. గంజాయి సేవించి అనుమానాస్పదంగా తిరుగుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్న ఎస్సై పులిరాజేష్ వారి దుస్తులు వెతికారు. వారి వద్ద షుమారు 150 గ్రాములు ఉన్న 4 గంజాయి పొట్లాలు లభ్యమయ్యాయి. ఈ ఐదుగురిలో ఇద్దరు మార్కాపురం వాసులు కాగా ముగ్గురు కంభానికి చెందిన వారు ఉన్నారు. ఈ గంజాయి ఎవరు సరఫరా చేస్తున్నారని పోలీసు లు తమదైన శైలిలో ప్రశ్నించగా యర్రగొండ పాలెం నుంచి ప్రతిరోజు ఒక వ్యక్తి తమకు అందజేస్తాడని చెప్పినట్లు సమాచారం. వీరు ఇచ్చిన సమాచారం మేరకు ఎర్రగొండపాలెం గంజాయి సరఫరా చేసే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.


స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు


మెడికల్ షాపును తనిఖీ చేస్తున్న అధికారులు

పలు మెడికల్ దుకాణాల్లో తనిఖీ

కాగా కంభం పట్టణంలో పలువురు యువకులు మత్తుపదార్థాలు సేవిస్తున్నారనే సమాచారంతో జిల్లాలోని డ్రగ్స్ అధికారులు కంభం పోలీసులు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న మెడికల్ దుకాణాల్లో తనిఖీ చేశారు. మత్తును కలిగించే పలు మాత్రలను స్వాధీనం చేసుకున్నారు. ఏదిఏమైనా యువత గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటుపడడం పట్టణంలో కలకలం రేపింది.

గురుకుల పాఠశాలలో తాగునీటి సమస్యకు పరిష్కారం..!

- సందర్శించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి
- నూతన బోరు ఏర్పాటుకు కలెక్టర్ హామీ

కంభం, జూలై 7 : కంభం బాలికల గురుకుల పాఠశాలలో నెల రోజులుగా తాగునీటి బోరు ఒట్టిపోయాయి. దీంతో తీవ్ర నీటిఎద్దడి ఎదుర్కొంటున్న విద్యార్థినుల సమస్యను తెలుసుకున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోకొరెడ్డి ఆదివారం సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థినులను, ప్రిన్సిపాల్ చాముండేశ్వరిని బోరు ఎప్పుడు ఎండిపోయిందని, దీనికి పరిష్కారం కోసం ఏం చేయాలని కోరారు. నెల రోజులుగా బోరు ఒట్టిపోవడంతో తాము నీటికి ఇబ్బంది లు పడుతున్నామని, బ్లాక్-2లో ఉన్న బోరు నుంచి వస్తున్న కొద్ది నీటితోనే ఉదయం కొందరు, సాయంత్రం కొందరు కాలకృత్యాలు తీర్చుకుంటున్నట్లు ఎమ్మెల్యే అశోకొరెడ్డికి తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫోన్ చేసి బాలికల గురుకుల పాఠశాల లోని ఇబ్బందులను, బోరు గురించి తెలిపారు. స్పందించిన కలెక్టర్ ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో మాట్లాడారు. 24 గంట ల్లో గురుకుల పాఠశాలలో నూతన బోరు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో పాఠశాలలోని సౌకర్యాలు, భోజన రుచులు, ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తెస్తే తక్షణమే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే అశోకొరెడ్డి తెలిపారు. విద్యార్థినులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం లను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చాముండేశ్వరి, టీడీపీ నాయకులు కేతం శ్రీనివాసులు, కొత్తపల్లి శ్రీనివాసులు, తోట శ్రీనివాసులు, దాదా, బీజేపీ నాయకులు పల్లెం శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.


బాలికలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోకొరెడ్డి

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 7: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవం, ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాది గ జన్మదిన వేడుకలు ఆదివారం ఒంగోలులో ఘ నంగా జరిగాయి. ఈ సందర్భంగా సమితి నగర అధ్యక్షుడు గుంటూరి ప్రభుదాస్ ఆధ్వర్యంలో నగ రంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించడంతోపాటు, స్థానిక హెచ్‌సీఎం సెంటర్, కలెక్టరేట్ వద్ద, నెల్లూ రు బస్టాండ్ వద్ద డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి సంతో షాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుదాస్ మాట్లాడుతూ మాదిగ జాతి కోసం మంద కృష్ణ మాదిగ పోరాట ఉద్యమం మొదలై 30 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం కృష్ణమాదిగ అలుపెరగని పోరాటం చేశారని, ఆయన బాటలో తాము ముందుకు సాగుతాయని తెలిపారు. బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి గెలుపు కోసం మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో తా మంతా కష్టపడి పని చేసినట్లు చెప్పారు. ఎస్సీ వ ర్గీకరణ చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇవ్వడం మరింత ఆనందంగా ఉందన్నారు. మాదిగ జాతి పోరాటానికి ప్రతిఫలం వర్గీకరణ ఫలాలు అతిత్వరలోనే రాబోతున్నాయని ప్రభుదాస్ పేర్కొన్నారు. తనను నగర అధ్యక్షుడిగా నియమించినందుకు కృష్ణమాదిగకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకులు పొలడుగు రమేష్, ఆదిమూలపు సందీప్, పసుమర్తి మనోరంజన్, నాయకులు పాల్గొ న్నారు. అలాగే ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతి నిధి తొరటి ఆనంద్‌మాదిగ ఆధ్వర్యంలో నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించి కేక్ కటింగ్ చేశారు.


కేకు పంచుతున్న ప్రభుదాసు

చీమకుర్తిలో..

చీమకుర్తి : మాదిగరిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకదినోత్సవం, వ్యవస్థాకులు మంద కృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకలను చీమకుర్తి పట్టణంతోపాటు పలు గ్రామాల్లో ఆదివారం ఘనంగా జరిపారు. జెండాలను ఆవిష్కరించారు. ఆయా కా ర్యక్రమాల్లో ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బొంతా దాస్, జిల్లా నాయకులు పాలెపోగు బాబురావు, నియోజకవర్గ ఇన్‌చార్జి పాటిబండ్ల ఇక్రయ్య, వెంక టేశ్వర్లు, వంశీ, జడ విజయ్ పాల్గొన్నారు.

అశోక్‌రెడ్డిపైనే కోటి ఆశలు

కొమరోలు, జూలై7 : ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ముత్తుముల అశోకొరెడ్డి, తొలిసారిగా మండల సమస్యలపై చర్చించడానికి వస్తున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుంది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోకొరెడ్డి హాజరు కానున్నారు. గత పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించి మండల అభివృద్ధికి నోచుకోకుండా ఎక్కడి సమస్యలు అక్కడే అటకెక్కాయని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆ సమస్యలను ఒక్క అశోకొరెడ్డి మాత్రమే పరిష్కరించే సత్తా ఉందని, గతంలో మాదిరిగానే ప్రస్తుత టీడీపీ ప్రభుత్వంలో కొమరోలు మండల అభివృద్ధిలో ప్రత్యేకశ్రద్ధ తీసుకోనున్నారని ప్రజలు ఆశతో ఉన్నారు.

వెక్కిరిస్తున్న వైద్యశాల సమస్య

మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో 30 పడకల వైద్యశాలగా గతంలో ఉండేది. దానిని వైసీపీ సర్కార్ 10 పడకల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా తగ్గించారు. గతంలో ఈ వైద్యశాలలో మహిళలకు ఆపరేషన్లు, శవ పంచనామాలు, ఎక్సరే మిషన్ వంటి సేవలు ఇక్కడే ఉండేవి. ఇప్పుడు ఈ సేవలు లేవు. దీంతో వీటి కోసం మండల ప్రజలు 20 కిలోమీటర్ల దూరంలోని గిద్దలూరు, 30 కిలోమీటర్ల దూరంలోని పోరుమామిళ్లకు వెళ్ళాల్సివస్తోంది. కావున కొమరోలు ప్రభుత్వ వైద్యశాలను కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా స్థాయిని పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటారని కోరుతున్నారు. ప్రస్తుతం కొమరోలు వైద్యశాలలో మహిళా వైద్యాధికారిని లేక పావడం, వైద్యశాల అభివృద్ధి కమిటీ ద్వారా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోకపోవడంపై ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలి. మీ హయాంలో మంజూరై చివరి దశలో పెండింగులోని మినీస్టేడియం, బీసీ భవనాలు, కాపు భవనాల నిర్మాణాలను పూర్తిచేయించాలని, కొమ రోలు మండలంలోని కొమరోలు, తాటిచర్ల ప్రభుత్వ పశు వైద్యశాలలో వైద్యాధికారులు లేక రైతులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. కొమరోలు మండలం రెడ్డిచర్లలోని హోమియో వైద్యశాలను కొద్దిరోజులైన మండల కేంద్రంలో ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేయాలని, ఎమ్మెల్యే అశోకొరెడ్డి హయాంలో కొమరోలు నుంచి రాజుపాలెం వరకు డబుల్‌రోడ్డు నిర్మించిన ఘనత వారిదే. అలానే రాజుపాలెం నుంచి గిద్దలూరు వరకు డబుల్ రోడ్డును ఏర్పాటుచేసి కొమరోలు ప్రజల చిరకాల వాంఛను నేరవేరుస్తారని కోరుతున్నారు. కొమరోలు పట్టణంలో విద్యుత్ సమస్యలతో ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో విద్యుత్ కనెక్షన్ల ఆధారంగా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేయించాలని, గ్రామంలో మరమ్మతులకు గురైన విద్యుత్ స్తంభాలను మార్చాలని కోరుతున్నారు. వెలుగు కార్యాలయంలో మహిళలకు రుణాలు ఇచ్చే వీవోలు అధికారులు ఇష్టానుసారంగా డబ్బులు వసులు చేస్తున్నారు. లంచాలను అరికట్టాలంటే ఐకేపీలో సిబ్బందిని, కమిటీలను సంస్థాగత మార్పులు, చేర్పులను ఎమ్మెల్యే సమక్షంలో జరగాలని మండల ప్రజలు కోరుతున్నారు. కొమరోలు గ్రామ పంచాయతీలో పలు సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా తాగునీరు, పారిశుధ్యం, అక్రమ కట్టడాలపై ప్రత్యేక అధికారిని ఏర్పాటుచేసి కొమరోలు పంచాయతీ స్థాయిని పెంచాలని కోరుతున్నారు. మండలంలోని రెవెన్యూ కార్యాలయం, ఇతర ప్రభుత్వ అధికారులు సమయపాలన లేకుండా వారి ఇష్టానుసారం వస్తూపోతున్నారు వారిని కట్టడిచేయించి ప్రజలకు త్వరగా సమస్యలను పరిష్కరించే దిశగా పరిష్కారం చేయాలి. కొమరోలు ప్రాంతం చాలా వెనుకబడినందున ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డితో మంచి పరిశ్రమను ఏర్పాటుచేసి ఈప్రాంతంలోని నిరుద్యోగసమస్యలను పరిష్కారిస్తారని నిరుద్యోగులు ఆశతో ఎదురుచూస్తున్నారు. ఈ సమస్యలను మన స్థానికుడైన అశోకొరెడ్డి సహృదయంతో పరిష్కరించి మరలా అశోకుడు చేసిన అభివృద్ధిని చూడబోతున్నామని మండల ప్రజలు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.


కొమరోలులోని ప్రభుత్వ వైద్యశాల


నిర్మాణంలో ఉన్న మినీ స్టేడియం

రామాపురం ఎత్తిపోతలపై కదలిక?

- మంజూరైనా టెండర్లు పిలవకుండా గాలికొదిలేసిన వైసీపీ ప్రభుత్వం
- నిర్మాణం జరిగితే 1067 ఎకరాలకు సాగునీరు
- మంత్రి దృష్టికి తీసుకెళ్లిన టీడీపీ నాయకురాలు గొట్టిపాటి లక్ష్మి
- సానుకూల స్పందన

దొనకొండ, జూలై 7: దొనకొండ మండలంలోని రామాపురం గ్రామం వద్ద గుండ్లకమ్మ నది పరిధిలోని చెక్‌డ్యామ్ వద్ద రైతుల శ్రేయస్సును గుర్తించి 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేసింది. ఆతర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టక గాలికొదిలేసింది. ఈప్రాంతంలో ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేసి ఊరకుంట, కొండప్పచెరువు, గంగపాలెం చెరువులకు నీటిని రప్పిస్తే దాదాపు 1067 ఎకరాల్లో సిరులు పండి రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. అలాగే, దొనకొండ, త్రిపురాంతకం, పెద్దారవీడు, మార్కాపురం మండలాల్లోని పలు గ్రామాల్లో భూగర్భజలాలు పెంపొందేందుకు ఎంతో దోహదపడుతుంది.

ఈవిషయాన్ని అప్పటి రామాపురం సర్పంచ్ కామేపల్లి నారాయణమ్మ, చెంచయ్య రైతుల శ్రేయస్సు, సాగునీటి సమస్య పరిష్కారం నిమిత్తం ఈపథకం ఏర్పాటుపై ఎన్నోసార్లు అప్పటి మంత్రులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రాలు అంద జేశారు. దీంతో 2018 మే నెలలో విజయవాడ ఈఎన్‌సీ అధికారులు 92 క్యూసెక్కుల నీటిని విడుదలకు అనుమతులు మంజూరు చేయటంతో ఐడీసీ అధికారులు సర్వేచేసి ఎత్తిపోతల పథకం ఏర్పాటుకు రూ.13.15 కోట్లకు తయారుచేసిన ప్రతిపాదనలకు ప్రభుత్వం నుంచి అనుమతి లభించింది. ఇక టెండర్లు పిలిచి పనులు ప్రారంభించటమే మిగిలింది. ఇంతలో 2019 ఎన్నికలు రావటం, అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఎత్తిపోతల పథకాన్ని గాలికొదిలేసింది.



ఎత్తిపోతల పథకం ప్రాముఖ్యతను మంత్రి రామానాయుడుకు వివరిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు

ఇటీవల జరిగిన ఎన్నికల్లో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఈక్రమంలో రామాపురం ప్రాంతంలో ఎత్తిపోతల పథకం గురించి మాజీ సర్పంచ్ కె.నారాయణమ్మ టీడీపీ నియోజకవర్గ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మికి వివరించారు. దీనిపై స్పందించిన లక్ష్మి ఇటీవల రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కలిశారు. రామాపురం వద్ద ఎత్తిపోతల పథకం నిర్మాణ ప్రాముఖ్యతను వివరించి మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలో మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్టు సమాచారం.



రామాపురం చెక్‌డ్యామ్‌లో చేరిన వర్షపు నీరు(ఫైల్)

టీడీపీ కూటమి ప్రభుత్వంపైనే కోటి ఆశలు

కామేపల్లి చెంచయ్య, రైతు, రామాపురం



రామాపురం సమీపంలోని చెక్ డ్యామ్ వద్ద ఎత్తిపోతల పథకం నిర్మానానికి అప్పటి టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. అనంతరం అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లుగా ఎత్తిపోతల పథకం నిర్మాణాన్ని ఏమాత్రం పట్టించుకోలేదు. రైతుల శ్రేయస్సును గుర్తించి ప్రత్యేక చొరవ తీసుకోవాలని టీడీపీ నియోజకవర్గ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి దృష్టికి తీసుకెళ్లటంతో వెంటనే సంబంధిత మంత్రితో చర్చించటం ఎంతో ఆనందం కల్గించింది. రామాపురం వద్ద ఎత్తిపోతల పథకం నిర్మాణానికి చర్యలు చేపడితే ఈ ప్రాంత రైతులకు, ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుంది.



కాశిరెడ్డి కాలనీ వద్ద ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలను తొలగిస్తున్న అధికారులు

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు

కనిగిరి, జూలై 7: ప్రభుత్వ స్థలాలు, భూములు ఆక్రమించిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఆర్డీవో జాన్‌ఇర్విన్ హెచ్చరించారు. పట్టణ సమీపంలోని కాశిరెడ్డి కాలనీ వద్ద ప్రధాన హైవే వెంట ఉన్న అక్రమ నిర్మాణాలను ఆదివారం తొలగింపు చర్యలు చేపట్టారు. వైసీపీ కౌన్సిలర్ల చెరలో ప్రభుత్వ స్థలాలు శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. జిల్లా రెవెన్యూ అధికారుల ఆదేశాల మేరకు ఆర్డీవో, కమిషనర్ టీవీ రంగారావు ఆధ్వర్యంలో కాశిరెడ్డి కాలనీ వద్ద అక్రమ నిర్మాణాలను ఎక్స్‌కవేటర్‌లతో కూల్చివేయించారు.

ఈసందర్భంగా ఆర్డీవో జాన్ ఇర్విన్ మా ట్లాడుతూ వాగు, పోరంబోకు, పశువుల బీడు భూములు, స్థలాలు ఆక్రమించ టం చట్టరీత్యా నేరమన్నారు. వీటిని ఆక్రమించిన వారు ఎంతటివారైన శిక్షార్హులని తెలిపారు. చట్టవిరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ వార్షికోత్సవం

పామూరు, జూలై 7: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) 30వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం మాదిగ ఉద్యోగుల సమాఖ్య మండల అధ్యక్షుడు రాచూరి ఏలియా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నేలపాటి రాజు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం, వర్గీకరణ పోరాటాల విశేషాల గురించి వివరించారు. కార్యక్రమంలో కోటయ్య, పౌలు, జేపీ రాజు, రోజేష్, జి.భాస్కర్, శేషం మోషే, తదితరులు పాల్గొన్నారు. చర్చి వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జెండాను బంకా యోబు ఆవిష్కరించారు.

12న సీఎస్‌పురం మండల సర్వసభ్య సమావేశం

సీఎస్‌పురం(పామూరు), జూలై 7: సీఎస్‌పురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 12న ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో రామచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

10న కోర్కెల దినాన్ని జయప్రదం చేయాలి

పామూరు, జూలై 7: దేశవ్యాప్తంగా ఈనెల 10న జరిగే కోర్కెల దినాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.మాల్యాద్రి పిలుపునిచ్చారు. ఆదివారం పామూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేటర్లకు అనుకూలంగా పనిచేస్తున్నాయని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సమాన పనికి సమాన వేతనం, కార్మికులకు సామాజిక భద్రత తదితర డిమాండ్‌ల సాధన కోసం దేశవ్యాప్తంగా జరిగే నిరసన కార్యక్రమాల్లో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పి.శ్రీను, షేక్ మస్తాన్, రాజ్యలక్ష్మి, సుబ్బారావు, నారాయణ, అనిల్, గురునాధం, అల్లభక్షు పాల్గొన్నారు.

అన్నని కొట్టిన తమ్ముడు.. చికిత్స పొందుతూ మృతి

దర్శి, జూలై 7: తల్లిపై గొడవ పడుతున్నాడనే ఉద్దేశంతో క్షణికావేశంతో అన్నపై రోకలి బండతో తమ్ముడు దాడి చేయటంతో తీవ్రగాయాలై మృతి చెందాడు. ఈఘటన శనివారం రాత్రి మండలంలోని రాజంపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని రాజంపల్లికి చెందిన రావులపల్లి ప్రసాద్(37) తల్లితో తరచూ గొడవ పడుతుంటాడు. ఈక్రమంలో శనివారం రాత్రి పది గంటల సమయంలో మద్యం సేవించి తల్లిపై గొడవ పడుతుండగా తమ్ముడు బాలరాజు ఆగ్రహం వ్యక్తం చేశాడు. వారించినప్పటికీ వినకపోవటంతో క్షణికావేశంలో తమ్ముడు బాలరాజు రోకలి బండతో అన్న ప్రసాద్‌ను కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. హుటాహుటీన ఒంగోలు రిమ్స్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. దర్శి సీఐ షేక్ షమీముల్లా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అల్లుడుపై మామ దాడి

ముండ్లమూరు, జూలై 7: మండలంలోని చినఉల్లగల్లు గ్రామానికి చెందిన రావిశ ప్రసన్నకుమార్‌ను ఏలూరు వీరాంజనేయులు ఇటీవల దాడి చేసి గాయపరిచినట్టు ముండ్లమూరు పోలీసు స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. మామ వీరాంజనేయులు, అల్లుడు ప్రసన్నకుమార్ మధ్య మనస్పర్థలు నెలకొన్నాయి.

ఈక్రమంలో అల్లుడు తలపై బలంగా కొట్టడంతో గాయలయ్యాయి. ముండ్లమూరు ఎస్‌ఐ ఆంజనేయులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సంఘ సేవకుడికి అవార్డు

దర్శి, జూలై 7: దర్శి పట్టణానికి చెందిన సంఘ సేవకుడు తెనాలి రవి ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించి హెచ్‌ఎస్‌టీ యూనివర్సిటీ టెస్సాస్ (యూఎస్‌ఏ) డాక్టరేట్ అవార్డును అందజేశారు. హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఈ డాక్టరేట్ పట్టాను యూనివర్సిటీ ప్రతినిధులు అందజేసి సత్కరించారు. తెనాలి రవికి గౌరవ డాక్టరేట్ రావటం పట్ల దర్శికి చెందిన పలువురు దళిత ప్రజాసంఘాల నాయకులు, గ్రామ పెద్దలు అభినందించారు.

వసతి గృహంలో అన్నిసౌకర్యాలు కల్పిస్తాం!

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



విద్యార్థినులతో సౌకర్యాల విషయంపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, జూలై 7: వసతి గృహంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న ఇంటిగ్రేటెడ్ బాలికల హాస్టల్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు అందతున్న వసతుల గురించి ఆరా తీశారు. భోజనం ఎలా ఉంటుందని తెలుసుకున్నారు. గదులను పరిశీలించారు. ఉక్కపోతగా ఉండగా కిటికీలు ఎందుకు వేశారని ప్రశ్నించగా, దోమలు వస్తున్నాయని తెలిపారు. కిటికీలకు మెష్‌లు ఏర్పాటుచేసేందుకు ప్రతిపాదనలు తయారుచేయాలని వార్డెన్ జయంతికి సూచించారు. ఖాళీగా ఉన్న వాటర్ డ్రమ్ములను పరిశీలించి, మంచినీరు లేదా అని విద్యార్థినులను అడిగారు. వాటర్ బబుల్‌లను కొనుక్కుంటున్నట్టు వార్డెన్ తెలపటంతో వాడుకనీటి బోరు పనితీరుపై విచారించారు. హాస్టల్‌కు ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. రోజూ టాయిలెట్స్‌లను శుభ్రం చేయించాలని వార్డెన్‌కు సూచించారు. దోమలు ప్రబలకుండా మున్సిపల్ సిబ్బందితో ఫాగింగ్ చేయిస్తామని తెలిపారు. కొంతమంది విద్యార్థినులు కింద పడుకునేందుకు ఇబ్బందిగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి బెడ్‌లు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకులు నంబుల వెంకటేశ్వర్లు, సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్‌టీఆర్), తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, గంగవరపు నాగిరెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య, కమిషనర్ టీవీ రంగారావు, ఎస్ఐ త్యాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

తాళ్లూరు, జూలై 7: మండలంలోని గుంటి గంగాభవానీ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి గంగమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి కరుణించమని వేడుకున్నారు.-చల్లంగ చూడమ్మ గంగమ్మ తల్లి అంటూ వేడుకున్నారు. ఆలయ బ్రాహ్మణ అర్చకులు ఎన్.కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్‌రావు, విజయలక్ష్మి, బాలరాజు అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నారాయణస్వామికి పూజలు



పూజల్లో పాల్గొన్న అసెంబ్లీ జాయింట్ సెక్రటరీ సుబ్బారెడ్డి దంపతులు

సీఎస్‌పురం(పామూరు), జూలై 7: సీఎస్‌పురం మండలం మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం పూజ కార్యక్రమాల్లో భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. రాష్ట్ర అసెంబ్లీ జాయింట్ సెక్రటరీ పాలకొలను సుబ్బారెడ్డి, చంద్రకళ దంపతులు పంచామృత అభిషేకంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకొన్నారు. ఈసందర్భంగా ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చినఆదినారాయణ, ఆలయ కార్యనిర్వహణాధికారి గిరిరాజు నరసింహాబాబు స్వామి వారి శేషవస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం గోశాలలోని గోపూజ కార్యక్రమాలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో కొమ్మినేని వెంకట్రావు, బయసాని మధుసూదనరావు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య

ముండ్లమూరు, జూలై 7: మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పులిపాడు గ్రామంలో చోటుచేసుకుంది. తాళ్లూరు మండలం మాధవరం గ్రామానికి చెందిన రావులపల్లి హనుమంతరావు(22) అనే యువకుడికి నాలుగు నెలల క్రితం పులిపాడుకు చెందిన శ్రీలతతో వివాహమైంది. ఈనెల 1వ తేదీ భార్యను చూడటానికి వచ్చి తన తండ్రిని రూ.10 వేలు కావాలని ఫోన్‌లో అడగ్గా నిరాకరించాడు.

దీంతో మనస్తాపం చెంది పులిపాడులో పురుగుల మందు తాగాడు. వెంటనే చికిత్స నిమిత్తం బంధువులు ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ముండ్లమూరు హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్రమణల్లో రోడ్డు మార్జిన్‌లు

- పామూరులో పెరిగిపోతున్న ట్రాఫిక్ కష్టాలు
- రోడ్ల విస్తరణపై దృష్టి సారించని అధికారులు



పామూరు మమ్మి డాడి సెంటర్‌లో నెలకొన్న ట్రాఫిక్

పామూరు, జూలై 7: పామూరు పట్టణంలో నిత్యం ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు, ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రధానంగా పామూరు - నెల్లూరు మెయిన్ రోడ్డులోని మమ్మిడాడి సెంటర్, సీఎస్‌పురం బస్టాండ్ సెంటర్, కందుకూరు రోడ్డు, విరువూరు రోడ్డు, కనిగిరి రోడ్డు సెంటర్లలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంది. దీనికితోడు రహదారులకు ఇరువైపులా ఉన్న మార్జిన్‌లు ఆక్రమణలకు గురవుతున్నాయి. దుకాణదారులు రోడ్డు కన్నా ఎత్తుగా మార్జిన్‌లను సిమెంట్ కాంక్రీట్ చేయడంతో ద్విచక్ర వాహనదారులు పార్కింగ్‌కు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలను రోడ్లపైనే నిలపడంతో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారుతున్నది. ఎదురెదురుగా రెండు వాహనాలు మెయిన్ రోడ్డుపైకి వచ్చినప్పుడు ట్రాఫిక్ నిలిచిపోతున్నది. దాంతో వాహనాలు నిలిచిపోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

దుకాణదారులు రోడ్డుకు సమాంతరంగా ముందుభాగం సిమెంటుతో ఎత్తు పెంచుతున్నా నియంత్రించాల్సిన ఆర్అండ్‌బీ, పంచాయతి అధికారులు పట్టించుకోవడంలేదు. దీంతో వర్షపు నీరు అంత రోడ్లపైనే ప్రవహిస్తున్నది. కొంతమంది దుకాణదారులు రోడ్డు మార్జిన్‌లను సైతం ఆక్రమించి తోపుడు, మిఠాయి బండ్లకు, చికెన్ స్టాల్స్‌కు అద్దెకు ఇస్తున్నారు. దుకాణాల్లో ఏదైనా వస్తువులు కొనుగోలు చేసేందుకు కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలు ఆగినప్పుడు ట్రాఫిక్ నిలిచి పోతున్నది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పడకేసిన పారిశుధ్యం

- రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు
- పట్టించుకోని అధికారులు



దొనకొండలో ప్రధాన రోడ్డులో నిలిచిన మురుగునీరు

దొనకొండ, జూలై 7: పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. దీంతో వ్యాధులు ప్రబలుతాయామోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని గ్రామాల్లో పారిశుధ్య నిర్మూలన కార్యక్రమాలను సంబంధిత పాలకులు, అధికారులు పట్టించుకోకుండా వదిలేశారు. ఫలితంగా గ్రామాల్లో మురుగునీరు రోడ్లపై నిలిచి దుర్వాసనతో, దోమల దాడులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మాత్రం ఇటీవల గ్రామాల్లో వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ ముమ్మరంగా ప్రచారం చేపడుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో అతిసార, డెంగ్యూ తదితర వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని దోమల బారిన పడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలంటూ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.



యర్రబాలెంలో అంగన్‌వాడీ కేంద్రం పక్కన నిలిచిన మురుగునీరు

మండలకేంద్రమైన దొనకొండలోని ప్రధాన రహదారి పక్కన మురుగునీరు ముందుకు కదిలే వీలులేక రోడ్డుపై ప్రవహిస్తున్నది. అధికారులు నిత్యం ఆ రహదారిపై రాకపోకలు జరుపుతూ పట్టించుకోకపోవటంపై ప్రజలు విమర్శిస్తున్నారు. యర్రబాలెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం పక్కన మురుగునీరు నిలచి దుర్గంధం వెదజల్లుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దుర్వాసనలు, దోమల దాడులతో అల్లాడిపోతున్నామని, ఎటువంటి వ్యాధులు సోకుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి ప్రజలు వ్యాధుల బారిన పడకుండా తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

శంకుస్థాపనకే పరిమితమైన టీటీడీ కళ్యాణ మండపం

- వైసీపీ పాలకుల అసమర్థతే కారణం
- ఆగ్రహం వ్యక్తంచేస్తున్న డిపాజిట్‌దారులు




టీటీటీ కల్యాణ మండపం కోసం శంకుస్థాపన చేసిని శిలాఫలకం

దర్శి, జూలై 7: వైసీపీ పాలకుల అసమర్థతతో దర్శి నియోజకవర్గంలో అనేక ప్రాజెక్టులు ఆరంభంలోనే ఆగిపోయాయి. కొన్ని ప్రాజెక్టులు పునాదుల్లో నిలిచిపోగా, మరికొన్ని శంకుస్థాపనలకే పరిమితమయ్యాయి. వైసీపీ ప్రభుత్వం హయాంలో ఎంతో ఆర్భాటంగా టీటీడీ కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కల్యాణ మండపం నిర్మిస్తే దర్శి ప్రాంత ప్రజలకు శుభకార్యక్రమాల నిర్వాహణకు ఎంతో అనువుగా ఉంటుందనే ఉద్దేశంతో పట్టణ ప్రముఖులు టీటీడీకి చెల్లించాల్సిన రూ.50 లక్షల డిపాజిట్ సొమ్మును డీడీ తీసి పంపారు. ఆర్భాటంగా శంకుస్థాపన చేసిన అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆతర్వాత పట్టించుకోలేదు. కల్యాణ మండపం నిర్మాణం కోసం దర్శి-తూర్పుగంగవరం రోడ్డులో రామాలయ మాన్యం భూమి ఎకరం కేటాయించారు. నిధులు విడుదల చేయకపోవటంతో అడుగు ముందుకు పడలేదు. గత వైసీపీ పాలకుల తీరుపట్ల డిపాజిట్ దారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు, తమ చేత డిపాజిట్లు కట్టించుకొని కల్యాణ మండపానికి నిధుల విడుదల చేయకుండా వైసీపీ పాలకులు నమ్మించి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఇక్కడ ప్రజల అవసరాలను గుర్తించి ఇప్పుడైనా కల్యాణ మండపం నిర్మానానికి నిధుల విడుదల చేస్తారని ఆశతో ప్రజలు ఎదురుచూస్తున్నారు.

మంత్రి గొట్టిపాటిని కలిసిన టీడీపీ నేతలు

ముండ్లమూరు, జూలై 7: విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను ఆదివారం మండలంలోని కెల్లంపల్లి పంచాయతీ పరిధిలోని బసవాపురం, శ్రీనివాసనగర్ గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు కట్టా చిన వెంకంబొట్లు, తాళ్ల ఇంద్రసేనారెడ్డి కలసి అభినందనలు తెలిపారు. కెల్లంపల్లి పరిధిలో నెలకొన్న లోవోల్టేజీ విద్యుత్ సమస్యను పరిష్కరించటంతో పాటు పెదఉల్లగల్లులో మంజూరైన 133 కేవీ సబ్‌స్టేషన్ పనులు చేపట్టి ఆరు గ్రామాల్లో నెలకొన్న లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని ఈసందర్భంగా మంత్రిని కోరారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించారు.





కుటుంబ సభ్యులతో లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని దర్శించుకున్న డీజీపీ ద్వారక తిరుమలరావు

మూతపడిన విభాగాలు పునరుద్ధరణ

- ఎల్‌హెచ్‌ఎంఎస్, ఫింగర్ ప్రింట్ డివైజ్ ప్రారంభం
- పోలీసుల పనితీరులో పారదర్శకం, జవాబుదారీతనం
- గుంటూరులో డీజీపీ ద్వారక తిరుమలరావు

గుంటూరు, జూలై 7: గత ప్రభుత్వ హయాంలో కారణం ఏమైనప్పటికీ పోలీస్ శాఖలో కొన్ని విభాగాలు మూతపడ్డాయని, వాటిని పునరుద్ధరిస్తామని డీజీపీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. ఆదివారం ఆయన గుంటూరు కృష్ణనగర్‌లోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మూతపడిన ఫింగర్ ప్రింట్ డివైజ్‌ను పునరుద్ధరిస్తామని తెలిపారు. విదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఈ డివైజ్‌ను వినియోగించి అక్కడికక్కడే నేరస్తులను గుర్తించవచ్చన్నారు. దీనితోపాటు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం(ఎల్‌హెచ్‌ఎంఎస్)ను కూడా పునరుద్ధరిస్తామన్నారు. ఈ విధానం ద్వారా ఎవరైనా ఊళ్లకు వెళుతుంటే స్థానిక పోలీసులకు సమాచారం ఇస్తే ఎటువంటి ఖర్చు లేకుండా తామే ఆ ఇంటిలో రహస్యంగా కెమెరా అమర్చి వారు తిరిగివచ్చే వరకు కాపలాకాయడం జరుగుతుందని తెలిపారు. తద్వారా నేరాలను అరికట్టడంతో పాటు నేరస్తులను కూడా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకునే వెసులుబాటు కలుగుతుందన్నారు. పౌర కేంద్రీకృత పోలీసింగ్‌ను అమలు చేయనున్నట్లు తెలిపారు. పోలీసుల పనితీరు పారదర్శకంగా, జవాబుదారితనంగా ఉండబోతుందన్నారు. పౌరులకు మరింతగా సేవలందించి ప్రజల మన్ననలు పొందేవిధంగా పోలీసుల పనితీరు ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధానంగా సాంకేతికపరమైన ఆధారాల ఆధారంగా కేసుల దర్యాప్తు ఉంటుందన్నారు. మాజీ ప్రజా ప్రతినిధులకు భద్రత తొలగించిన విషయంపై విలేకర్ల ప్రశ్నకు డీజీపీ స్పందిస్తూ వారి భద్రతపై సమీక్షించి నిర్ణయం తీసుకుంటామన్నారు. పోలీస్ శాఖలో కిందిస్థాయి ఉద్యోగులపై ప్రత్యేక దృష్టి సారించి వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తామని హామీ ఇచ్చారు.

జ్ఞాపకాలను గుర్తు చేసుకున్న డీజీపీ

తన చిన్నతనంలో కృష్ణనగర్ ప్రాంతంలో నివాసం ఉండి ఇక్కడే చదువుకున్నట్లు డీజీపీ ద్వారక తిరుమలరావు నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పట్లో కుటుంబ సమేతంగా నరసింహస్వామి ఆలయాన్ని సందర్శించుకునేవాడినని చెప్పుకొచ్చారు. చిన్నతనంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఉండేదని, ఆ తర్వాత క్రమంలో ఆలయాన్ని పునరుద్ధరించారని, ఆ తర్వాత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయాన్ని కూడా నిర్మించినట్లు తెలిపారు. ఆ సమయంలోనూ తాను ఇక్కడకు వచ్చి స్వామి వారిని దర్శించుకున్నట్లు తెలిపారు. తాను చిన్నతనంలో ఈ సమీపంలోనే నివాసం ఉండి ఈ ప్రాంతంలోనే చదువుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహణ కమిటీ ప్రతినిధి, విశ్రాంత ఏఎస్పీ కోటేశ్వరరావు, వెస్ట్ డీఎస్పీ మహేష్, పట్టాభిపురం సీఐ విజయచంద్రతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వృత్తివిద్యా కోర్సులు పూర్తిచేసిన వారికి నేడు అప్రెంటీస్ మేళా

గుంటూరు(విద్య), జూలై 7: వృత్తి విద్యాకోర్సులు పూర్తిచేసుకున్నవారికి (బాపట్ల జిల్లా) నిజాంపట్నం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సోమవారం అప్రెంటీస్‌మేళా నిర్వహిస్తున్నట్లు వృత్తివిద్యా కళాశాల ప్రిన్సిపాల్ (గుంటూరు) ఎస్ ఆనందబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అప్రెంటీస్ మేళాలో లలితా సూపర్‌స్పెషాల్టీ హాస్పట ల్, అహల్యా నర్సింగ్ హోమ్ సంస్థలు పాల్గొంటాయని తెలిపారు. ఎంపీహెచ్‌డబ్ల్యు, ఎంఎల్‌టీ పూర్తిచేసుకున్న వారు అప్రెంటీస్ మేళాకు హాజరుకావాలని సూచించారు. అప్రెంటీస్‌మేళాలో ఎంపీహెచ్‌డబ్ల్యులో 36, ఎంఎల్‌టీలో 24 ఖాళీలు భర్తీచేస్తారని తెలిపారు. ఎంపికైనవారికి నెలకు రూ.7వేల స్టయిఫండ్ ఇస్తారని తెలిపారు. మేళాకు వచ్చే విద్యార్థులు బయోడేటా, పది, ఇంటర్ విద్యార్హత సర్టిఫికెట్స్, ఆధార్ మూడు సెట్లు, ఆరు ఫొటోలు తీసుకుని రావాలని సూచించారు.

హ్యాపీనెస్ట్ భారం.. రూ. 164.5 కోట్లు







- ప్రాజెక్టును పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- ఐదేళ్లు కాలయాపనతో సీఆర్డీఏకు భారీ నష్టం
- ఎస్‌వోఆర్‌తో భవిష్యత్‌లో మరింత పెరిగే అవకాశం
- అదే పూర్తి చేసి ఉంటే రూ.57.37 కోట్ల లాభం వచ్చేది
- ప్రాజెక్టు పట్టాలెక్కుతుందనే ఆశలో ప్లాట్లు బుక్ చేసుకున్న వారు

హ్యాపీనెస్టు.. భారతదేశపు మొదటి గ్లోబల్ సిటీ ఆఫ్ ది ఫ్యూచర్‌గా ఉండేది. అమరావతి రాజధాని ప్రాంతంలో నివాసం ఉండేవారికి స్వచ్ఛమైన ఆనందాన్ని వెదజల్లేలా.. ఆధునికంగా.. పచ్చదనంతో అభివృద్ధి చేయాలని ఈ హ్యాపీనెస్టు ప్రాజెక్టును అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు రూపొందించారు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర ప్రజలతో పాటు జాతికి గర్వకారణంగా ఉంటుందని అప్పటి పాలకులతో పాటు ప్రజలు కూడా భావించారు. దీంతో 12 టవర్లలో నిర్మాణం తలపెట్టిన ఈ హ్యాపీనెస్టు ప్రాజెక్టులోని 1200 ఫ్లాట్స్ కోసం అడ్వాన్స్‌లు చెల్లించి మరీ ముందస్తుగా బుకింగ్ చేసుకున్నారు. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం.. జగన్ ముఖ్యమంత్రి కావడంతో ఈ హ్యాపీనెస్టు ప్రాజెక్టుకు శాపమైంది. ఐదేళ్లు దీని గురించి వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. దీంతో తమ డిపాజిట్లును వెనక్కు ఇచ్చేయాలని పలువురు సీఆర్‌డీఏని కోరడంతో 2022లో పిల్లిమొగ్గలేసి సాగదీస్తూ వచ్చింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం.. అమరావతి రూపశిల్పి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో హ్యాపీనెస్టు ప్రాజెక్టు తిరిగి పట్టాలెక్కుతుందని పలువురు భావిస్తున్నారు. అయితే వైసీపీ ఐదేళ్ల పాలన కారణంగా ఈ ప్రాజెక్టుతో సీఆర్‌డీఏకు రూ.164.5 కోట్ల భారం మోయాల్సి వచ్చింది. ప్రాజెక్టు నిర్మాణం జరిగే కొద్దీ ఎస్‌వోఆర్ పెరిగే అవకాశం ఉండటంతో నష్టం కూడా పెరగనున్నది.

గుంటూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఐకానిక్ సిటీగా అమరావతిని రూపొందించాలన్న నాటి పాలకుల ఆలోచనల నుంచి హ్యాపీనెస్టు ప్రాజెక్టు పుట్టింది. ఆధునికత.. లగ్జరీ.. సంప్రదాయాలు.. స్మార్ట్ లైఫ్‌స్టైల్‌ను మిళితం చేస్తూ ప్రపంచ స్థాయి వాతావరణాన్ని అందుబాటులోకి తెస్తూ.. 80 శాతానికిపైగా భూమిని సుందరమైన ప్రకృతి దృశ్యం చేరువ చేస్తూ హ్యాపీనెస్ట్ ప్రాజెక్టును సీఆర్‌డీఏ అమరావతి రాజధానిలోని నేలపాడు గ్రామంలో ప్రతిపాదించింది. అందులో నివాసం ఉండేందుకు ఫ్లాట్ల బుకింగ్ కోసం ప్రపంచవ్యాప్తంగా పలువురు పోటీ పడ్డారు. అయితే హ్యాపీనెస్టు ప్రాజెక్టుపై వైసీపీ పాలకులు కత్తిదూశారు. ఈ ప్రాజెక్టు గురించి టీడీపీ ప్రభుత్వ హయాంలో సర్వత్రా చర్చ జరిగింది. 12 టవర్లలో నిర్మాణం తలపెట్టిన 1200 ఫ్లాట్స్‌కు రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ఉన్న తెలుగువారి నుంచి కూడా విపరీతమైన స్పందన లభించింది. ఆన్‌లైన్‌లో బుకింగ్స్ ప్రారంభించగానే హాట్ కేక్‌ల్లా బుకింగ్ అయ్యాయి. అడ్వాన్స్‌లు చెల్లించి మరీ ముందస్తుగా బుకింగ్ చేసుకున్నారు. ఆ ప్రాజెక్టు పూర్తి అయి ఉంటే ఈ పాటికే ఆ ఒక్క హ్యాపీనెస్టులోకే 1200 కుటుంబాలు వచ్చి నివాసం ఉండేవే. అయితే వైసీపీ ప్రభుత్వం తన ఐదేళ్ల పాలనలో హ్యాపీనెస్టుని పక్కన పెట్టేసింది. దీంతో ఇప్పుడు ఆ ప్రాజెక్టు నిర్మాణ ఖర్చు గణనీయంగా పెరిగింది. 2024-25 ఎస్‌వోర్ ప్రకారం దాదాపుగా రూ.885 కోట్లను వెచ్చించాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. ఇది ప్రాజెక్టు ప్రారంభంలో వేసిన అంచనా విలువ రూ.720.5 కోట్లతో పోల్చితే దాదాపుగా రూ.164.5 కోట్లు అదనం. ఇప్పుడు ఈ మొత్తాన్ని ఏపీసీఆర్‌డీఏ భరించాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది.

చంద్రబాబు ఆమోదం.. జగన్ ద్రోహం

అమరావతి రాజధాని నగరానికి గత సీఎం జగన్ చేసిన ద్రోహం అంతా ఇంతా కాదు. రాజధానికే కాకుండా ఇక్కడ నివాసం ఉండాలని ఆలోచన చేసిన వారికి కూడా తీరని అన్యాయాన్నే చేశారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో రెసిడెన్షియల్ బిల్డింగ్స్ నిర్మాణంలో జోరు పెంచేందుకు ఏపీసీఆర్‌డీఏ హ్యాపీనెస్టు ప్రాజెక్టుని నిర్మాణం చేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి డీపీఆర్‌ని రూపొందించి ఆన్‌లైన్‌లో ఉంచింది. నేలపాడులోని 14.46 ఎకరాల విస్తీర్ణంలో సకల సదుపాయాలతో ఈ హ్యాపీనెస్టు ప్రాజెక్టుని ఒక రోల్‌మోడల్‌గా నిర్మించాలని భావించింది. 19 అంతస్తులతో ఒక్కో టవర్ నిర్మాణం చేయాలని నిర్ణయించింది. 1225, 1295 ఎస్ఎఫ్‌టీ విస్తీర్ణంలో 2 బీహెచ్‌కే ఫ్లాట్స్, 1510, 1590, 1630, 1710, 1870, 1980, 2120, 2245, 2640, 2750 ఎస్ఎఫ్‌టీలలో 3 బీహెచ్‌కే ఫ్లాట్స్‌ని నిర్మించేందుకు ప్లాన్ కూడా ఆమోదం లభించింది. ఇందులోనే ఎయిర్ కండీషన్డ్ జిమ్, క్రికెట్ ప్రాక్టీసు నెట్స్, స్కేటింగ్ రింగ్, రాక్ క్లయింబింగ్, ఏసీ మల్టీపర్పస్ హాల్, పార్టీ లాన్, లాంజ్, సెలూన్, ఏరోబిక్స్ హాల్, బ్యాడ్మింటన్ కోర్టులు, యోగా రూం, స్క్వాష్ కోర్టు, స్విమ్మింగ్ పూల్, టేబుల్ టెన్నిస్, క్లినిక్, ఫార్మసి డెస్కు, యాంపిథియేటర్, ధాన్యం వనం, జాగింగ్, రన్నింగ్ ట్రాక్, ఏటీఎంలు, బిజినెస్ సెంటర్‌లు, సూపర్ మార్కెట్‌లు వంటి సకల సదుపాయాలను నిర్మించేందుకు ప్లాన్స్ ఆమోదం పొందాయి. ఈ కారణంగానే 1200 ఫ్లాట్స్‌లో 1,187 ఇట్టే బుకింగ్ అయిపోయాయి. దీని నిర్మాణం పూర్తి అయితే సీఆర్‌డీఏకి రూ.57.37 కోట్ల లాభం కూడా వస్తుందని అప్పట్లో అంచనా వేశారు. ఈ ప్రాజెక్టుకి సంబంధించి ఏజెన్సీని కూడా అప్పట్లో సీఆర్‌డీఏ ఖరారు చేసింది. అయితే గత వైసీపీ ప్రభుత్వం వస్తూనే టెండర్లు రద్దు చేసింది. దాంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఈ క్రమంలో ఫ్లాట్స్ బుకింగ్ చేసుకున్న చాలామంది తమ డిపాజిట్లు వెనక్కు ఇచ్చేయాలని సీఆర్‌డీఏని కోరారు. దాంతో వైసీపీ ప్రభుత్వ హయాంలో 2022లో సీఆర్‌డీఏ తాను హ్యాపీనెస్టుని నిర్మిస్తానని పిల్లిమొగ్గలేసింది. ఏజెన్సీని కూడా ఖరారు చేయనున్నట్లు ప్రకటించింది. అయితే అది ఎంతమాత్రం కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు దీనిపై ప్రభుత్వం రూ.164.5 కోట్ల భారం మోయాల్సిన పరిస్థితి. ప్రాజెక్టు నిర్మాణం జరిగే కొద్దీ ఎస్‌వోఆర్ పెరిగే అవకాశం ఉండటంతో నష్టం కూడా పెరుగుతుంది.



నేలపాడులో నిర్మించాల్సిన 12 బ్లాకల హ్యాపీనెస్ట్ టవర్స్

కబ్జా.. కష్టమే..



- నిర్వహణ లేకపోవడంతో గోడలపై మొలిచిన మొక్కలు

- భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థులు వినతి
- సమీకృత హాస్టల్‌పై నాడు కన్నేసిన వైసీపీ నేత
- ప్రస్తుతం ఆ నేత మాజీ.. ఇప్పటికైనా కొలిక్కివచ్చేనా
- 90 శాతం పనులు పూర్తి.. 500 మందికి వసతి సౌకర్యాలు

గుంటూరు(విద్య), జూలై 7: కుల మతాలకు అతీతంగా విద్యార్థులకు వసతి కల్పించి వారి విద్యాభివృద్ధికి బాటలు వేయాలనే మహోన్నత లక్ష్యంతో సమీకృత భవన నిర్మాణం చేపట్టారు. అయితే ఆ తర్వాత అధికారం చేపట్టిన వైసీపీ పాలకులు దానిని కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. అయితే అప్పట్లోనే విద్యార్థులు, ప్రజాసంఘాలు అడ్డుకోగా ఆ నేత వెనక్కి తగ్గారు. అయినా లీజు పేరుతో కబ్జా పాలవుతుందని విద్యార్థులు ఆందోళనలో ఉన్నారు. అయితే తాజా ఎన్నికల్లో మాజీగా మారడంతో ఆ నేత మాస్టర్‌ప్లాన్‌కు చెక్ పడింది. ఇదీ గుంటూరులోని బ్రహ్మానందరెడ్డి స్టేడియం ఎదురుగా ఉన్న సమీకృత (ఇంటిగ్రేటెడ్) హాస్టల్ భవనం కథ. గతంలో ఈ ప్రాంగణంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ప్రత్యేకంగా మూడు వసతి గృహాలు ఉండేవి. వివిధ ప్రాంతాలకు చెందిన దాదాపు మూడో తరగతి నుంచి 10వ తరగతి స్థాయి వరకు 400 మంది విద్యార్థులకు వసతి కల్పించేవారు. ఇదే ప్రాంగణంలో ప్రాథమిక పాఠశాల కూడా ఉండేది. కాలక్రమేణ ఇక్కడ భవనాలు శిథిలావస్థకు చేరడంతో ప్రభుత్వం ఇక్కడ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మించాలని నిర్ణయించింది. ఇందుకు తగ్గట్లు 2013కు ముందున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ తర్వాత టీడీపీ ప్రభుత్వం ఈ భవన నిర్మాణానికి రూ.5 కోట్లు నిధులు కేటాయించింది. పనులు ప్రారంభమైన రెండేళ్లకు 90 శాతం పూర్తి చేశారు. ఆ తర్వాత 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ భవన నిర్మాణం గురించి పట్టించుకోలేదు. దీంతో పనులు నత్తనడకన సాగాయి. ఈ భవనం పూర్తి అయితే దాదాపు 500 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇతర సామాజికవర్గాల విద్యార్థులకు వసతి కల్పించే అవకాశం ఉండేదని అధికారులు చెప్పారు.



భవనం లోపల ఉన్న ఫ్లోరింగ్ మెటీరియల్

అయినా వైసీపీ పాలకులు ఈ పనులపై దృష్టి సారించలేదు. మిగిలిన పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకు వచ్చేందుకు కృషి చేయాల్సిన వైసీపీ నేత లీజు పేరుతో కబ్జా చేసి షాపింగ్ మాల్‌గా భవనాన్ని మార్చాలని స్కెచ్ వేశారు. బీఆర్ స్టేడియం ఎదురుగా వ్యాపార కూడలిలో ఉన్న ఈ భవనాన్ని లీజు పేరుతో కబ్జా చేయాలని అప్పట్లో ప్రయత్నించాడు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన ఈ స్థలాన్ని, బిల్డింగ్‌ను స్వాధీనం చేసుకుని షాపింగ్‌మాల్ ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యాడు. ఈ గలీజు ఆలోచన విషయం తెలిసిన విద్యార్థి, ప్రజాసంఘాలు అప్పట్లో పెద్దఎత్తున ఆందోళనకు దిగాయి. దీంతో ఆ నేత వెనక్కి తగ్గాడు. వందల మంది విద్యార్థులకు వసతి కల్పించే భవనాన్ని షాపింగ్‌మాల్‌గా మార్చాలనుకున్న ఆ నేత ఇటీవల జరిగిన ఎన్నికల్లో మాజీ అయ్యాడు. దీంతో ఈ భవనం కబ్జా కోరల నుంచి బయటపడింది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అరకొర మిగిలిన పనులను పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని విద్యార్థి సంఘాల నేతలు కోరుతున్నారు. ఈ మేరకు అధికారులకు ప్రజలు, విద్యార్థి సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నారు.



- బీఆర్‌స్టేడియం ఎదురుగా నిర్మాణం పూర్తి అయిన సమీకృత హాస్టల్ భవనం

అడిగితే.. బుకాయింపు

- జిల్లాలో అధికారుల వింత ప్రవర్తన
- సమాచారం ఇవ్వరు.. సమాధానం చెప్పరు
- వైసీపీ హయాంలో అవకతవకలపై గందరగోళం

బాపట్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఆ విషయమా.. మాకు తెలియదనో.. లేదంటే తాము అప్పట్లో లేమనో చెప్పడం జిల్లాలోని వివిధ శాఖల అధికారులకు పరిపాటిగా మారింది. ముఖ్యంగా ఐదేళ్ల వైసీపీ హయాంలో జరిగిన అవకతవకలకు సంబంధించి ఆరా తీసేందుకు ప్రయత్నించే వారికి అధికారులు బుకాయింపుతో సరిపెడుతున్నారు. ప్రభుత్వ వ్యవహారాలకు సంబంధించి ప్రతి అంశం రికార్డుల్లో నిక్షిప్తం చేయడమో లేక ఆన్‌లైన్ చేయడమో జరిగి ఉండాలి. కాని ఐదేళ్ల వైసీపీ పాలనకు సంబంధించి ఏ ఒక్క సమాచారం అడిగినా అధికారుల వద్ద నుంచి సానుకూల స్పందన లేదు. పైగా బుకాయింపు ధోరణి అవలంబిస్తుండడం విస్మయం కలిగిస్తోంది. అధికారి ఎవరైనా కావచ్చుకాక రికార్డు నిర్వహించే ఉంటారుగా అంటే సమాధానం ఉండడం లేదు. ఇదీకాదు అంటే కొన్ని అంశాలకు సంబంధిచి ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన అని సమాధానం చెప్పి తప్పుకుంటున్నారు. ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే గడచిన ఐదేళ్లకు సంబంధించిన వివరాలు కూడా నమోదు చేయకుండా అడ్డగోలుగా వ్యవహరించారేమో అన్న అనుమానం కలుగుతోంది. లేదంటే వాటిని బయటకు పొక్కనీయకుండా ఇంకా వైసీపీ నేతల సేవలో తరించడానికి కొంతమంది అధికారులు ఇలా వ్యవహరిస్తున్నారా అనేది తేలాల్సి ఉంది. కీలకమైన అంశాలకు సంబంధించిన సమాచారం కూడా ప్రభుత్వ కార్యాలయాల్లో అందుబాటులో ఉండకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఒక వేళ ప్రస్తుత అధికారులు చెబుతున్నట్లు అసలు రికార్డుల్లో నమోదు చేయలేనంత నిర్లక్ష్యాన్ని పాత అధికారులు ప్రదర్శించి ఉంటే వారిపై చర్యలకు కూడా సిఫార్సు చేసే అవకాశం ఉంది. కాని ఇలాంటిదేమీ లేకుండా అన్నింటికి ఒక్కటే సమాధానంగా వివరాలు లేవు అని సరిపెట్టడం అంటే పరోక్షంగా వైసీపీ దోపిడీకి ఇప్పుడున్న అధికారులు కూడా సహకరించినట్లే అవుతుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఖర్చుచేసిన జడ్పీ నిధుల వివరాలు కూడా జిల్లా కేంద్రంలో లేవు. సీఈవో కార్యాలయం జడ్పీ తీర్మానాలతో పాటు నిధుల మంజూరు వివరాలన్నీ నమోదు చేయాలి. కానీ ఆ విషయంలోనూ నిర్లక్ష్యమే.



బాపట్ల మున్సిపాలిటీలో వింత వైఖరి..

గత ప్రభుత్వంలో జగనన్న కాలనీలకు భూసేకరణ పేరిట అవకతవకలకు పాల్పడడంతో పాటు, అనర్హులు ఎంతోమందికి ప్లాట్లు ఇచ్చారనేది ఆరోపణ. అప్పటి కమిషనర్ ప్యాలెస్ లాంటి ఇంటిని జగనన్న కాలనీ పక్కనే నిర్మించుకోవడం, ఈయనతో పాటు మరికొంత మంది ఉద్యోగులు కూడా ఇక్కడే స్థలాలు కొనుక్కోవడం కూడా పలు అనుమానాలకు తావిస్తోంది. జగనన్నకాలనీ అయితే నిర్మాణం కాలేదు కానీ కమిషనర్ ఇల్లు మాత్రం సర్వహంగులతో ఎప్పుడో కొలువుదీరింది. జగనన్నకాలనీల లబ్ధిదారుల జాబితా లేదనే జవాబుతో పాటు భూసేకరణకు సంబంధించిన లావాదేవీల వివరాలు కూడా మున్సిపాలిటీలో లేవనే సమాధానం రావడం విస్మయపరుస్తోంది. స్థలం పొందడానికి తెల్ల కార్డును ప్రామాణికంగా అప్పటి ప్రభుత్వం తీసుకుంది. కానీ ఈ నిబంధనలేవీ పాటించకుండా వైసీపీ వీర విధేయులే లబ్ధి పొందారని, వీరితో పాటు హౌసింగ్‌లో పనిచేస్తున్న ఓ ఉద్యోగి బినామీ పేర్లతో 7 ఇళ్లను చేజిక్కించుకున్నారన్న ప్రచారం కూడా ఉంది.

సహకార సొసైటీలదీ అదేదారి..

జిల్లాలో ఉన్న 112 సొసైటీల్లో ఉన్న నిధులను ఇష్టానుసారం వైసీపీ నేతలు బొక్కేశారని టీడీపీ ఆరోపిస్తోంది. ఇందుకు సంబంధించి రెండుమూడు సొసైటీల్లో గతంలోనే ఆధారాలతో వైసీపీ నేతలు చేసిన బాగోతాలు వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఐదేళ్లలో ఆయా సొసైటీల నుంచి రుణాల పొందిన వారిజాబితా కావాలన్నా కూడా లేదనే సమాధానం రావడం విస్మయపరుస్తోంది. పైగా రుణాలు ఇచ్చేది సెంట్రల్ బ్యాంకులో కనుక అక్కడ మాత్రమే సమాచారం ఉంటుందనే వింత వాదనను అధికారులు చేయడం కొసమెరుపు.

స్పందన అర్జీలపైనా అదే వైఖరి..

గత ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహించిన స్పందనలో కూడా వైసీపీ అక్రమాల మీద పెద్ద ఎత్తున అర్జీలు వచ్చేవి. అప్పట్లో వాటిని పరిష్కరించి డిస్పోజ్ చేశామనే సమాధానమే అధికారుల నుంచి వచ్చేది తప్పితే వివరాలు బహిర్గతం చేసేవారు కాదు. ప్రస్తుతం ఆయా శాఖలలో గతంలో స్పందనలో వచ్చిన అర్జీల వివరాలు కూడా లేవని, అవన్నీ డిలీట్ అయ్యాయని చెప్పడం బాధ్యతారాహిత్యానికి పరాకాష్టగా నిలిచింది.



పల్లామల్లి సొసైటీ కార్యాలయం

విచారణాధికారి చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

- పల్లామల్లి సొసైటీ సీఈవో ఫిర్యాదుపై స్పందించిన అధికారులు
- విచారణ చేపట్టిన డీసీవో
- కలెక్టర్, సహకార శాఖ కమిషనర్‌కు నివేదిక
- సీఎం, ఉన్నతాధికారులకు సొసైటీల ఉద్యోగుల సంఘం ఫిర్యాదు

ఒంగోలు (విద్య), జూలై 7 : చీమకుర్తి మండలం పల్లామల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ)లో జరిగిన అక్రమాలపై విచారణాధికారి అయిన బి.వి.ఎస్.కృష్ణశాస్త్రి చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధమైంది. పల్లామల్లి సొసైటీ సీఈవో బి.వి.రమణయ్య ఫిర్యాదుపై అధికారులు స్పందించారు. విచారణ నిర్వహించి కృష్ణశాస్త్రిపై చర్యలకు ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించారు. తాజాగా ఏపీ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగులు సంఘం కూడా రంగంలోకి వచ్చింది. విచారణాధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

విచారణ విషయంలో నిర్లక్ష్యం.. సీఈవోపై అసభ్యపదజాలం

పల్లామల్లి సొసైటీలో భారీగా ఆర్థిక అక్రమాలు చోటుచేసుకున్నాయి. దీనిపై సహకారశాఖ అసిస్టెంట్ రిజస్ట్రార్ బి.వి.ఎస్.కృష్ణ శాస్త్రిని విచారణాధికారిగా నియమించారు. అయితే విచారణ విషయంలో ఆయన తీవ్ర అలసత్వం ప్రదర్శించారు. దీంతో డీసీవో శ్రీనివాసులురెడ్డి రెండుసార్లు హెచ్చరికలు జారీ చేశారు. తీరా విచారణకు ఆదేశించిన ఆరునెలల తర్వాత కేవలం 2022-23 సంవత్సరం రికార్డులు మాత్రమే పరిశీలనకు స్వాధీనం చేసుకున్నారు. ఈలోపు అసలు విచారణ జరగకుండా అడ్డుకొనేందుకుకు సొసైటీ సీఈవో ద్వారా విచారణాధికారి చేసిన ప్రయత్నాలు ఫలించ లేదు. దీంతో విచారణ తప్పని సరైంది. ఈ క్రమంలో కృష్ణశాస్త్రి సొసైటీ సీఈవో రమణయ్యను వ్యక్తిత్వహననం చేస్తూ అసభ్యపదజాలంతో అనరానిమాటలు అనడం ప్రారంభించారు. సహకార శాఖ ఉన్నతాధికారులను దూషించారు. విచారణ నిలిపివేసేందుకు విచారాణాధికారే హైకోర్టు లాయర్‌తో సంభాషించడం, సొసైటీ సీఈవో, ఉన్నతాధికారులను దూషించడం ఇవన్నీ రికార్డు అయి సహకార శాఖలో వైరల్‌గా మారాయి. ఈనేపథ్యంలో సీఈవో రమణయ్య డీసీవోను విచారణాధికారి దూషించిన ఆడియోలతో ఫిర్యాదు చేశారు.

డీసీవో విచారణ

సొసైటీ సీఈవో రమణయ్య ఫిర్యాదు మేరకు డీసీవో శ్రీనివాసరెడ్డి పల్లామల్లి సొసైటీకి వెళ్లి విచారణ నిర్వహించారు. విచారణాధికారి దూషణలను భరించలేకపోతున్నానని, తనను సస్పెండ్ చేయాలని ఈ సందర్భంగా సీఈవో కోరారు. సమగ్ర విచారణ అనంతరం డీసీవో తన నివేదికను కృష్ణశాస్త్రిపై తగు చర్యల నిమిత్తం కలెక్టర్‌కు అందజేశారు. ఈ మొత్తం వ్యవహారంపై మరో సమగ్ర నివేదికను రాష్ట్ర సహకారశాఖ కమిషనర్‌కు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపించినట్లు డీసీవో 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

విచారణాధికారిని మార్చాలి

పల్లామల్లి సొసైటీ సీఈవో రమణయ్యను వేధింపులకు గురిచేస్తూ దుర్భాషలాడుతున్న విచారణాధికారిని వెంటనే మార్చాలని ఏపీ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విచారణాధికారి బెదిరింపులకు దిగడం, జుగుస్సాకరంగా మాట్లాడటం వంటి చర్యలను వారు ఖండించారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈమేరకు వారు సీఎంతోపాటు సహకార శాఖ కమిషనర్, కలెక్టర్, డీసీవో, డీఎల్‌సీవోలకు ఫిర్యాదు చేశారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

అద్దంకిటౌన్, జూలై 7 : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని కొత్త పసుమర్తిపాలెంలోని గుర్రం జాషువా విగ్రహం వద్ద ఆదివారం ఎమ్మార్పీఎస్ జెండాను నాయకులు ఆవిష్కరించారు. ముందుగా బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంద కృష్ణమాదిగ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీసీహెచ్ కోటయ్య, చక్రవర్తి, సీనియర్ నాయకులు, టీడీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎ పూనూరి నరేంద్ర, తాళ్లూరి బాబూరావు, అనపర్తి రమేష్ బాబు, ముఖ్య కార్యదర్శి సిద్దు, కోటేశ్వరరావు, జిల్లా నాయకులు మోషే, ఎండి దాసు, చెన్నయ్య, బుజ్జిబాబు, అంకయ్య, బుల్లెయ్య, హనుమయ్య, శేఖర్ పాల్గొన్నారు.

అన్నార్తులకు కడుపు నిండా..

- మళ్లీ తెరుచుకోనున్న అన్న క్యాంటీన్‌లు
- చర్యలు వేగవంతం చేసిన ప్రభుత్వం
- తీరనున్న పేదల ఆకలి బాధ
- రూ.5కే అల్పాహారం, భోజనం
- ఐదేళ్లుగా మూసివేసి కడుపుకొట్టిన వైసీపీ ప్రభుత్వం
- పునఃప్రారంభించాలని కూటమి సర్కారు నిర్ణయం
- ఇప్పటికే పలుచోట్ల స్వచ్ఛందంగా భోజనాలు పెడుతున్న టీడీపీ నాయకులు

పేదలకు కడుపు నిండే కబురు! అన్నార్తుల ఆకలి బాధ తీర్చేందుకు అన్న క్యాంటీన్‌లను పునఃప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేసింది. చకచకా ఏర్పాట్లు చేస్తోంది. రూ.5కే అల్పాహారం, భోజనం అందించనుంది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న అనంతరం చంద్రబాబు నాలుగో సంతకం దీనిపైనే చేశారు. అందుకనుగుణంగా ఒంగోలు నగర పాలక సంస్థతోపాటు, జిల్లాలోని ఇతర మునిసిపాలిటీల అధికారులు కదిలారు. వైసీపీ పాలనలో వివిధ కార్యాలయాలకు కేటాయించిన అన్న క్యాంటీన్‌ల భవనాలను ఖాళీ చేయించి సిద్ధం చేశారు. మరోవైపు ఇప్పటికే టీడీపీ నాయకులు, కార్యకర్తలు పలుచోట్ల మధ్యాహ్నం ఉచితంగా భోజనం అందిస్తున్నారు. కనిగిరిలో ఏడాదిన్నర నుంచి ఎమ్మెల్యే ఉగ్ర ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్ నడుస్తుండగా, ఎన్నికల తర్వాత నుంచి ఒంగోలులోని నాలుగు ప్రాంతాల్లో టీడీపీ నాయకులు స్వచ్ఛందంగా భోజనం పెడుతున్నారు. ప్రభుత్వం అన్న క్యాంటీన్‌లను పునఃప్రారంభించే వరకూ ఈ కార్యక్రమాన్ని కొనసాగించనున్నారు.



కనిగిరిలోని అన్నాక్యాంటీన్‌లో భోజనం చేసేందుకు బారులు తీరిన ప్రజలు

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 7 : పేదవాడి ఆకలి తీర్చే అన్న క్యాంటీన్‌లు సిద్ధమవుతున్నాయి. గత ఐదేళ్ల జగన్ పాలనలో మూతబడిని ఇవి ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పునఃప్రారంభమవుతున్నాయి. గతంలో రూ.5కే కడుపు నిండా భోజనం చేసిన వారికి తిరిగి అవే రోజులు రాబోతున్నాయి. పేదలకు పట్టెడన్నం పెట్టిన అన్న క్యాంటీన్‌లు మళ్లీ కళకళలాడనున్నాయి. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు 2014 ఎన్నికలకు ముందు పేదల ఆకలి కష్టాలను దగ్గరగా గమనించారు. ఆసమయంలో అధికారంలోకి రాగానే అతి తక్కువ ధరకే ఆకలి తీరుస్తామని హామీ ఇచ్చారు. అందులో భాగంగానే 2014 సెప్టెంబరులో అన్న క్యాంటీన్‌లకు శ్రీకారం పలికారు. రాష్ట్రంలో 200 క్యాంటీన్‌లు ఏర్పాటు చేయగా అందులో ఒంగోలులో నాలుగు ఉన్నాయి. కనిగిరి, మర్కాపురం, చీరాల, అద్దంకి, గిద్దలూరుల్లోనూ గత టీడీపీ పాలనలో అన్న క్యాంటీన్‌లు నడిచాయి.

తక్కువ ధరకే అల్పాహారం, భోజనం

అన్న క్యాంటీన్‌లలో అల్పాహారం కింద, ఇడ్లీ, ఉప్మా, పొంగల్ వీటిలో ఏదైనా ఒకటి రూ.5కే అందించారు. మధ్యాహ్న భోజనం కింద రూ.5కే 450 గ్రాముల అన్నం, పప్పు, కూర, అవసరాన్ని బట్టి గ్లాసు మజ్జిగ కూడా ఇచ్చారు. అందుకోసం ఒక్కో వ్యక్తికి రూ.63.23 ఖర్చవుతుండగా అందులో రోజుకు వారి వద్ద నుంచి వచ్చే రూ.15పోను మిగిలినది అప్పటి టీడీపీ ప్రభుత్వం భరించింది. అదేవిధంగా అప్పట్లో నిర్వహణ బాధ్యతను అక్షయ పాత్ర సంస్థకు అప్పగించగా, ఆతర్వాత జగన్ రెడ్డి అన్న క్యాంటీన్‌లను మూసివేయడంతో ఆ బాధ్యతల నుంచి అక్షయ పాత్ర తప్పుకుంది.

పేదల కడుపుమాడ్చిన జగన్

పేదల ఆకలి తీర్చేందుకు గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల నడిచిన అన్న క్యాంటీన్‌లను అధికారంలోకి రాగానే జగన్ ప్రభుత్వం అడ్డగోలుగా తొలగించింది. పేరు మార్చి మళ్లీ తెరుస్తామని చెప్పి మోసం చేసింది. ఐదేళ్లపాటు పేదల కడుపు మాడ్చింది. అన్న క్యాంటీన్ భవనాలను సచివాలయాలు, పలుప్రైవేటు కార్యాలయాలకు కట్టబెట్టింది. దీంతో పేదలు ఐదేళ్లపాటు అనేక అవస్థలు పడ్డారు. ఆకలితో అల్లాడిపోయారు. జగన్ ప్రభుత్వంపై రగిలిపోయారు. అందుకు ప్రతిగా ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ఘోర పరాజయాన్ని బహుమతిగా ఇచ్చి తగిన గుణపాఠం చెప్పారు. తమ ఆకలి తీరాలంటే చంద్రబాబు మళ్లీ రావాలని ఆయనకు పట్టం కట్టారు.

అన్న క్యాంటీన్‌ల పునఃప్రారంభంపై బాబు సంతకం

ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు తీసుకున్న వెంటనే అన్న క్యాంటీన్‌ల పునఃప్రారంభం ఫైల్‌పై సంతకం చేశారు. దీంతో పేదల ఆకలి కష్టాలు తీరనున్నాయి. కార్పొరేషన్, మునిసిపాలిటీల్లోని అన్న క్యాంటీన్ తలుపులు తెరుచుకునేందుకు సిద్ధమయ్యాయి. ఐదేళ్లగా మూతబడిన వాటిని పునఃప్రారంభానికి టీడీపీ కూటమి ప్రభుత్వం తొలిరోజే నిర్ణయం తీసుకోవడంతో అందుకు అనుగుణంగా ఇప్పటికే వివిధ కార్యాలయాలకు కేటాయించిన అన్న క్యాంటీన్‌లను అధికారులు ఖాళీ చేయించారు.

పేదల ఆకలి తీర్చడమే లక్ష్యం

గ్రామీణ ప్రాంతాల నుంచి వివిధ పనుల నిమిత్తం, ఆసుపత్రుల్లో రోగుల కోసం వచ్చేవారు. వారి పర్యవేక్షణ కోసం ఇక్కడే ఉండే వారు, చాలీచాలని కూలీతో రోజంతా పనిచేసే కార్మికులు, ఆటో డ్రైవర్లు అన్న క్యాంటీన్‌లు వరంగా భావిస్తున్నారు. ప్రస్తుతం నగరంలోని పలు హోటళ్లలో రెండు ఇడ్లీల రేటు రూ.10 నుంచి 20 వరకూ ఉంది. దోశ రూ.10 నుంచి 25 వరకూ.. పూరీ, పొంగల్ ఇలా ఏది తినాలన్నా రూ.25కు తక్కువకు లభించే పరిస్థితి లేదు. మధ్యాహ్నం భోజనం చేయాలంటే కనీసం రూ.65 నుంచి రూ.90 వరకూ చెల్లించాల్సి వస్తోంది. మినీ మీల్స్‌తో సరిపెట్టుకుందామనుకునే వారు కూడా కనీసం రూ.40 చెల్లించనిదే కడుపు నిండే పరిస్థితి లేదు. రోజువారీ కూలీ రూ.300 వస్తున్న కార్మికుడు టీ, టిఫిన్, భోజనంతో సాయంత్రమయ్యే సరికి దాదాపు రూ.150 వరకూ ఖర్చుచేయాల్సి వస్తోంది. ఈనేపథ్యంలో ఏరోజు కారోజు కూలీ, నాలి చేసుకుని జీవించే వారికి అన్న క్యాంటీన్‌లు వరం కానున్నాయి. వీటి నిర్వహణ బాధ్యతలను తొలుత మెప్మాకు అప్పగించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

కనిగిరి, ఒంగోలులో ఇప్పటికే ఉచితంగా భోజనాలు

ప్రభుత్వం అన్న క్యాంటీన్‌లను పునఃప్రారంభిస్తున్న నేపథ్యంలో ముందస్తుగానే టీడీపీ నాయకులు స్వచ్ఛందంగా పేదలకు భోజనాలు పెడుతున్నారు. కనిగిరిలో ఏడాదిన్నర నుంచి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తన సొంత నిధులతో అన్న క్యాంటీన్ నిర్వహిసున్నారు. అక్కడ రోజుకు సుమారు 300 నుంచి 400 మంది వరకూ పేదలు ఆకలి తీర్చుకుంటున్నారు. అలాగే ఒంగోలులో గతంలో నాలుగు అన్న క్యాంటీన్‌లు ఉండగా వైసీపీ అధికారంలోకి వచ్చాక వాటిని తొలగించింది. అయితే తాజాగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అభిమానులు స్వచ్ఛందంగా తిరిగి నాలుగు క్యాంటీన్‌ల వద్ద ఉచితంగా పేదలకు అన్నం పెడుతున్నారు. గత నెల 27న దామచర్ల వాటిని ప్రారంభించారు. కలెక్టరేట్ ఎదురు ఉన్న పాత రిమ్స్, కొత్తపట్నం బస్టాండ్ రైతుబజారు, కర్నూలు రోడ్ పవర్ ఆఫీసు వద్ద, కొత్తకూరగాయల మార్కెట్‌లో ఉన్న క్యాంటీన్‌లలో ప్రతిరోజూ ఒక్కోచోట 300 చొప్పున 1,200 మంది ఆకలి తీరుస్తున్నారు. ప్రభుత్వం అధికారకంగా అన్నక్యాంటీన్‌లు ప్రారంభించేవరకు టీడీపీ శ్రేణులు ఈ కార్యక్రమాన్ని కొనసాగించనున్నాయి.

ప్రజలకు చేరువగా..

- సమస్యల పరిష్కారం దిశగా.. కొత్త కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పీడు
- పదిరోజుల్లో పలు అంశాలపై దృష్టి
- క్షేత్రస్థాయిలో పరిశీలనలకు ప్రాధాన్యం
- కీలక అంశాలపై లోతైన సమీక్ష
- అధికారులు, సిబ్బందిలో జవాబుదారీ తనం పెంపునకు ప్రయత్నం
- ప్రభుత్వ కార్యక్రమాల విజయవంతానికి చర్యలు
- నేడు మార్కాపురంలో 'మీ కోసం' అర్జీల స్వీకరణ



ఇటీవల వెలిగొండ నిర్వాసిత గ్రామాల్లో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఎక్కువ సమయం గడుపుతూ క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లకుండా పాలన సాగించే పరిస్థితికి భిన్నంగా ప్రస్తుత కలెక్టర్ తమీమ్ అన్సారియా ముందుకు సాగుతున్నారు. ప్రజలకు చేరువుగా, వారి సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పది రోజుల్లోనే పలు కీలక అంశాలపై దృష్టి సారించారు. క్షేత్రస్థాయిలో సమస్యల పరిశీలనతోపాటు ప్రధానాంశాల్లో లోటుపాట్లు సరిచేసేలా లోతైన సమీక్షలు చేస్తున్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాల విజయవంతానికి చర్యలు చేపడుతున్నారు. జిల్లాకు 38వ కలెక్టర్‌గా తమీమ్ అన్సారియా గతనెల 27న బాధ్యతలు స్వీకరించారు. ఈ పదిరోజుల్లో పనితీరులో ఒకింత దూకుడుగానే ఆమె సాగుతున్నారు. నూతనంగా ఏర్పడిన టీడీపీ కూటమి ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు, కీలక ప్రజాప్రతినిధులతో సమన్వయానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. కార్యాలయంలో మొక్కుబడిగా శాఖల వారీ సమీక్షలు తన అభిమతంకాదన్న విషయాన్ని తొలిరోజే యంత్రాంగానికి స్పష్టం చేసిన ఆమె తదనుగుణంగానే వ్యవహరిస్తున్నారు.

వెలిగొండపై ప్రత్యేక దృష్టి

జిల్లాకు సంబంధించి అత్యంత కీలకమైన వెలిగొండ ప్రాజెక్టు వ్యవహారంపై తొలుత కలెక్టర్ దృష్టి సారించారు. ఇంజనీరింగ్, రెవెన్యూ ఇతర సంబంధిత అధికారులతో తాను బాధ్యతలు స్వీకరించిన మూడు నాలుగు రోజుల్లోనే లోతైన సమీక్ష నిర్వహించిన అన్సారియా ఆమరుసటి రోజే ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతాన్ని, నిర్వాసిత గ్రామాలు, పునరావాస కాలనీలను సందర్శించారు. అక్కడ కింది స్థాయి అధికారులతో మాట్లాడి సమస్యలను అవగాహన చేసుకున్న ఆమె వాటి పరిష్కారం, ప్రాజెక్టుకు ఉన్న ఆటంకాలు, తొలగింపు లక్ష్యంగా చర్యలు ప్రారంభించారు.

ఉచిత ఇసుకపై సత్వర స్పందన

రాష్ట్ర ప్రభుత్వం తొలిహామీ అమలుగా చేపట్టిన పెంచన్‌ల పింఛన్ల పంపిణీ ప్రక్రియ ఎలాంటి అవరోధాలు లేకుండా పూర్తి చేయించారు. ఉచిత ఇసుక విధానం సత్వర అమలుపై వేగంగా స్పందించి చర్యలు తీసుకున్నారు. అలాగే జిల్లాలో కీలకంగా ఉండే ఉపాధి పథకం అమలులో లోటుపాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆశాఖకు సంబంధించిన మండల స్థాయి అధికారులు, సిబ్బందితో డ్వామా కార్యాలయానికి వెళ్లి మరీ సమీక్ష నిర్వహించారు. లోపాలు సరిదిద్దుకొని పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేలా దిశానిర్దేశం చేశారు. కొణిజేడు ప్రాంతంలో వాటర్‌షెడ్ పనులను స్వయంగా పరిశీలించి ఆయా అంశాలపై ప్రత్యేక దృష్టి ఉంటుందన్న సంకేతాలు ఇచ్చారు. తాగునీటి సరఫరా, వైద్య ఆరోగ్య ఇతర కీలక శాఖలపైనా అలాంటి సమీక్షలే నిర్వహించి నిర్థిష్ట సూచనలు చేశారు.

ప్రజాప్రతినిధులతో సమన్వయానికి ప్రాధాన్యం

పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లాకు చెందిన రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ స్వామితో కలిసి రాజంపల్లిలో పాల్గొన్న కలెక్టర్ తర్వాత కూడా తన పర్యటనల సమయంలో స్థానిక కీలక ప్రజాప్రతినిధులతో సమన్వయానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. పశ్చిమ ప్రాంతంలో నీటి సమస్య విషయంలో ప్రజాప్రతినిదులు తన దృష్టికి తెచ్చిన అంశాలకనుగుణంగా సంబంధిత శాఖ అధికారులను అప్రమత్తం చేశారు,

ప్రజావినతుల పరిష్కారానికి చర్యలు

కలెక్టర్‌గా అన్సారియా బాధ్యతలు చేపట్టాక అధికారులతో నిర్వహించిన తొలి సమావేశంలోనే ప్రజల వినతులు సత్వర పరిష్కారం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఆ దిశాగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వినతుల స్వీకరణలోనూ ప్రజలకు అందుబాటులోకి వెళ్లాలన్న ఆలోచన చేశారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించాక తొలి సోమవారం జిల్లా కేంద్రంలో మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న ఆమె రెండో సోమవారం అయిన ఈనెల 8 మార్కాపురంలో జరిగే కార్యక్రమంలో పాల్గొననున్నారు. పశ్చిమ ప్రాంత ప్రజలు జిల్లా కేంద్రానికి రావడానికి అనేక వ్యయప్రయాసాలు పడాల్సి వస్తున్న నేపథ్యంలో ఆప్రాంతానికే యంత్రాంగంతో తరలివెళ్తున్నారు. తమకు మేలు జరిగేలా ఆకాంక్షలకు, కొత్త ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా కలెక్టర్ అన్సారియా ముందుకు సాగాలని జిల్లా ప్రజానీకం కోరుతోంది.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ భవానీప్రసాద్

నిబంధనలు పాటించేందుకు నిధులు సమకూర్చుకున్నాం

- ఎమ్మెల్యేకు ఎలాంటి సంబంధం లేదు

చీరాల, జూలై 7 : గత కొన్ని రోజులుగా తీర ప్రాంతంలో రిసార్టులకు లాక్‌డౌన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పర్యాటకుల భద్రతకు సంబంధించి అంతకు ముందు జరిగిన దుర్ఘటనల పరంగా రక్షణ చర్యలు చేపట్టారు. అయితే అందుకు సంబంధించి పలు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఈ క్రమంలో బీచ్ రిసార్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం చీరాల శ్రీనివాస నర్సింగ్ హోమ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిర్వాహక ప్రతినిధులు డాక్టర్ అన్నే భవానీ ప్రసాద్ తదితరులు మాట్లాడారు. తీరంలో పర్యాటకుల భద్రత కోసం ఏర్పాటు చేసే చర్యలకు సంబంధించి నిధులు సమకూర్చుకున్నాం. అందులో ఎవరి ప్రమేయం లేదు. మా నుంచి ఎమ్మెల్యే కొండయ్య లేదా అతనికి సంబంధించిన వక్తులు ఎవరు కూడా తమను డబ్బులు డిమాండ్ చేయలేదని స్పష్టం చేశారు. వివిధ రూపాల్లో ఆరోపణలు చేసే వ్యక్తులు, లేదా సంస్థలు ఆ విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. భవిష్యత్ కార్యాచరణలో భాగంగా వెంటనే రిసార్టుల పునఃప్రారంభానికి ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన ఉత్తర్వులు ఇవ్వాలని నిర్వాహకులు కోరారు. సమావేశంలో రిసార్టుల ప్రతినిధులు బాలు, హరికృష్ణ పాల్గొన్నారు.

ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి భారీ స్పందన

- 1,065 మందికి పరీక్షలు
- ఆపరేషన్లకు 465 మంది ఎంపిక



కంటివైద్య శిబిరంలో స్వర్గీయ ఎన్‌టీఆర్, ఏలూరి నాగేశ్వరరావుల చిత్రపటాల వద్ద నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు

మార్టూరు, జూలై 7 : మండలంలోని ఇసుకదర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఏలూరి నాగేశ్వరరావు జ్ఞాపకార్థం ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, నొవా అగ్రిటెక్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి భారీ స్పందన లభించింది.ఉదయం 6 గంటలకే వివిధ ప్రాంతాలనుండి ప్రజానీకం కంటి పరీక్షలు చేయించుకోవడానికి ఏలూరి క్యాంపు కార్యాలయానికి తరలివచ్చారు. వారిలో పురుషలకు, మహిళలకు విడివిడిగా కౌంటర్లను ఏర్పాటు చేసి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. వారందరికీ శంకర కంటి ఆస్పత్రి నుంచి వచ్చిన వైద్య బృందం డాక్టరు యోగిత, డాక్టరు యామాదీప్తి ఆధ్వర్యంలో సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించారు. మొదట వారికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ కంటి వైద్య శిబిరానికి 1065 మంది హాజరుకాగా వారిని పరీక్ష చేసిన అనంతరం వారిలో 465 మందికి ఆపరేషన్లు చేయాలని వైద్యులు వెల్లడించారు. అదేవిధంగా వైద్య శిబిరానికి వచ్చిన వారందరికీ క్యాంపు కార్యాలయం వారు భోజన సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. అంతకు ముందు ఎన్టీఆర్ విగ్రహానికి, ఏలూరి నాగేశ్వరరావు చిత్రపటానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా తండ్రి జ్ఞాపకార్థం ఏలూరి చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అందిస్తున్నారన్నారు. లక్షమందికి కంటి ఆపరేషన్లు చేయించాలనే లక్ష్యంతో శిబిరాలను ప్రారంభించిన ఏలూరి ఇప్పటికే వేలాదిమందికి ఆపరేషన్లు చేయించారన్నారు. కార్యక్రమంలో కామేపల్లి హరిబాబు, తాటి నాగేశ్వరరావు, షేక్ రజాక్, మిన్నెకంటి రవికుమార్, శివరాత్రి శ్రీను, కోటపాటి సురేష్,కమ్మ శివనాగేశ్వరరావు,కామినేని జనార్దన్‌తొండెపు ఆదినారాయణ, గొట్టిపాటి వెంకట్రావు పాల్గొన్నారు.

వసతి గృహంలో అన్నిసౌకర్యాలు కల్పిస్తాం

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, జూలై 7: వసతి గృహంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న ఇంటిగ్రేటెడ్ బాలికల హాస్టల్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు అందతున్న వసతుల గురించి ఆరా తీశారు. భోజనం ఎలా ఉంటుందని తెలుసుకున్నారు. గదులను పరిశీలించారు. ఉక్కపోతగా ఉండగా కిటికీలు ఎందుకు వేశారని ప్రశ్నించగా, దోమలు వస్తున్నాయని తెలిపారు. కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు తయారుచేయాలని వార్డెన్ జయంతికి సూచించారు. ఖాళీగా ఉన్న వాటర్ డ్రమ్ములను పరిశీలించి, మంచినీరు లేదా అని విద్యార్థినులను అడిగారు. వాటర్ బబుల్‌లను కొనుక్కుంటున్నట్టు వార్డెన్ తెలపటంతో వాడుకనీటి బోరు పనితీరుపై విచారించారు. హాస్టల్‌కు ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటుచేయిస్తానని తెలిపారు. రోజూ టాయిలెట్స్‌లను శుభ్రం చేయించాలని వార్డెన్‌కు సూచించారు. దోమలు ప్రబలకుండా మున్సిపల్ సిబ్బందితో ఫాగింగ్ చేయిస్తామని తెలిపారు. కొంతమంది విద్యార్థినులు కింద పడుకునేందుకు ఇబ్బందిగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి బెడ్‌లు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. టీడీపీ నాయకులు నంబుల వెంకటేశ్వర్లు, సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్‌టీఆర్), తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, కమిషనర్ టీవీ రంగారావు, ఎస్ఐ త్యాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ వర్సెస్ నిందలు..!

- ఐదేళ్లలో పేరుకుపోయిన అవినీతి, అక్రమాలపై ఎమ్మెల్యే కొండయ్య ప్రత్యేక దృష్టి
- అక్రమార్కుల గుండెల్లో గుబులు
- అబద్ధాలను వండివారుస్తున్న వైరిపక్షం

చీరాల, జూలై 7 : చీరాల నియోజకవర్గంలో గత ఐదేళ్ల కాలంలో అవినీతి, అక్రమాలు పెచ్చరిల్లాయి. వాటి ప్రక్షాళనకు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య కార్యాచరణ చేపట్టారు. అందులో భాగంగా తీరప్రాంతంలో జరిగిన వరుస మరణాల నేపథ్యంలో రిసార్టుల నిర్వాహకులు తీసుకోవల్సిన జాగ్రత్తలను తప్పకుండా అనుసరించాలని స్పష్టం చేశారు. ఒకటికి రెండు పర్యాయాలు పోలీస్ అధికారులు, రిసార్టుల నిర్వాహకులతో సమీక్ష చేశారు. ఇక రియల్ ఎస్టేట్ వ్యాపారులు చేపడుతున్న అక్రమ లే-అవుట్లతో కొనుగోలుదారులు ఇబ్బంది పడుతున్నారు. ఆ క్రమంలో పక్కా లేఅవుట్‌లతో అడుగులు వేయాలని స్పష్టం చేశారు. నియోజవకర్గంలో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు చెక్ పెట్టేందుకు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా రెండు రోజుల కిందట టీడీపీ శ్రేణులు ఇసుక, రేషన్ బియ్యం అక్రమ దందాలను అరికట్టాలని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. గడియార స్తంభం సెంటర్లో నినాదాలు చేశారు. ఇలా ఒకటొకటిగా అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు, ప్రజా ప్రయోజనాలు కాపాడేందుకు ఎమ్మెల్యే కొండయ్య చేపడుతున్న కార్యక్రమాలతో అక్రమార్కులలో కొందరు పరోక్షంగా ఎదురు దాడికి దిగారు. ఆ క్రమంలో విషం చిమ్ముతూ అసత్యాలను ప్రచారం చేస్తున్నారు. దీనిపై టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

రియల్ ఎస్టేట్ వ్యాపారంకు సంబంధించి సదరు రియల్టర్లు వేసే అడుగులు నిబంధనలు మేరకు సాగుతున్నాయా..? లేదంటే తమ ప్రయోజనాల కోసం కీలక వ్యక్తులపై ఆరోపణలు చేస్తున్నారా అనే అంశంపై జోరుగా చర్చ సాగుతోంది. ఎమ్మెల్యేకు పరోక్షంగా ఓ రియల్టర్ 30 సెంట్ల భూమిని అప్పనంగా కట్టబెట్టారని కొందరు విష ప్రచారం చేస్తున్నారు. అయా ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని సదరు రియల్టర్‌లు స్పష్టం చేస్తున్నారు. అందుకు సంబంధించి ఆ రియల్టర్లు రాతపూర్వకంగా వివరణ ఇచ్చారు. అలానే రేషన్ బియ్యానికి సంబంధించి ఎమ్మెల్యేకు పరోక్షంగా ముడుపులు అందాయనే ఆరోపణలను చేసే వ్యక్తులు కొందరు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చారు. తీరప్రాంతంలో రిసార్టుల నిర్వాహకుల నుంచి డబ్బు కోరారని కొందరు అసత్య ప్రచారాన్ని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తన పరపతిని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తులు, సంస్థలపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు ఎమ్మెల్యే కొండయ్య అడుగులు వేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

లే-అవుట్లు నిబంధనల మేరకు వేయాలి..

కొనుగోలుదారులకు ఇబ్బంది లేకుండా చూడాలి

కొన్ని సంవత్సరాలుగా చీరాల నియోజకవర్గంలో అప్రూవ్డ్ లేఅవుట్లు ఒకటి, రెండుకు మించి లేవు. అనధికారిక లేఅవుట్లు పుట్టగొడుగుల్లా ఉన్నాయి. అందులో ప్లాట్లు కొనుగోలు చేసిన వ్యక్తులు తమ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టేందుకు కనీసం విద్యుత్ లైన్లు కూడా లేక ఇబ్బంది పడుతున్నారు. తాజాగా అధికార పార్టీకి చెందిన కీలకనేత సదరు రియల్టరు నుంచి 30 సెంట్ల భూమి నజరానాగా పొందినట్లు కొందరు విషం చిమ్ముతున్నారు. ఆ విషయం నియోజకవర్గంలో చర్చకు దారితీసింది. ఎమ్మెల్యే ముందస్తుగానే చేసిన ప్రకటనలపై వాస్తవాన్ని వక్రీకరిస్తున్నారని ప్రజలు నమ్ముతున్నారు.

ప్రాణహాని జరగకూడదంటే.. పైసలతో ముడిపెడతారా..?

చీరాల నియోజక వర్గంలో

> రేషన్ బియ్యం అర్హులకే చెందాలి. అవి నల్ల బజారుకు తరలకూడదు. నిబంధనలను అతిక్రమిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు. ఈ మాటలు ఎమ్మెల్యే కొండయ్య డీలర్లకు, మిల్లర్లకు స్పష్టం చేశారు. అయితే కొందరు అదే పనిగా పనిగట్టుకుని రేషన్ బియ్యంకు సంబంధించి ఎమ్మెల్యేకు ముడుపులు
>
> **రేషన్ విషయమై ఒక్క రూపాయి ఇవ్వలేదు**
>
> అందాయనే ప్రచారం చేస్తున్నారు. ఇది ముమ్మాటికీ అవాస్తవం. రేషన్ విషయమై ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. రేషన్ డీలర్స్‌పరంగా తామిచ్చే సమాధానం ఇదే.
>
> **- డీ ప్రభాకరరావు, రేషన్ డీలర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి**

తీరప్రాంతంలో ఇటీవల కొన్ని దుర్ఘటనలు జరిగాయి. అందుకు కొందరు ప్రాణాలు మూల్యంగా చెల్లించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే కొండయ్య, రిసార్ట్స్ నిర్వాహకులు, పోలీస్ అధికారులతో ఉమ్మడి సమావేశం నిర్వహించారు. తీరంలో ప్రాణనష్టం ఘటన ఆఖరు కావాలి. భవిష్యత్‌లో అలాంటి ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకుందాం. రిసార్ట్స్ నిర్వాహకులు కార్యాచరణతో పనిచేయాలని ఎమ్మెల్యే చెప్పారు. దీనిపై బీచ్ రిసార్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు అడుగులు వేశారు. గజఈతగాళ్ల నియామకం, సెర్చ్ టవర్స్ ఏర్పాటు, లైఫ్ జాకెట్లు తదితరాలు సమకూర్చేందుకు నిధులు సమకూర్చగా అవి ఎమ్మెల్యే కోసమని కొందరు అసత్యాలను వండివారుస్తున్నారు. దానిని ఖండిస్తూ పర్యాటకులకు మెరుగైన సౌకార్యాలు కల్పిస్తున్నామని రిసార్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు స్పష్టం చేస్తున్నారు. ఈ విషయమై అసత్యాలను ప్రచారం చేసేవారిపై అవసరమైతే తగిన చర్యలు తీసుకునేందుకు అడుగులు వేస్తామని చెప్తున్నారు.

నిందలు వేసిన వారు నిజనిరూపణ చేయాలి..

లేదా శిక్షను అనుభవించాలి

రిసార్టుల నిర్వహణ నుంచి, రేషన్ బియ్యం, రియల్ ఎస్టేట్ వ్యాపారం వరకు నిందలు మోపినవారు నిజనిరూపణ చేయాలి. లేదంటే శిక్ష అనుభవించాలని టీడీపీ శ్రేణులు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నాయి. వాస్తవాలను వక్రీకరించి సదుద్దేశంతో పనిచేసే వారిని నైతికంగా దెబ్బతీసేందుకు, తమ వ్యక్తిగత ప్రయోజనాలను కాపాడుకునేందుకు ప్రయత్నం చేస్తున్న వ్యక్తులు, సంస్థలపై తగిన చర్యలు తీసుకోవాలని టీడీపీ, జనసేన, బీపేపీ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు.

> **వాస్తవాలను పరిశీలించి చర్యలు చేపడతాం**
>
> లేఅవుట్ల నుంచి, సీఆర్‌జడ్ వరకు నిబంధనలు ఏం ఉన్నాయి. వాటిని పాటించారా. పాటిస్తున్నారా. లేదంటే అతిక్రమణకు ఏం చర్యలు చేపట్టాలనే అంశాలతో ఇతర అంశాలకు సంబంధించి కూడా ఉన్నతాధికారులకు సమగ్ర నివేదికను సమర్పిస్తాం. అనంతరం తదుపరి చర్యలు చేపడతాం.
>
> **- సూర్యనారాయణరెడ్డి, ఆర్డీవో, చీరాల**



రోడ్డు నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కొండయ్య

అభివృద్ధే కొలమానంగా పనిచేస్తాం

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూలై 7 : నియోజకవర్గంలో అభివృద్ధే కొలమానంగా పనిచేస్తాం. అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యమని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ఆదివారం నియోజకవర్గం పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, శిలాఫలాకాల ఆవిష్కరణలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ తీరప్రాంతంలో రవాణా సౌకర్యం మెరుగుపరిచేందుకు వాడరేవు నుంచి రామాపురం మీదుగా పొట్టి సుబ్బయ్యపాలెం వరకు నిర్మించనున్న డబుల్ రోడ్డుతో పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. అంతకు ముందు చీరాల మండలం బోయినవారిపాలెం నుంచి వాద, రెడ్డిగారి కాలువ మీదుగా కుంకలమర్రు వరకు రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రాత్రికి రోటరీ సామాజిక భవనంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ఎమ్మెల్యే కొండయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్టీయు అధ్యక్షుడు సాయిశ్రీనివాస్, ఎంఈవో సుబ్రమణ్యేశ్వరరావు, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం చీరాల మండలం గవినివారిపాలెంలోని మేకలదిబ్బ నిర్వహించిన కనకనాగారపమ్మ అమ్మవారి కొలుపులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం కలసి పనిచేద్దాం

అభివృద్ధి కోసం అందరం కలసి పనిచేద్దామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ప్రముఖ సినీనటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అభిమానులకు చెప్పారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం బాలకృష్ణ అభిమానులు ఎమ్మెల్యే కొండయ్యను మార్యాదపూర్వకంగా కలిశారు.

అనంతవరం మాజీ సర్పంచ్ మృతి

యద్దనపూడి, (మార్టూరు) జూలై 7 : యద్దనపూడి మండలంలోని అనంతవరం గ్రామ మాజీ సర్పంచ్ పెదవల్లి కామేశ్వరరావు (75) అనారోగ్య కారణంగా శనివారం రాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఆయన తెలుగుదేశం పార్టీ కార్యకర్తగా, నాయకునిగా క్రమశిక్షణ గలిగిన వ్యక్తిగా పార్టీ కోసం నిరంతరం పనిచేశారు. కొంతకాలం అనారోగ్యంతో ఉన్నారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఒక ప్రకటనలో ఆయన కుటుంబానికి తన సంతాపం తెలియజేశారు. ఆదివారం సాయంత్రం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

సేవా కార్యక్రమాలు కొనసాగిస్తాం

వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న సేవా సమితి కమిటీ సభ్యులు

బల్లికురవ, జూలై 7 : చిటిపోతు, చిడిపోతు వంశస్తుల సేవా సమితి ద్వారా సేవా కార్యక్రమాలను నిరంతరం చేపడతామని అధ్యక్షుడు చిటిపోతు మస్తానయ్య తెలిపారు. ఆదివారం మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో చిటిపోతు, చిడిపోతు సేవా సమితి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆధ్వర్యంలో విజయవాడ హెల్ప్ వైద్యశాల సహకారంతో ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈసందర్భంగా శిబిరాన్ని సేవా సమితి అధ్యక్షుడు చిటిపోతు మస్తానయ్య అయన భార్య లలిత, కమిటీ సభ్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గుండెకు సంబంధించి వైద్యాధికారి సాయికుమార్ 205 మందికి పరీక్షలు నిర్వహించారు. వారిలో 40 మందికి ఉన్నత చికిత్సలు అవసరమని గుర్తించారు. వారికి వెంటనే పరీక్షలు చేపడతామని తెలిపారు. అనంతరం సేవా సమితి కమిటి వారు మాట్లాడుతు ప్రతి ఏడాది ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించేలా చర్యలు చేపడతామని తెలిపారు. శిబిరంలో సేవా సమితి సెక్రటరీ నాసరయ్య, మెంబర్లు చిటిపోతు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, బ్రహ్మానందం, భాస్కరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దేవాంగపురి పంచాయతీ కార్యదర్శిపై విచారణ

ఆదేశాలిచ్చిన డీపీవో

దేవాంగపురి(చీరాలటౌన్), జూలై 7 : చీరాల మండల పరిధిలోని దేవాంగపురి పంచాయతీ కార్యదర్శి మురళీ బాపూజీపై విచారణకు డీపీవో రవికుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఈ విచారణకు చీరాల డివిజినల్ పంచాయతీ అధికారిని నియమించారు. గ్రామంలోని శ్మశానాలను ధ్వంసం చేసి ఆక్రమణలకు పాల్పడినట్లు, అక్రమ రిజిస్ట్రేషన్‌లు, అక్రమ లే-అవుట్‌లు నెలకొనేందుకు సెక్రటరీ సహకరించినట్లు సామాజిక వేత్త దాసరి ఇమ్మానియేల్ ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేసేందుకు అధికారులు పూనుకున్నారు. ఈమేరకు అధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

తప్పుడు వార్తలపై బీసీ నేతల ఆగ్రహం

చీరాలటౌన్, జూలై 7 : ఆదివారం ఓ ప్రధాన పత్రికలో వెలువడిన కథనంపై పలువురు బీసీ, టీడీపీ నాయకులు మండి పడ్డారు. అసత్య ప్రచారం చేస్తూ నాయకునిపై బురద జల్లే విధంగా వార్తలు రాయడం అన్యాయమన్నారు. ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు.

12న మండల సర్వసభ్య సమావేశం

బల్లికురవ, జూలై 7 : మండల ప్రజా పరిషత్ కార్యాలయ సర్వసభ్య సమావేశం ఈ నెల 12న ఎంపీపీ శ్రీలక్ష్మీ అధ్యక్షతన జరుగుతందని ఎంపీడీవో హనుమారెడ్డి తెలిపారు. ఈసమావేశంలో గత మూడు మాసాల వ్యవధిలో మండలంలోని జరిగిన అభివృద్ధి పనులు, చేపట్టబోయే పనులపై సమీక్ష సమావేశం జరుగుతుందని అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

రేణుకమ్మకు మొక్కు తీర్చుకున్న టీడీపీ నేతలు

పంగులూరు, జూలై 7 : మండలంలోని చందలూరు గ్రామంలోగల రేణుకమ్మ తల్లి ఆలయంలో కొప్పోలు హరితతో పాటు స్థానిక టీడీపీ నేతలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులను తీర్చుకున్నారు. గడిచిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కూటమి అభ్యర్థిగా గొట్టిపాటి రవికుమార్ గెలవడంతోపాటు మంత్రి పదవిని చేపడితే అమ్మ వారికి 100 కొబ్బరి కాయలతో పూజలు చేస్తామని కొప్పోలు హరిత మొక్కుకున్నారు. కోరిక నెరవేరడంతో మంత్రి పదవి చేపట్టడంతో జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరి వెంకట సుబ్బారావు, గ్రామ సర్పంచ్ పెంట్యాల కిష్టారావుతో పాటు చిట్టాబత్తిన వంశస్తులు, మహిళా భక్తులతో కలసి ఆదివారం అమ్మవారి ఆలయంలో హరిత అమ్మవారికి తమ మొక్కుచెల్లించారు. కార్యక్రమంలో పెంట్యాల రామలింగస్వామి, వెంకటేశ్వర్లు (సిద్ధూ), శేషారావు, రామాంజనేయులు, సుబ్బారావు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు



డాక్టర్ నాగసూరి దంపతులకు పురస్కారాన్ని అందజేస్తున్న సభ్యులు

సాహితీవేత్త నాగసూరికి పురస్కారం

- వెలుగు చూడని గ్రంథాలను నేటి తరానికి అందిస్తున్న రచయిత
- సన్మాన సభలో వక్తలు

అద్దంకిటౌన్, జూలై 7 : వెలుగు చూడని గ్రంథాలను వెలికితీసి అందులో ఆంతర్యాన్ని నేటి తరానికి అందజేస్తున్న సాహితీవేత్త డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ అని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం స్థానిక శ్రీనివాస ఆ ర్యవైశ్య కల్యాణ మండపంలో పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ సాహిత్య పురస్కార సభ పద్యకవి డీవీఎం సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా హజరైన ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరి శ్రీనివాసులు మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమ నాగసూరి ఉన్నతికి మార్గాలన్నారు. ఎనిమిది పదుల పుస్తకాలకు సంపాదకత్వం వహించారని, మాధ్యమాల విశ్లేషకులని, పాఠ్యంశాల రచయితని, మూడు వేలకు పైగా సాహిత్య వ్యాసాలు రాసిన సాహితీవేత్త అని వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా రచయిత నాగసూరి వేణుగోపాల్‌కు పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ సాహిత్య పురస్కారం-2024ను పుట్టంరాజు శ్రీరామచంద్ర మూర్తి, శైలజ దంపతులకు అందజేయగా, వేణుగోపాల్ దంపతులను ఈ సందర్భంగా సాహితీ మిత్ర మండలి సభ్యులు సత్కరించారు. గాంధీజీ మార్గం నేటికీ అనుసరణీయమని డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ అన్నారు. మిడియా రంగం అతి ధోరణులను వీడి సమాజహిత కార్యక్రమాలు రూపొందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గాడేపల్లి దివాకర్‌దత్తు, డాక్టర్ యు. దేవపాలన, అన్నమనేని వెంకట్రావు, లక్కరాజు శ్రీనివాసరావు, రాఘురామశర్మ, మారం కోటేశ్వరరావు, రఫీ, సందరెడ్డి శ్రీనివాసరావు, అంజాద్ బాషా, హనుమంతరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మంత్రి గొట్టిపాటికి 104 ఉద్యోగుల వినతి



మంత్రి గొట్టిపాటిని కలిసిన 104 ఉద్యోగులు

అద్దంకిటౌన్, జూలై 7 : ఏపీ 104 ఎంఎంయూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను చిలకలూరిపేటలోని తన నివాసంలో ఉమ్మడి ప్రకాశం, బాపట్ల జిల్లా యూనియన్లు కలిసి వినతిపత్రం అందజేశారు. ముందుగా ఘన విజయం సాధించిన గొట్టిపాటికి అభినందనలు తెలియజేశారు. రాష్ట్రంలో అనేక సంవత్సరాలుగా వైద్య, ఆరోగ్య శాఖలో సేవలందిస్తున్నామని, అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటూ కోవిడ్ సమయంలో విధులు నిర్వర్తించామన్నారు. ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ నియామకాలల్లో మాకు వెయిటేజీని ఇవ్వకుండా గత ప్రభుత్వం వివక్షత చూపిందన్నారు. నెలనెలా సక్రమంగా జీతాలు చెల్లించడం లేదని, సమస్యలపై వినతులు ఇచ్చినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా పరిష్కారం చూపాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా యూనియన్ అధ్యక్షుడు నరేష్, జనరల్ సెక్రటరీ రవి వర్మ, డివిజన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలు నిలిపివేత



ఇసుక తవ్వకాలను పరిశీలిస్తున్న ఎస్ఐ

చినగంజాం, జూలై 7 : మండలంలోని చినగంజాం సర్వే నెంబర్లు 828, 829లోని భూములలో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలను చినగంజాం ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు ఆదివారం నిలిపివేశారు. శనివారం నుంచి ఆ భూములలో అక్రమంగా ఇసుక తరలిస్తుండడంతో ఆ ప్రాంతనికి ఎస్ఐ వెళ్లి విచారణ చేసి, ఇసుక తరలించేందుకు అనుమతులు లేకపోవడంతో, అక్రమంగా ఇసుక రవణా చేస్తున్నారని నిర్ధారించుకుని ఇసుక తవ్వకాలను అడ్డుకున్నారు. అనుమతులు ఉంటేనే ఇసుక తవ్వకాలు జరపాలని, అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరిపి, రవణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా ఉన్నాతాధికారుల ఆదేశాల మేరకు ఇసుక అక్రమ తవ్వకాలను నిలిపివేసినట్లు ఎస్ఐ తెలిపారు. చినగంజాం గ్రామ సర్వే నెంబర్లు 828, 829లలోని భూములలో జరుగుతున్న ఇసుక తవ్వకాలను వెంటనే నిలిపి వేయాలని కోరుతూ సీపీఎం పార్టీ జిల్లా నాయకులు జి.ప్రతాప్‌కుమార్ శనివారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. వైసీపీ హయాంలో దొంగ ఆన్‌లైన్లు, నకిలీ పట్టాదారు పాసుపుస్తకాలతో ఇసుక దోపిడీ చేశారని ప్రతాప్ కుమార్ తెలిపారు. ఇసుక అక్రమ రవణా, దొంగ ఆన్‌లైన్లు, నకిలీ పట్టాదారు పాసు పుస్తకాలను రద్దు చేయాలని, ఆ భూములు ఎస్టీల భూములు కనుక ఎస్టీలకే కేటాయించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

చినుకుపడితే రోడ్లన్నీ జలమయం

- అస్తవ్యస్తంగా సైడ్ కాలువలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి



పట్టణంలోని కాకానిపాలెం మండపం నుంచి నామ్ రోడ్డుకు వెళ్లే దారిలో నిలిచిన వర్షపు నీరు

అద్దంకి, జూలై 7 : అద్దంకి మున్సిపాలిటీగా మారినా వసతులు మాత్రం గ్రామస్థాయి పరిస్థితుల కంటే దారుణంగా ఉన్నాయంటే ఆశ్చర్యం కలుగక మానదు. చిన్నపాటి వర్షం పడ్డా రోడ్లన్నీ జలమయంగా మారుతున్నాయి. ప్రధానంగా అత్యధిక శాతం సైడ్ డ్రైన్‌లు పాతవి కావడం, శిథిలావస్థకు చేరి మురుగు, వర్షపు నీరు ప్రవహించే వీలు లేకుండా పోవటం తో సమస్యలు ఏర్పడుతున్నాయి. అదే సమయంలో రోడ్ల పక్కన ఉన్న భవనాల ముందు రోడ్ల కంటే ఎత్తు ఉండటంతో వర్షపు నీరు సైడ్ డ్రైన్లలోకి చేరే వీలు లేక సీసీ రోడ్ల పైనే నిలిచి పోతున్నాయి. ఇక పట్టణంలో శివారు కాలనీ లలో అత్యధిక శాతం గ్రావెల్ రోడ్లు కావటం తో చినుకుపడితే నడవలేని పరిస్థితి ఉంది. ప్రధానంగా గరటయ్య కాలనీ, ఎన్టీఆర్ నగర్ తదితర ప్రాంతాలలో రోడ్లన్నీ బురదమయంగా మారాయి. ఆర్టీసీ బస్టాండ్‌లో నీరు నిలిచి ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వచ్చేది వర్షాకాలం కావడంతో వర్షాలు మరింత ఎక్కువగా పడే అవకాశం ఉంది. దీంతో వర్షపు నీరు నిలిచి వ్యాధులు ప్రబలే అవకాశం కూడా ఉందని ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వర్షపు నీరు రోడ్లపై నిలువకుండా చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

మార్టూరులో ఇసుక రీచ్‌పై వివాదం



మార్టూరు, జూలై 7 : రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నుంచి టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఉచిత ఇసుక విధానాన్ని అమలులోకి తీసుకురానున్నది. ఈ నేపథ్యంలో గత వైసీపీ పాలనలో అక్రమంగా ప్రజలను దోచుకున్న ఇసుక రీచ్‌ల నిర్వాహకుల నుంచి ప్రస్తుతం ఉన్నత అధికారుల ఆదేశాలమేరకు రెవెన్యూ అధికారులు ఇసుక రీచ్‌లను స్వాధీనం చేసుకుంటున్నారు. అయితే మార్టూరులో డంపింగ్ చేసిన ఇసుక రీచ్‌లో కొంత వివాదాస్పద వాతావరణం ఏర్పడింది. ఈ ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేయడం కోసం సంబంధిత కంపెనీకి స్థలాన్ని లీజుకు ఇచ్చిన వ్యక్తి తనకు రావలసిన అద్దె బకాయిలు రాకపోవడంతో ఇసుక రీచ్‌ను అధికారులకు స్వాధీనం చేయడానికి అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వంలో మార్టూరులో ఇసుకరీచ్ ఏర్పాటుకు ఒక కంపెనీకి ప్రభుత్వం కాంట్రాక్టు ఇచ్చారు. వారు మార్టూరు లో అసిస్ట్ పాలకేంద్రం సమీపంలో ఇసుకరీచ్ ను ఏర్పాటు చేశారు. అందుకోసం మండలంలోని రాజుపాలెం గ్రామానికి చెందినఒక వ్యక్తి స్థలాన్ని లీజుకు తీసుకున్నారు కాని ఇసుక సక్రమంగా అమ్ముడుపోకపోవడం వలన కంపెనీ వారు ఇసుకరీచ్ నుంచి వెళ్లిపోయినట్లు తెలిసింది. చీరాల ఇసుక కావడంతో ఎక్కువగా ఇసుక అమ్ముడుపోలేదని తెలిసింది. ప్రస్తుతం అక్కడ సుమారు 1900 క్యూబిక్ మీటర్లుపైగా ఇసుక ఉన్నట్లు తెలిసింది. అయితే లీజుదారునికి ఇప్పటికి ఇంకా సుమారు 4 లక్షలు రూపాయలు అద్దె రూపంలో రావాల్సి ఉందని, అందువలన లీజు డబ్బులు చెల్లించేంతవరకూ ఇసుక రీచ్‌ను స్వాధీనం చేయనని అధికారులకు స్థల యజమాని తరపు వారు చెప్పినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం మైనింగ్ ఏడీ, ఎంపీడీవో నితిన్, యద్దనపూడి మండల ఇన్‌చార్జి తహసీల్దార్ వై.నాగరాజు, సీఐ రాజశేఖర్‌రెడ్డి ఇసుక రీచ్ వద్దకు వచ్చి స్థలంలో ఉన్న ఇసుకను కొలతలు వేసినట్లు తెలిసింది. అదేవిధంగా లీజుదారుడు తనకు రావలసిన అద్దె బకాయిలపై కాంట్రాక్టు తీసుకున్న వ్యక్తితో మాట్లాడుకోవాలని, ఈ విషయంపై అధికారులతో తర్వాత చర్చించుకోవాలని మొదట ఇసుకరీచ్‌ను స్వాధీనం చేసుకుంటున్నామని స్థల యజమానికి అధికారులు చెప్పినట్లు తెలిసింది. దాంతో సీఐ రాజశేఖర్ రెడ్డి పోలీసులను అక్కడ కాపలాగా ఏర్పాటు చేశారు. ఆదివారం కూడా ఇసుకరీచ్ వద్ద రెవెన్యూ, పోలీసు కాపలా కొనసాగింది. సోమవారం నుంచి ఇసుకరీచ్ వద్ద ప్రజలకు ఉచిత ఇసుకను పంపిణీ చేయడం జరుగుతుందని రెవెన్యూ అధికారులు తెలిపారు.

గాయపడిన వానరం

చికిత్సను చేసిన వైద్య సిబ్బంది



వానరానికి చికిత్స చేస్తున్న వైద్యులు

మార్టూరు, జూలై 7 : చెట్టుపై నుంచి కిందపడిన వానరానికి మార్టూరు లోని పశు వైద్యశాల సిబ్బందిచి చికిత్సను అందించారు. ఈ సంఘటన ఆదివారం జరిగింది. అందిన సమాచారం మేరకు.. మార్టూరు గ్రామ పంచాయతీ సమీపంలో చెట్టుపైన ఎగురుతున్నవానరం జారి నేలపై పడింది. దాంతో అది అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. విషయాన్ని గమనించిన స్థానికులు ఈ వానరాన్ని ప్రభుత్వ పశు వైద్యశాలకు తీసుకువెళ్లారు. అక్క డ పశు వైద్య సహాయకుడు జీ గోపి, వైద్య సిబ్బంది శ్రీను వానరానికి చికిత్సను అందించారు. అనంతరం కోలుకున్న వానరం వెళ్లిపోవడంతో అంద రూ సంతోషించారు.

శ్రీ అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

- ఆలయ అభివృద్ధికి రూ.40లక్షల విరాళం
- చెక్కును అందజేసిన జనసేన నాయకుడు శ్రీకాంత్



ఆలయ అభివృద్ధికి ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న మన్నెం

పర్చూరు, జూలై 7: పర్చూరులోని 92 అడుగుల శ్రీ అభయాంజనేయస్వామివారి విగ్రహ ఆలయ ప్రాంగణంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రవాశాంధ్రుడు, జనసేన యువనేత మన్నెం శ్రీకాంత్ పాల్గొన్నారు. అలయ అభివృద్ధికి రూ.40లక్షల విరాళాన్ని ప్రకటించి దానికి సంబంధించిన చెక్కును ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు శ్రీకాంత్‌ను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి రిటైర్డ్ ప్రిన్సిపాల్ మంగళగిరి కోటేశ్వరరావు మాట్లాడుతూ పర్చూరులో రూ.4కోట్ల వ్యయంతో దాతల సహకారంతో రూపుదిద్దుకున్న ఆలయాన్ని భక్తులకు మెరుగైన వసతులు కప్పించేందుకు దాతలు అందిస్తున్న సాయం హర్షనీయం అని అన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కోటా హరిప్రసాద్, కఠారి సురేంద్రబాబు, రంగిశెట్టి ఆంజనేయులు, తులసి అప్పారావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, కోటా శ్రీనివాసరావు, ఒగ్గిశెట్టి నరసింహం, రంగిశెట్టి రామాంజనేయులు, జనసైనికులు తోట మణి, దీర్ఘాల రమేష్ నాయుడు, మాధవ మాష్టర్, తులసి చంటి, కందా సురేంద్ర, అచ్చికోలు సతీష్, బాలాజీ, గోగుల శ్రీనివాసరావు, దాసరి సాంబయ్య పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతను పరీక్షించి ప్రజాధనం దుర్వినియోగం కాకుండా కాపాడాల్సిన క్వాలిటీ కంట్రోల్ విభాగం... అవినీతి సంపాదనకు అలవాటు పడి కంట్రోల్ తప్పింది. ఒకటి, రెండు కాదు.. కొన్ని వందల సర్టిఫికెట్లను క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించకనే జారీ అయ్యాయి. వైసీపీ ప్రభుత్వంలో ఇద్దరు అధికారులు ఇరిగేషన్ క్వాలిటీ కంట్రోల్ విభాగాన్ని శాసించారు. అప్పట్లో వైసీపీ నేతలు చెప్పిందల్లా చేస్తూ ప్రజాధనాన్ని దోచిపెట్టడంలో భాగస్వాములయ్యారు. పనులు చేయకుండానే ఇరిగేషన్ ఇంజనీర్లు బిల్లులు పెట్టగా, ఆ బిల్లు రావడమే తడవుగా క్వాలిటీ కంట్రోల్ అధికారులు సర్టిఫికెట్లు జారీచేశారు. తిలాపాపం తలాపిడికెడు అన్నట్లుగా ప్రజాధనాన్ని వైసీపీ నేతలు, ఇరిగేషన్ ఇంజనీర్లతో కలిసి క్వాలిటీ కంట్రోల్ అధికారులు పంచుకున్నారన్న ఆరోపణలున్నాయి. తాజాగా ప్రభుత్వం మారడంతో ఇరిగేషన్ శాఖలోని బిల్లులన్నీ వెనక్కు వస్తున్నాయి. మరి వీటికి క్యూసీ సర్టిఫికెట్లు ఎలా జారీ చేశారన్నది అనుమానంగా మారింది. నెల్లూరు ఇరిగేషన్ సర్కిల్ పరిధిలో క్వాలిటీ కంట్రోల్ విభాగం జారీ చేసిన సర్టిఫికెట్లపై విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

- కంట్రోల్ తప్పిన 'క్వాలిటీ'
- అవినీతిమయంగా ఇరిగేషన్ క్వాలిటీ కంట్రోల్ విభాగం
- గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా సర్టిఫికెట్ల జారీ
- క్షేత్రస్థాయిలో పనుల పరిశీలన చేయకనే ధ్రువీకరణ
- క్యూసీ సర్టిఫికెట్లనే ట్యాంపరింగ్ చేసిన ఘనులు
- వివాదాస్పదంగా ఇద్దరు అధికారుల తీరు
- ఎమ్మెల్యేలకు ఫిర్యాదులు.. మంత్రి నిమ్మల దృష్టికి అక్రమాలు

పనులు మిథ్య.. నాణ్యత డొల్ల !

నిజంగా పనులు జరిగాయా..?

గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో కాలువలను బాగు చేసేందుకు రూ.వందల కోట్లు ఖర్చు చేసినట్లు చూపిస్తున్నారు. కానీ ఎక్కడా కూడా కాలువలు బాగు చేసినట్లు కనిపించలేదు. ఓఅండ్ఎం, ఎఫ్‌డీఆర్ మాటును రూ.వందల కోట్ల పనులు జరిగాయి. కానీ ఇప్పుడు ఆ పనులు జరిగిన ప్రదేశాలను పరిశీలిస్తే అసలు ఇక్కడ పనులు జరిగాయా..? అన్న అనుమానం కలగకమానదు. కాలువల్లో పూడిక తీయకుండానే తీసినట్లు రికార్డు చేసి బిల్లులు తినేశారు. ఆఖరుకు కాంక్రీట్ వర్కుల్లోనూ వైసీపీ నేతల ఒత్తిళ్లకు అధికారులు బరితెగించారు. షట్టర్లు, స్లూయిజ్‌లు వంటివి ఏర్పాటు చేయకుండానే చేసినట్లుగా బిల్లులు రికార్డు చేశారు. కనుపూరు కాలువ, నక్కల కాలువ వంటి వాటిల్లో రూ.పదుల కోట్లలో పనులు జరిగినట్లు రికార్డు చేశారు. ఎఫ్‌డీఆర్ పనులు చేయకుండానే చేసినట్లుగా బిల్లులు తినేసినట్లు అప్పటి కలెక్టర్‌కు ఫిర్యాదులు అందడంతో ఆయన అంతర్గతంగా విచారణ చేయించుకొని వాస్తవాలను నిర్ధారించుకున్నారు. ఈ కారణం చేతనే ఆ మరుసటి ఏడాది ఒక్క రూపాయి కూడా ఎఫ్‌డీఆర్ పనులు మంజూరు చేయలేదు. వైసీపీ ప్రభుత్వంలో చివరి ఏడాదిలో లెక్కకు మించి ఓఅండ్ఎం పనులు మంజూరు చేయించుకున్నారు. సీజన్ మధ్యలో అనుమతులు తెచ్చి ఆ తర్వాత తూతూ మంత్రంగా పనులు చేసి బిల్లులు రికార్డు చేశారు. ఇలా అనుమతులు రావడం, అలా అగ్రిమెంట్లు చేయడం, ఆ వెంటనే పనులు పూర్తయినట్లు బిల్లులు రికార్డు చేయడం.. తదితర పనులన్నీ చకచకా జరిగిపోయాయి. ఈ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి క్వాలిటీ కంట్రోల్ అధికారులు సర్టిఫికెట్లు జారీ చేయాల్సి ఉంది. అయితే ఎంబుక్ రికార్డు చేయడమే ఆలస్యం వీరు సర్టిఫికెట్లు జారీ చేసేశారు. ఈ సర్టిఫికెట్లు జారీ చేయడంలో ఒక ప్రొసీజర్ ఫాలో అవ్వాల్సి ఉంది. ఎర్త్ వర్కులు అయితే లెవల్స్ తీయాలి. కాంక్రీట్ వర్కులు అయితే వాటి కోర్ తీసి ల్యాబ్‌లకు పంపాలి. కానీ చాలా వరకు ఇవేవీ జరగలేదు. అసలు లెవల్స్ కొలతలు తీయకుండానే క్యూసీ సర్టిఫికెట్లు జారీ చేసినట్లు ఆరోపణలున్నాయి. తాజాగా ప్రభుత్వం మారడంతో ఇరిగేషన్ శాఖలో జరిగిన అవినీతిపై ఎమ్మెల్యేలు దృష్టి పెట్టారు. చాలా వరకూ పనులు చేయకుండానే బిల్లులు పెట్టాల్సి వచ్చిందని ఇరిగేషన్ అధికారులు ఒప్పుకోవడంతో ఆ బిల్లులన్నీ ఇప్పుడు వెనక్కు వస్తున్నాయి. మరి ఈ వర్కులకు క్వాలిటీ కంట్రోల్ విభాగం సర్టిఫికెట్లు ఎలా జారీ చేసిందన్న ప్రశ్న ఇప్పుడు తలెత్తుతోంది.

ఆ ఇద్దరే అంతా...!

ఇరిగేషన్ శాఖలో జరిగే అన్నీ వర్కుల నాణ్యతను పరిశీలించేందుకు క్వాలిటీ కంట్రోల్ డివిజన్ నెల్లూరులో ఉంది. ఓ ఈఈతోపాటు నెల్లూరు, కలువాయిల్లో డీఈఈ కార్యాలయాలు ఉన్నాయి. వీరి కింద పలువురు ఏఈఈలు పనిచేస్తున్నారు. వర్కు స్థాయి, జరిగిన పనులను బట్టి ఈఈ నుంచి ఏఈఈ వరకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సి ఉంది. కానీ గత ప్రభుత్వంలో కార్యాలయాల నుంచి అడుగు బయటపెట్టకుండానే చాలావరకు సర్టిఫికెట్లు జారీ అయ్యాయన్న ప్రచారం ఉంది. గత ఐదేళ్లలో ఇద్దరు అధికారులే క్వాలిటీ కంట్రోల్ విభాగాన్ని శాసించారు. మొదట మూడేళ్లు ఒకరు, ఆ తర్వాత రెండేళ్లు మరొకరు ఇష్టారీతిన వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. మరీ ముఖ్యంగా చివరి రెండేళ్లలో అయితే తిరుపతిలో పనిచేసే ఓ అధికారి నెల్లూరులో క్వాలిటీ కంట్రోల్ విభాగం ఇన్‌చార్జిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. ఆయన ఓ ఈఎన్‌సీకు సన్నిహితుడు కావడంతో ఆయన ఆడిందే ఆటగా సాగినట్లు ఇరిగేషన్ శాఖలో చెప్పుకుంటున్నారు. సదరు అధికారి తిరుపతి నుంచి నెల్లూరుకు పనుల పరిశీలనకు వచ్చారంటే ఆయనకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా సపర్యలు చేసే బాధ్యత కాంట్రాక్టర్లు తీసుకోవాల్సి ఉంటుంది. సదరు అధికారి పదవీ విరమణ దగ్గర పడుతున్న కొద్దీ మరీ విచ్చలవిడిగా వ్యవహరించినట్లు చెప్పుకుంటున్నారు. ఇక మరో అధికారి అయితే ఏకంగా ఒకసారి జారీ చేసిన క్యూసీ సర్టిఫికెట్‌ను ట్యాంపరింగ్ చేశారంటే అక్కడ పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇరిగేషన్ సర్కిల్ పరిధిలోని ఓ ప్యాకేజీ ప్రీక్లోజ్‌కు సంబంధించి



మొదట రూ.14 కోట్లతో క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్ జారీ చేయగా, ఏడాదన్నర తర్వాత ఆ మొత్తాన్ని కొట్టేసి రూ.18 కోట్లుగా సర్టిఫికెట్లో మార్చారు. దీని గురించి తెలిసిన పెద్ద పెద్ద ఇంజనీర్లే సదరు అధికారి తీరుపై ముక్కున వేలేసుకుంటు న్నారు. ఇలా గత ఐదేళ్లలో క్యూసీ విభాగంలో భారీ అవినీతి జరిగినట్లు ఆరోపణలు వెల్లువె త్తుతు న్నాయి. పనులు చేయక పోయినా క్యూసీ సర్టిఫికెట్లు జారీ చేయడంపై ఇటీవల కొందరు ఎమ్మెల్యే లకు ఫిర్యాదు చేశారు. ఈ వారంలో ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు జిల్లాకు రానుండ డంతో ఇరిగేషన్ శాఖలో గత ఐదేళ్లలో జరిగిన అక్రమాలన్నింటినీ ఆయన దృష్టికి తీసుకెళ్లేందుకు ఎమ్మెల్యేలు సిద్ధమవుతున్నారు.

ఎవరా సీనియర్ సహాయకుడు ?

- ఆంధ్రజ్యోతి కథనంపై అధికారుల ఆరా

నెల్లూరు(సిటీ), జూలై 7 : నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో నగదు వసూళ్లకు పాల్పడుతున్న ఆ సీనియర్ సహాయకుడు ఎవరు...? ఇప్పటి వరకు అతడికి ఎవరెవరు డబ్బులు ఇచ్చారు... ఎంతిచ్చారు.. ఎందరుకిచ్చారు...? అన్న కోణాల్లో కార్పొరేషన్ ఉన్నతాధికారులు అంతర్గత విచారణ చేపట్టినట్లు తెలిసింది. తాజాగా ఫోర్జరీ సంతకాల స్కాంలో సస్పెండ్ అయిన ఇద్దరు చిరుద్యోగుల నుంచి రూ. లక్ష చొప్పున నగదు వసూలు చేయడంపై ఆదివారం ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై అధికారులు కూపీ లాగుతు న్నారు. గతంలో ఇద్దరు ఉద్యోగుల వద్ద నగదు వసూలు చేయడంపైన కూడా ఆరా తీస్తున్నారు. కాగా ఆరోగ్య విభాగంతో సంబంధాలున్న, పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులు, సచివాలయ కార్యదర్శులకు చార్జీమెమోలు జారీచేయడాన్ని ఈ ఘనుడు అవకాశంగా మలుచు కున్నాడు. వారిపై తదుపరి చర్యలు తీసుకోకుండా, తాను చూసుకుంటానంటూ నగదు వసూళ్లకు పాల్పడ్డట్లు తాజా సమాచారం.

ఆల్లుర్తిలో అయ్యగారి ఆగడాలు

- బినామీ పేర్లతో భూములు స్వాహా చేసిన విజిలెన్స్ అధికారి
- పైగా వడ్డీ వ్యాపారం, అక్రమంగా గ్రావెల్ తరలింపు
- తల్లి సర్పంచి కావడంతో రాజకీయ పెత్తనం



పొదలకూరు/నెల్లూరు, జూలై 7: నిజాయితీ.. నిబద్ధత.. క్రమశిక్షణతో పనిచేయాల్సిన నాలుగో సింహం ఒకటి దారి తప్పింది. తన నడవడికతో గ్రామస్థులకు ఆదర్శంగా ఉండాల్సిన ఆ విజిలెన్స్ అధికారి చేయకూడని పనులన్నీ చేస్తున్నాడు. రెండు దశాబ్దాలుగా గ్రామరాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నాడు. ఇప్పటికీ తన తల్లిని సర్పంచుగా ఉంచి, గ్రామంలో పెత్తనం చలాయిస్తున్నాడు. గ్రామంలో ఓ పది మందిని తన కోటరీగా మార్చుకుని బినామీ పేర్లతో సుమారు 90 ఎకరాలకు పైగా ఆక్రమించుకున్నాడు. అంతేకాక గ్రామంలో వడ్డీ వ్యాపారం చేస్తూ సకాలంలో నగదు చెల్లించని వారిని తన అధికారం బలంతో ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. పొదలకూరు మండలం అల్లుర్తి గ్రామంలో ఆయన మాటే శాసనంగా అమలు జరగాలి. కాదని ఎదురుతిరిగితే అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అల్లుర్తి సమీపంలోని కొండ నుంచి అక్రమంగా గ్రావెల్ తరలించి, రూ.లక్షలు దోచుకున్నాడు. ఇంకా పలు అభియోగాలు కూడా ఆయనపై ఉన్నాయి. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూడా టీడీపీ నాయకులను, కార్యకర్తలను బెదిరింపులకు గురి చేశాడు. ఈ క్రమంలో మాజీ మంత్రి సోమిరెడ్డి ఆయనపై ఆగ్రహిస్తూ.. ప్రజాధనాన్ని జీతంగా తీసుకునే ఉద్యోగి, ఉద్యోగిగానే వ్యవహరించాలని, రాజ కీయాల్లో జోక్యం తగదని బహిరంగంగా హెచ్చ రించారు. తాజాగా ఆయనగారి ప్రధాన అనుచరుడైన అంకయ్య అనే వ్యక్తిపై పొదలకూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. దీంతో ఆయన పోలీసులకు ఫోన్ చేసి అంకయ్యపై కేసు నమోదు చేయవద్దని, ఒకవేళ నమోదు చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని బెదిరించినట్లు తెలిసింది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించిగ్రామంలో విచారణ జరిపితే వాస్తవాలు వెలుగుచూస్తాయి.

నేటి నుంచే ఉచిత ఇసుక

- మూడు యార్డుల్లో విక్రయాలకు గ్రీన్‌సిగ్నల్
- టన్ను ధర రూ.370గా ఖరారు
- డిజిటల్ పేమెంట్‌తో సొంతంగా రవాణాకు అవకాశం
- భవన నిర్మాణదారులకు ఎంతో ఊరట

మినగల్లులోని ఇసుక స్టాక్ యార్డు



నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)/నెల్లూరు (వెంకటేశ్వరపురం), జూలై 7: వైసీపీ ప్రభుత్వ హయాంలో బంగారంలా మారిన ఇసుకను ప్రజలకు ఉచితంగా అందించాలని ఎన్డీఏ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎన్నికల్లో టీడీపీ కూటమి ఇచ్చిన హామీని నెరవేరుస్తూ సోమవారం నుంచి ఇసుకను ఉచితంగా ఇవ్వనున్నారు. జిల్లాలో తొలివిడతగా స్టాక్ యార్డుల్లో ఉన్న ఇసుకను ప్రజలకు అందించనున్నారు. రీచ్‌ల్లో తవ్వకాలకు పర్యావరణ అనుమతులు లేకపోవడంతో ప్రస్తుతానికి అక్కడ తవ్వకాలు జరగడంలేదు. పర్యావరణ అనుమతులు రాగానే రీచ్‌ల్లో కూడా ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయనున్నారు.

అందుబాటులో 1.74 టన్నుల ఇసుక

ప్రస్తుతానికి జిల్లాలోని మర్రిపాడు,మినగల్లు,పల్లిపాడు స్టాక్‌యార్డుల్లో 1.74 లక్షల టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. మర్రిపాడులో 1.25లక్షల టన్నులు, మినగల్లులో 41వేల టన్నులు,పల్లిపాడులో 8వేల టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయి. ఈ యార్డుల్లో ఉచిత ఇసుక విధానం ద్వారా టన్ను ధర రూ.370గా నిర్ణయించారు. రీచ్ నుంచి యార్డుకు తీసుకొచ్చిన రవాణా చార్జీలు, యార్డు ల్లో లోడింగ్ చార్జీలు, నిర్వహణ చార్జీలు, సీనరైజ్ చార్జీలు మొత్తం కలిపి రూ.370గా ఖరారు చేశారు. ఇందులో ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఆదాయం తీసుకోవడం లేదు. వైసీపీ ప్రభుత్వంలో ఇదే యార్డుల వద్ద టన్ను ఇసుక ధర సుమారుగా రూ. 800గా ఉండేది. ఈ లెక్కన చూసుకొంటే ఇసుక ధర సగానికిపైగా తగ్గినట్లే. ఇప్పటి వరకు ట్రాక్టర్ ఇసుక ధర రూ.5వేలు ఉండగా, ఇప్పుడు అది రూ.2వేలు నుంచి రూ.2,500 పలకనుంది. దీంతో భవన నిర్మాణదారులకు భారీ ఊరట కలుగనున్నది. పేద, మధ్యతరగతి వర్గాలకు కూడా ఎంతో లబ్ధి చేకూరనున్నది. జిల్లాలో ఉచిత ఇసుక విధానంపై కలెక్టర్ ఓ. ఆనంద్ అధ్యక్షతన ఆదివారం జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది. విధివిధానాలపై ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు.



ఉచిత ఇసుక విధానంపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ఆనంద్(ఫైల్)

నేడు మినగల్లు రీచ్‌ను ప్రారంభించనున్న ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం : సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు సోమవారం నుంచి ఉచిత ఇసుకను అందించనున్నారు. ఈ క్రమంలో మండలంలోని మినగల్ ఇసుక రీచ్‌ను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు.

నూతన విధివిధానాలు

- జిల్లాలోని స్టాక్ యార్డుల ద్వారా ఇసుక సరఫరా చేస్తారు.
- కూలీలు, రవాణా ఖర్చులు కలిపి టన్ను ఇసుకను రూ.370గా నిర్ణయించారు.
- యార్డుల వద్ద కేవలం ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం,క్యూఆర్‌కోడ్ ద్వారానే కొనుగోలు చేయాలి.
- ఎవరు ముందువస్తే వారికే ముందుగా ఇసుకను అందిస్తారు.
- ఓ వ్యక్తికి రోజుకు 20 టన్నులు మాత్రమే విక్రయిస్తారు.
- స్టాక్ యార్డు నుంచి ఇసుకను కొనుగోలు చేసిన వినియోగదారుడికి మైనింగ్‌శాఖ రసీదు అందిస్తారు.
- ప్రతీ స్టాక్ యార్డు వద్ద నూతన ఉచిత పాలసీ బ్యానర్‌ను ఏర్పాటు చేస్తారు.
- గ్రామాల్లోని వాగులు,వంకల్లో లభ్యమయ్యే ఇసుకను స్థానికులు ఎడ్లబండ్ల ద్వారా తీసుకుపోవచ్చు.
- ఇసుక సరఫరాలో ఎలాంటి అక్రమాలు జరిగినా 1800-425-6034 (టోల్‌ఫ్రీ),0861- 2943569 నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.
- ఇసుక విధానంపై ఎలాంటి సమస్యలు వచ్చినా పరిష్కరించేందుకు జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో మైనింగ్, సెబ్, పంచాయితీరాజ్, రెవెన్యూ శాఖల అధికారులు ఉంటారు.

సర్పంచులే మళ్లీ రారాజులు ?

- పంచాయతీలకు పూర్వవైభవం
- విస్తృతంగా ప్రభుత్వం చర్చలు
- 2019లో వైసీపీ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు
- నిర్వీర్యమైన పంచాయతీరాజ్ వ్యవస్థ
- రెండింటినీ అనుసంధానం చేసే దిశగా పాలకుల అడుగులు



వైసీపీ హయాంలో ఏర్పాటు చేసిన సంగం-1 సచివాలయం

సంగం, జూలై 7: గ్రామ పంచాయతీ వ్యవస్థకు పూర్వవైభవం తెచ్చేందుకు కొత్తగా ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వం యోచిస్తున్నది. ఆ దిశగా చర్చలు జరుపుతోంది. సచివాలయా లను, గ్రామ పంచా యతీలతో అనుసంధానం చేసేలా పాలకులు అడు గులు వేస్తున్నట్లు సమాచారం. 2019లో వైసీపీ ప్రభుత్వం అధి కారంలోకి వచ్చాక సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి, పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. దీంతో పంచాయతీ పాలక వర్గాలు ఉన్నా అవి ఉత్సవ విగ్రహాల్లా మారాయి. ప్రజలకు ఏ అవసరం వచ్చినా గ్రామ పంచాయతీలకు కాకుండా, సచివాలయాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సచివాలయ వ్యవస్థ నిర్వహణ బాధ్యత మాత్రం పంచాయతీలకు ఉన్నా, అందులో పనిచేసే ఉద్యోగులు పంచాయతీ పాల కుల అజమాయిషీలో లేకుండా పోయారు. దీంతో గత మూడేళ్ల నుంచి గ్రామ పంచాయతీల పాలకులు తమకు హక్కులు కల్పించాలని పలుమార్లు వైసీపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పాలకులు పట్టించుకోలేదు. దీంతో అటు సర్పంచులు కానీ, ఇటు పంచాయతీ కార్యదర్శులుకానీ ఏమి చేయలేకపోయారు.

విస్తృతంగా చర్చలు

సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పంచాయతీ రాజ్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలు, పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యంపై అధికారులతో సమీక్షించారు. గ్రామ పంచాయతీల స్థానంలో సచివాలయ వ్యవస్థను తీసుకురావడంతో అవి నిర్వీర్యమైనట్లు గుర్తించారు. ఈ విధానాన్ని మార్పుచేసేలాయత్నిస్తున్నారు.

పంచాయతీలకు గత వైభవం

జిల్లాలో 722 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 769 సచివాలయాలు ఉన్నాయి. కార్పొరేషన్, మున్సిపాలిటీల పరిధిలో మరో 203 సచివాలయాలు ఉన్నాయి. సచివాలయ వ్యవస్థలోని ఉద్యోగులు వైసీపీ ప్రభుత్వం ఏది చెబితే అదే చేయాల్సిన పరిస్థితి. ఆ సచివాలయాల పరిధిలోనే ప్రభుత్వ కార్యక్రమాలు జరుగుతున్న విషయాన్ని గుర్తించిన ఎన్డీఏ ప్రభుత్వం, అందులో పంచాయతీ వ్యవస్థకు పూర్వవైభవం తెచ్చే దిశగా అడుగులు వేస్తుంది.

పంచాయతీల పరిధిలో సచివాలయ ఉద్యోగులు ?

సచివాలయ వ్యవస్థలోని ఉద్యోగులను పంచాయతీల పరిధిలో భాగస్వామ్యం చేసే దిశగా కొత్త ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. ఈ ప్రక్రియ రెండు వారాల్లో పూర్తవుతుందనే ప్రచారం సాగుతోంది. ఇకపోతే గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో గ్రామాల్లో మీసేవ, ఏపీ ఆన్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రజలకు అన్నీ రకాల సేవలను అందుబాటులోకి తెచ్చారు. ఆ సేవలను కూడా మళ్లీ పునరుద్ధరించే అవకాశం ఉన్నట్లు తెలియవచ్చింది.ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా గ్రామాల అభివృద్ధితోపాటు ప్రజలకు సత్వర సేవలు అందుబాటులోకి తెచ్చేలా పాలకులు అడుగులు వేస్తున్నారు.

అమాంతం పెరిగిన బ్యారన్ల లీజు

- రాళ్లపాడులో వేలంపెట్టిన యజమానులు
- రూ.2,70లక్షలు పలికిన రేటు
- లైసెన్సులకు రూ.7 నుంచి రూ.8 లక్షల వరకు ఖర్చు
- పొగాకుకు మద్దతు ధర పెరగడమే కారణం

లింగసముద్రంలోని పొగాకు బ్యారన్‌లు



లింగసముద్రం, జూలై 7 : గత ఏడాది నుంచి పొగాకు మద్దతు ధర అమాంతంగా పెరిగింది. దీంతో బ్యారన్ల లీజుకు, లైసెన్సుల కొనుగోలుకు భారీగా డిమాండ్ ఏర్పడింది. ఫలితంగా బ్యారన్ల యజమానులు లీజు వేలం పాటలు నిర్వహిస్తున్నారు. బ్యారన్ లీజు రూ.2.70 వరకు పలికింది. గతంలో బ్యారన్ లీసు రూ.లక్ష నుంచి రూ.1.20 లక్షల వరకు ఉండేది. అలాగే లైసెన్సుకు రూ.7 నుంచి రూ.8 లక్షల వరకు ఖర్చు అవుతున్నది.

మద్దతు ధర పెరగడమే కారణం

ఈ ఏడాది మొదటి గ్రేడు క్వింటా పొగాకు ధర మొదట్లో రూ.23 వేలు, లోగ్రేడు రూ.21 వేలు పలికింది. ప్రస్తుతం మొదటి గ్రేడు క్వింటా పొగాకు రూ.36 వేలు పలికిందిగత ఏడాది మొదటి గ్రేడు క్వింటా పొగాకు రూ.27 వేలు, లో గ్రేడ్ రూ.18 వేలు నుంచి రూ.20 వేలు పలికింది. తాజాగా పొగాకు ధరలు అమాంతం పెరగడంతో బ్యారన్ల లీజులకు, లైసెన్స్‌ల కోసం రైతులు పరుగులు తీస్తున్నారు. ఇటీవల మండలంలోని రాళ్లపాడులో బ్యారన్ల లీజు కోసం రైతులు వేలంపాటలు నిర్వహించారు.ఈ వేలంలో ఓ రైతు బ్యారన్ లీజును రూ.2.70 లక్షలకు దక్కించుకున్నారు. అయితే బ్యారన్‌ను లీజుకు అగ్రిమెంట్ తీసుకున్న రైతు ఆ వివరాలను పొగాకు బోర్డులో తెలియజేయాలని అధికారులు తెలిపారు.

లైసెన్సుకు రూ.లక్షల వ్యయం

ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో బ్యారన్లను ఉపయోగించని రైతుల నుంచి ఆ బ్యారన్ లైసెన్స్ కోసం మండలంలోని కొందరు రైతులు గాలిస్తున్నారు. అయితే అలాంటి రైతులు బ్యారన్ లైసెన్స్‌ను రూ.7 లక్షల నుంచి రూ.8 లక్షలు చెబుతున్నట్టు మండలంలోని తిమ్మారెడ్డిపాలెం, లింగసముద్రం తదితర గ్రామాలకు చెందిన రైతులు చెబుతున్నారు.అయితే అంత మొత్తం చెల్లించినా బ్యారన్ల లైసెన్స్‌లు దొరకడం లేదని వారంటున్నారు. ఇకపోతే కూలీల రేట్లు కూడా విపరీతంగా పెరిగాయి.

వర్షాకాలంలో పిల్లలు జర భద్రం!

● వానల్లో చిన్నారులకు పొంచి ఉన్న వ్యాధులు
● తల్లిదండ్రుల అప్రమత్తత అవసరం

ఆత్మకూరు, జూలై 7: ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఎక్కడికక్కడ మురుగు నీరు నిలిచి దోమల ఉధృతి పెరగడంతో పాటు అనేకరకాల వ్యాధులు పొంచి ఉన్నాయని, ముఖ్యంగా చిన్నారులు వ్యాధుల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉందని తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల్లో ఎక్కువశాతం దోమల కారణంగానే వ్యాప్తి చెందుతాయి. మురుగు నీరు, చెత్తాచెదారం నిల్వ ఉన్నచోట వీటి ఉధృతి పెరుగుతుంది. ప్రాణాంతకమైన డెంగీ, చికున్‌గున్యా వ్యాధులు వ్యాపిస్తాయి. ఆత్మకూరు నియోజకవర్గంలో దోమల ఉధృతి ఎక్కువైంది. ఎటువంటి అనారోగ్య లక్షణాలు కనిపించినా అశ్రద్ధ చూపకుండా పరీక్షలు చేయించాలి.


ఆరోగ్య సలహాలు ఇస్తున్న వైద్యురాలు అస్మా

తీసుకోవాల్సిన జాగ్రత్తలు: పాఠశాలల్లో క్లోరినేషన్ చేసిన నీటినే విద్యార్థులు తాగేలా చూడాలి. ఇళ్ల వద్ద తల్లిదండ్రులు కాచిచల్లార్చిన నీటిని ఇవ్వడం శ్రేయస్కరం. తాజా ఆహారం తీసుకోవాలి. తినుబండారాలపై ఈగలు వాలకుండా జాగ్రత్తలు వహించాలి. ఆహారం తినేముందు, తరువాత మల, మూత్ర విసర్జన తరువాత విద్యార్థులు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకునేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు దృష్టిసారించాలి. పరిసరాల పరిశుభ్రతతో పాటు బహిరంగ మల, మూత్ర విసర్జన చేయరాదు. డ్రైన్లు, నీరు నిలిచిన చోట కిరోసిన్, బ్లీచింగ్, మడ్డి ఆయిల్, దోమల నివారణ మందులు చల్లుకోవడం మంచిది. వర్షం కురుస్తున్నప్పుడు పిల్లలు బయటకు వెళ్లాల్సి వస్తే తప్పకుండా రెయిన్‌కోటు, గొడుగులు తీసుకెళ్లాలి. ముఖ్యంగా తల తడవకుండా చూసుకోవాలి. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద చెత్తాచెదారం, మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలి. పాఠశాలల్లో సెప్టిక్‌ట్యాంకుల గొట్టాలపై దోమలతెర, ఇనుప జల్లెడులను ఏర్పాటు చేయాలి. ఆరుబయట తినుబండారాలను చిన్నారులు తినకుండా చూసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న సభ్యులు

ఉదయగిరి రూరల్, జూలై 7: స్థానిక ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ కార్యాలయంలో ఆదివారం ఆదర్శ యువత-ఆదర్శ సమాజం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐవైఎం జిల్లా, మండల అధ్యక్షుడు ఇందాదుల్లా, మునాఫ్‌లు మాట్లాడారు. ఈ నెల 5 నుంచి 14వ తేదీ వరకు ఆదర్శ యువత, ఆదర్శ సమాజం పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశ జనాభాలో 54శాతం మంది యువతే ఉన్నారన్నారు. వారిలో నైతిక విలువలు తీసుకొచ్చి సమాజాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో జమాతే ఇస్లామ్ హింద్ ఉదయగిరి అధ్యక్షులు సిద్ధిఖ్, ఎస్ఐవో జిల్లా అధ్యక్షుడు అజరుల్లా, సభ్యులు వహీం పాల్గొన్నారు.

పదవీ విరమణ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

ఉదయగిరి రూరల్, జూలై 7: పదవీ విరమణ పొందిన దుత్తలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాంఘికశాస్త్ర ఉపాధ్యా యుడు షేక్ మున్జీర్‌అహ్మద్‌ను ఆదివారం స్థానిక షాదీమంజిల్‌లో ఉపాధ్యాయులు, బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలా షులు ఘనంగా సన్మానించారు. 41 ఏళ్లపాటు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించి ఎందరో విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దారన్నారు. ప్రతి ఒక్కరూ మున్జీర్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఇక నుంచి ఆయన శేషజీవితం ఆనందంగా గడవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈవోలు మోహన్‌రావు, ఓబులరెడ్డి, అల్లాభక్షు, యూటీఎఫ్, ఏపీటీఎఫ్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ధ్యానంతో వ్యాధుల దూరం

ఆత్మకూరు, జూలై 7: ధ్యానంతో వ్యాధులకు గురికాకుండా ఉండవచ్చని సీనియర్ పిరమిడ్ మాస్టర్ డాక్టర్ చంద్రా సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం మున్సిపాల్టీ పరిధిలోని టీ.ముస్తాపురం సమీపంలో ఉన్న పిరమిడ్ ధ్యానకేంద్రంలో ఉచిత ధ్యాన శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్యానంతో బుద్ధిబలం పెరగడంతో పాటు రోగాలు దూరమవుతాయన్నారు. సంపూర్ణ ఆరోగ్యానికి శాఖాహారం ఉపయుక్తమని తెలిపారు. అనంతరం టీ ముస్తాపురం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు పిరమిడ్ మాస్టర్లు, ధ్యానసాధకులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్‌మన్‌కు సన్మానం


లైన్‌మన్‌ను సత్కరిస్తున్న ఉద్యోగులు

అనంతసాగరం, జూలై 7: విద్యుత్ శాఖలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్న సయ్యద్ బషీర్ ఉద్యోగ విరమణ చేయడంతో ఆదివారం స్థానిక ఫంక్షన్ హాల్‌లో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖాధికారులు, సీఐటీయూ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


వెంకటంపేటకు వెళ్లే దారిలో గుంత

ఉదయగిరి, జూలై 7: ఉదయగిరి ప్రాంతంలో ప్రైవేట్ నెట్‌వర్కుల ఆధ్వర్యంలో జరుగుతున్న పనులతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. రెండురోజులుగా స్థానిక ఏబీఎం చర్చి సమీపం నుంచి వెంకటంపేట వరకు ఓ ప్రైవేటు నెట్‌వర్కు కంపెనీ కేబుల్ పనుల కోసం ప్రధాన రహదారుల వెంట గోతులు తీసింది. ఈ ప్రాంతాల్లో ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. శనివారం ఉదయగిరికి చెందిన ఓ ప్రైవేటు వైద్యుడు కారును అక్కడ ఆ కంపెనీ తరఫున పనిచేస్తున్న ఎక్స్‌కవేటర్ తగలడంతో ప్రమాదం తప్పింది.

బకాయి బిల్లులు వచ్చేలా చూడాలి


పూడిక పనులు చేయిస్తున్న ఉపసర్పంచి

అనంతసాగరం, జూలై 7: గ్రామాభివృద్ధికి తాను చేసిన పనులకు సంబంధించి బిల్లులు రాకుండా స్థానిక నాయకులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని సోమశిల ఉపసర్పంచ్ మహబుబ్‌బాష వాపోయారు. ఆదివారం స్థానికంగా మురుగుకాలువల పూడికతీత పనులు చేయించారు. సోమశిల పంచాయతీ ఏకగ్రీవ ఎన్నికకు తాను సహకరించానని, తనతో పాటు మరో నాయకుడిని రెండున్నరేళ్ల పాటు పాలన సాగించేలా పెద్దలు పంచాయతీ తీర్మానం చేశారని చెప్పారు. అయితే 2021 నుంచి గ్రామాభివృద్ధి కోసం సుమారు రూ. 7లక్షలు ఖర్చు చేశానని అందుకు సంబంధించిన బిల్లులు రాకుండా నాయకులు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

వైభవంగా నాగార్పమ్మ మహోత్సవం


వరికుంటపాడు: పొంగళ్ల సామగ్రితో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు


అనంతసాగరం ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఉదయగిరి రూరల్, జూలై 7: సున్నంవారిచింతలలో వెలసిన నాగారప్పమ్మ మహోత్సవాన్ని ఆదివారం భక్తులు వైభవంగా నిర్వహించారు. వేకు వజామున అమ్మవారికి గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశ, కంకణపూజ, నవగ్రహ మండపారాధన అనంతరం నిర్వహించి గ్రామోత్సవం నిర్వహించారు. ఊరేగింపుగా బయలుదేరి బండ్లపొంగళ్ల చేపట్టారు.

వరికుంటపాడు: విరువూరు మారుతీనగర్‌లో వెలసిన గ్రామ దేవతకు ఆదివారం భక్తులు పొంగళ్ల కార్యక్రమం నిర్వహించారు. నివాసాల నుంచి ప్రత్యేకంగా అలంకరించిన పాత్రల్లో పొంగళ్ల సామగ్రిని ఊరేగింపుగా అంకాళమ్మ, పోలేరమ్మ ఆలయాలకు చేర్చి ప్రదక్షిణలు చేపట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించడంతో పాటు భక్తులకు పంచి పెట్టారు. సకాలంలో వర్షాలు కురిసి ప్రజలు, రైతులు పాడిపంటలు, ఆయురారోగ్యాలతో జీవనం సాగించాలని వేడుకున్నారు.

అనంతసాగరం: మండలంలోని పాతదేవరాయపల్లి గ్రామదేవత తుమ్మాలమ్మ తిరునాళ్ల వైభవంగా జరిగింది. మహిళలు పెద్దఎత్తున ఆలయానికి చేరుకొని పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు.

సంగం: కోలగట్ల పెన్నా నది ఒడ్డున ఉన్న నాగారపమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌కు క్షీర, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్నం అన్నదాన ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


సంగం: నాగార్పమ్మకు పూజలు చేస్తున్న భక్తులు


ఉదయగిరి రూరల్: అలంకరణలో అమ్మవారు

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినం


వరికుంటపాడు: సంబరాలు జరుపుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూలై 7: స్థానిక సెంటర్‌లో ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావదినం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల కమిటీల ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు గొల్లపల్లి శ్రీనివాస్‌మాదిగ కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి సంబరాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఏర్పాటు అనంతరమే మాదిగలకు ఆత్మగౌరవం, ఐక్యత, హక్కులు దక్కాయన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఎ మ్మార్పీఎస్ నాయకులు గొల్లపల్లి మోహన్‌రావు, గంగపట్ల సింహాద్రి, యద్దనపూడి రమణయ్య, బెజవాడ బాలగురవయ్య పాల్గొన్నారు.

వరికుంటపాడు: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ తాతిపూడి డేవిడ్ జెండాను ఆవిష్కరించి సంబరాలు జరుపుకున్నారు. అలాగే వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ జన్మదినం సందర్భంగా కేక్ కట్‌చేసి పంచి పెట్టారు. అనంతరం నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో నాయకులు కాకి అంకయ్య, చేవూరి రవితేజ, కొండిపోగు ప్రసాద్, బక్కా శ్రీనివాసులు, హరి, ప్రభాకర్, యశ్వంత్‌పాల్ పాల్గొన్నా రు.

కలువాయి: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు కలువాయిలో సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చల్లా రఘురామిరెడ్డి, చల్లా శ్రీనివాసులరెడ్డి, ఎమ్మా ర్పీఎస్ మండల అధ్యక్షులు దండు భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.


కలువాయి: జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో టీడీపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు

అన్నా.. ఆ పోస్టు నాకివ్వాలి !

● ఫీల్డ్ అసిస్టెంట్, రేషన్ డీలర్ పోస్టులకు భారీగా డిమాండ్
● ఒక్కో గ్రామంలో ఐదు నుంచి ఏడుగురి పోటీ
● తలలు పట్టుకుంటున్న ద్వితీయశ్రేణి నాయకులు

ఉదయగిరి రూరల్, జూలై 7: ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్, రేషన్ డీలర్ల పోస్టులకు ఆశావహుల నుంచి పోటీ పెరిగింది. పలు గ్రామాల్లో తమ కంటే తమకే పోస్టులు ఇప్పించాలని టీడీపీ కార్యకర్తలు పోటీ పడుతున్నారు. దీంతో పార్టీలోని ద్వితీయశ్రేణి నాయకులు తలలు పట్టుకుంటున్నారు. నియోజకవర్గంలోని సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు, వింజమూరు, కలిగిరి, కొండాపురం, జలదంకి మండలాల్లో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులకు ఒక్కో గ్రామంలో ఐదు నుంచి ఏడుగురి వరకు పోటీ పడుతున్నారు. పోటీపడే వారంతా ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం పనిచేసిన వారే. రేషన్ డీలర్ల నియామకానికి కూడా ఇదే స్థాయిలో డిమాండ్ ఉంది. ఇప్పటికే పలువురు డీలర్లు రాజీనామా చేశారు. అలాగే వలంటీర్ పోస్టులకు కూడా పోటీ తీవ్రంగానే ఉంది.

● రూ. లక్షలు ఇచ్చేందుకు సిద్ధం

ఆయా పోస్టులు దక్కించుకునేందుకు ఆశావహులు రూ.లక్షలు ఇచ్చేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీన్ని బట్టి చూస్తుంటే ఆ పోస్టులకు ఎంత డిమాండ్ ఉందో అర్థం అవుతుంది. పోటీ అధికంగా ఉండడంతో ఆశావహులు ఎవరికి వారే తమ తమ మార్గాల్లో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వద్దకు క్యూకడుతున్నారు.

● సమష్టి నిర్ణయంతో ఎంపిక

ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేసిన వారికే తగిన గుర్తింపు ఇచ్చేలా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ముందుకు వెళుతు న్నట్లు సమాచారం. మండలాల వారీగా సమావేశాలు నిర్వహిం చి నేతలందరి సమష్టి నిర్ణయం మేరకే పోస్టులు భర్తీ చేస్తా మని ఆయన పార్టీ నేతలకు సూచించినట్లు తెలిసింది.

● ఫీల్డ్ అసిస్టెంట్లలో ఆందోళన

గత వైసీపీ ప్రభుత్వంలో పనిచేసిన ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్లలో ఆందోళన నెలకొంది. ఉపాధి హామీ పథకంలో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలను బయటకు తీయాలని ఇటీవల డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు. సామాజిక తనిఖీలు కూడా సక్రమంగా జర గలేదని, బినామీ మస్టర్లు, మొక్కలు నాటకుండానే నాటినట్లు బిల్లులు స్వాహా చేశారని, తది తర వాటిపై క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధ్యులపై చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్లలో ఆందోళన నెలకొంది.

సీపీఐ నేత చౌడారెడ్డికి ఘన నివాళి

కందుకూరు, జూలై 7: సీపీఐ నేత చౌడారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆదివారం సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు, నాయకులు ఆనంద్‌మోహన్, వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడు బోట్లను నిలువరించండి

● ఆరోగ్య శాఖా మంత్రికి మత్స్యకార నాయకుల వినతి


మంత్రిని అభినందిస్తున్న కొండూరు మాధవ్

అల్లూరు, జూలై 7: తమిళనాడుకు చెందిన బోట్లు నెల్లూరు, ప్రకాశం జిల్లాల తీరప్రాంతాల్లో చేపల వేటను సాగిస్తూ స్థానిక మత్స్యకారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నందున వాటిని నిలువరించి మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలని అల్లూరు మండలం ఇస్కపల్లిపాలెంకు చెందిన మత్స్యకార నాయకుడు కొండూరు మాధవ్ రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్‌ను కోరారు. ఆదివారం విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో ఆయన్ను కలుసుకొని స్థానికంగా మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన కడలూరు, కారకలై ప్రాంతాలకు చెందిన బోట్లు అక్రమంగా సముద్రంలో తమ భూభాగంలోకి చొరబడి చేపల వేటను కొనసాగిస్తున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా, నెల్లూరు జిల్లాల్లో ఈవిధంగా గత కొంత కాలంగా అక్రమ వేటను కొనసాగిస్తుండడంతో తమ ప్రాంత మత్స్యకారులకు జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఈ సమస్యను పరిష్కరించకుంటే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని పేర్కొనడంతో, ఇందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు వావిల సుధాకర్, ప్రళయకావేరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సాయిసాధుడికి ప్రత్యేక పూజలు


మాట్లాడుతున్న మందిర వ్యవస్థాపకులు

బిట్రగుంట, జూలై 7: బోగోలు మండలం బిట్రగుంట ద్వారకా నగరులోని శేషసాయి మందిరంలో ఆదివారం షిర్డి శేషసాయిసాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, ఈనెల 21న జరుగు గురుపౌర్ణమి వేడుకలకు సంబంధించి మందిర వ్యవస్థాపకుడు కుట్టుబోయిన బ్రహ్మానందం ఆధ్వర్యంలో కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బ్రహ్మానందం మాట్లాడుతూ 19, 20, 21 తేదీల్లో ప్రత్యేక పూజలు తదితర కార్యక్రమాలతో పాటు అంతర్ జిల్లా ఎడ్ల బండలాగుడు పోటీలు జరుగుతాయన్నారు. ఈ సమావేశంలో శ్రీనివాసులు, బాలయ్య, సుబ్రహ్మణ్యం, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ

కావలిటౌన్, జూలై 7: టీవీఎస్ మెమోరియల్ ట్రస్ట్‌చే ఆదివారం పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించారు. ట్రస్ట్ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు తన సొంత నిధులతో చేపట్టిన కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులతో పాటు పలువురు సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో జీ హరనాధ్, సుబ్బరాయశర్మ, మాల కొండారెడ్డి, జమీర్, శివయ్య, మురళీకృష్ణ పాల్గొన్నారు.

రక్తదానం

కావలిటౌన్, జూలై 7: లైఫ్‌లైన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తాడికొండ నవీన్ తన తండ్రి రామమూర్తి వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం రెడ్‌క్రాస్ రక్తనిధిలో రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ రవి ప్రకాష్, ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు కృష్ణయ్య, మధురెడ్డి, మేడం కాటంరెడ్డి, మాలకొండారెడ్డి పాల్గొన్నారు.

బ్రాహ్మణ మహా సంఘం కార్యవర్గం ఎన్నిక

కావలిటౌన్, జూలై 7: పట్టణ పాతూరులోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం బ్రాహ్మణ మహాసంఘం అధ్యక్షుడు పీవీఎస్ ప్రసాద్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. అనంతరం ఎన్నికల అధికారిగా రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవం కాగా నూతన కార్గవర్గంచే ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. గతంలో బ్రాహ్మణ మహాసంఘం ఆధ్వర్యంలో అనేక సేవాకార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినందున అదే కార్యవర్గంలోని అన్ని పోస్టులు ఏకగ్రీవమయ్యాయన్నారు.

కాపు హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడిగా అడపా రంగయ్య



లింగసముద్రం, జూలై 7: కందుకూరు నియోజకవర్గ కాపు హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడిగా లింగసముద్రం టీడీపీ నాయకుడు అడపా రంగయ్య ఎంపికయ్యారు. ఈమేరకు కాపు హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి ఫణికుమార్ నుండి రంగయ్యకు ఉత్తర్వులు అందాయి. కందుకూరు నియోజకవర్గ బాధ్యతలు చేపట్టి కాపు కమ్యూనిటీకి చెందిన కులాలు మరియు ఉప కులాల అభ్యున్నతికి, అభివృద్ధికి కృషి చేయాలని ఆ ఉత్తర్వుల్లో ఫణికుమార్ పేర్కొన్నారు. తనపై నమ్మకముంచి అప్ప గించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించేందుకు కృషిచేస్తానని రంగయ్య చెప్పారు. ఈసందర్భంగా రంగయ్యను పలువురు అభినందించారు.

టీడీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలిగా షేక్ అర్షియా బేగం నియామకం



కావలి, జూలై 7: కావలి పట్టణ టీడీపీ మహిళా అధ్యక్షురాలిగా షేక్ అర్షియా బేగంను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ అజీజ్ నియామక పత్రం పంపించారు. గతంలో టీడీపీ మహిళా అధ్యక్షురాలిగా ఉన్న ద్రోణాదుల వాసంతి సార్వత్రిక ఎన్ని కలకు ముందు వైసీపీలో చేరారు. దీంతో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి సూచన మేరకు షేక్ అర్షియా బేగంను నూతన అధ్యక్షురాలిగా జిల్లా అధ్యక్షుడు నియ మించారు.

డిప్లమా కోర్సుతో ఉద్యోగావకాశాలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న కృష్ణమోహన్

కందుకూరు, జూలై 7: డిప్లొమా మూడేళ్ల చిన్న కోర్సు అయినా ఉద్యోగం, ఉన్నత చదువుల్లో ఉజ్వలమైన అవకాశాలుంటాయని ఎన్నారై ఎంఎస్సీ సీటీఓ సిహెచ్ కృష్ణమోహన్ పేర్కొన్నారు. స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమా విద్యార్థినీ, విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణమోహన్ మాట్లాడుతూ ఉన్నతవిద్య పట్ల ఆసక్తి ఉంటే మూడేళ్లలోనే బీటెక్ డిగ్రీ పూర్తిచేసుకుని పీజీ కోర్సులకు వెళ్లేందుకు కూడా అవకాశం ఉంటుందన్నారు. కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య మాట్లాడుతూ డిప్లొమా అంటే సమాజంలో చిన్నచూపు ఉందని, కానీ డిప్లొమా ద్వారా అద్భుతమైన అవకాశాలు అందిపుచ్చుకునే పరిస్థితులు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో కళాశాల టెక్నికల్ డైరక్టర్ కె విజయ్‌శ్రీనివాస్, ప్రిన్సిపాల్ డాక్టరు సిహెచ్ రవికుమార్, అకడమిక్ ఇన్‌చార్జిలు మీరావలి, గురుశేషు, సులోచన పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవా సంఘంలో అల్లూరీయులకు స్థానం


అల్లూరు మండలం నుంచి ఎంపికై ప్రమాణం చేస్తున్న బ్రాహ్మణ సేవాసంఘం నాయకులు

అల్లూరు, జూలై 7: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బ్రాహ్మణ సేవా సంఘంలో కార్యవర్గ సభ్యులుగా అల్లూరు బ్రాహ్మణులకు స్థానం దక్కింది. ఆదివారం నెల్లూరులో నిర్వహించిన కార్యవర్గ ఎంపికలో అల్లూరుకు చెందిన బ్రాహ్మణ సేవా సంఘంలోని సభ్యులకు జిల్లా నూతన కార్యవర్గంలో స్థానం దక్కడంతో అల్లూరు మండల బ్రాహ్మణ సంఘం హర్షం వ్యక్తం చేసింది. జిల్లా ఉపాధ్యక్షుడిగా కామకోలను వేంకట రాధాకృష్ణారావు, కార్యవర్గ సభ్యులుగా గూడా సుధాకర్‌రావు, ధూళిపాళ్ల గోపాల్, కాళహస్తి రాధాకృష్ణతోపాటు మహిళా విభాగంలో సంయుక్త కార్యదర్శిగా అన్నదాత రమాదేవి, అర్చక సమాఖ్య విభాగంలో ఉపాధ్యక్షుడిగా ముప్పిరాల అనీల్ శర్మ, జిల్లా అర్చక పురోహిత ఉపాధ్యక్షుడిగా ఉదయగిరి వేంకట ఫణిసాగర్ దీక్షితులు, యువజన ఉపాధ్యక్షుడిగా కారుమంచి కార్తీక్ శర్మ, కార్యవర్గ సభ్యులుగా కోదాటి నాగార్జున శర్మ, కారుమంచి సుబ్బారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అల్లూరు మండలం నుంచి ఇంతమంది జిల్లా బ్రాహ్మణ సేవా సంఘం కార్యవర్గ సభ్యులుగా నియమతులవడంతో బ్రాహ్మణ సమాజం శుభాకాంక్షలు తెలిపింది.

చినుకు పడితే రైతుబజారు రొచ్చు రొచ్చు..


రైతుబజారు ప్రధాన ద్వారం వద్ద రొచ్చు రొచ్చుగా ఉన్న దారి

కావలి, జూలై 7: చినుకు పడితే చాలు కావలి రైతుబజారు రొచ్చురొచ్చుగా మారి అవస్థలు పడాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతు బజారులోకి వెళ్లే రెండు ప్రధాన ద్వారాల నుంచి రాకపోకలు సాగించాలంటే బురదలో నడవాల్సి వస్తోంది, వర్షపు నీరు రోడ్డుపై నిలవడంతో రైతుబజారుకు వచ్చిన వినియోగదారులు తమ ద్విచక్ర వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేయాల్సి వస్తోంది. దీంతో ఆమార్గంలో రాకపోకలకు ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అలాగే రైతు బజారు ముందు వాహనాల పార్కింగ్‌కు అవకాశం లేకుండా ఆక్రమణదారులు ముందుకు రావడంతో రైతుబజారులోకి కూరగాయలు కొనుగోలుకు రాకపోకలు సాగించాలంటే వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికలకు ముందు అక్కడ ఉన్న డ్రైనేజిలో పూడిక తీసి దానిని తరలించకుండానే అక్కడ రోడ్డు చదును చేశారు. దీంతో వర్షం పడితే ఆనీరు కాలువలోకి వెళ్లకుండా నిలబడి రొచ్చురొచ్చుగా తయారవుతోంది. దీంతో ఆరోడ్డుపై నడిచే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి రోడ్డు వెంబడి ఉన్న పూడిక మట్టిని తొలగించి అక్కడ వర్షపునీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని, రైతు బజారు ముందు ఉన్న ఆక్రమణలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

కలుషిత నీటితో ప్రజల అవస్థలు


పచ్చరంగులో ఉన్న మంచి నీరు

లింగసముద్రం, జూలై 7: రాళ్లపాడు ప్రాజెక్టు ఆధారంగా ఉన్న భారీ మంచినీటి పథకాల ద్వారా వచ్చే మంచినీరు చాలా కాలం నుంచి రంగుమారి కలుషితమై వస్తోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రాజెక్టు ఆధారంగా గుడ్లూరు ఫేస్-1, ఫేస్-2 మంచినీటి పథకాల నుంచి లింగసముద్రం, గుడ్లూరు, ఉలవపాడు మండలాల్లోని 54 గ్రామాలకు, రాళ్లపాడు-రోళ్లపాడు మంచినీటి పథకాల నుంచి 48 గ్రామాల పరిధిలోని ప్రజలకు మంచినీటిని సరఫరా చేస్తున్నారు. అయితే ఈ పథకాల నుంచి వచ్చే నీరు పచ్చరంగులో కలుషితమై వస్తోందని పెదపవని గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు దనుం మధు మరికొందరు చెప్పారు. ఈ నీటితో స్నానం చేస్తే దురదలు వస్తున్నాయని చెప్పారు. అంతేగాక నీటిలో చిన్న చిన్న పురుగులు కూడా ఉంటున్నాయని, దీంతో ప్రజలు ఈ నీటిని తాగడం లేదన్నారు. ప్రజలు రూ.10 పెట్టి మినరల్ వాటర్‌ను కొంటున్నారని ఆయన చెప్పారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం


కావలి టౌన్: జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నేతలు

కావలి టౌన్, జూలై 7: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ట్రంకురోడ్డులోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. సీనియర్ నాయకుడు కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు మందా వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ ఒక కుల సంఘంగా ఏర్పడిన ఎమ్మార్పీస్ సమాజహితం కోరే గొప్ప ఉద్యమ సంస్థగా అవతరించిందన్నారు. కార్యక్రమంలో గేరా జానకి, కత్తి శివయ్య, చేవూరు వరప్రసాద్, జార్జి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

బిట్రగుంట : బోగోలు మండలం బేతనీపేటలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బోగోలు పట్టణాధ్యక్షుడు మర్లపాటి మోషేబాబు ఆధ్వర్యంలో ఆదివారం జరిగాయి. జెండా ఆవిష్కరణ చేసి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పోతల శీనయ్య, గ్రామపెద్దలు తదితరులు ఉన్నారు.

కలిగిరి: కలిగిరి పట్టణంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మండల అధ్యక్షుడు నందిపోగు వెంగలరావు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణ పోరాటంలో అశువులు బాసిన మాదిగ అమరవీరుల త్యాగాలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో వర్లా కొండయ్య, గోసాల కొండలరావు, ఐమూరి మోజేస్, బొర్రా వెంగళరావు పాల్గొన్నారు.